www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బ్యాంకులకు సీఆర్ఆర్ బూస్ట్



- 4.5% నుంచి 4 శాతానికి తగ్గిన నగదు నిల్వల నిష్పత్తి
- బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల నిధులు
- 6.5% రెపో రేటు యథాతథం.. రుణగ్రహీతలకు మళ్లీ నిరాశే
- జీడీపీ వృద్ధి అంచనా 6.6%కి కుదింపు.. ద్రవ్యోల్బణం అంచనా 4.8%కి
- ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష.. ఆర్‌బీఐ నిర్ణయాలు

కొత్త ఏడాదిలో కార్ల ధరలకు రెక్కలు.. ఇప్పటికే 3% పెంచిన కంపెనీలు

శనివారం | 7-12-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 249 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 11.06 తదుపరి సప్తమి; నక్షత్రం: ధనిష్ఠ సా. 4.50 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.11.47-1.20; దుర్ముహూర్తం: ఉ.6.36-8.04; అమృతఘడియలు: ఉ.6.38-8.12; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఈ క్యాలెండర్ ఏడాదిలో 50 టెస్టు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా బుమ్రా.

1

టెస్టుల్లో మొదటి బంతికే ఎక్కువసార్లు (3) వికెట్ తీసిన బౌలర్‌గా పెడ్రో కొలిన్స్‌తో సమంగా నిలిచిన స్టార్క్.

కెరీర్‌లో ఉత్తమ గణాంకాలు (6/48) నమోదు చేసిన స్టార్క్‌కు భారత్‌పై 5+ వికెట్లు తీయడం ఇదే తొలిసారి. అలాగే గులాబీ టెస్టుల్లో అత్యధికంగా నాలుగుసార్లు ఈ ఫీట్ సాధించిన బౌలర్‌గా నిలిచాడు.

తొలి రోజు.. తేలిపోయారు!

భారత్ మొదటి ఇన్నింగ్స్ 180 ఆలౌట్

- ఆకట్టుకున్న నితీశ్
- స్టార్క్‌కు ఆరు వికెట్లు
- ఆస్ట్రేలియా 86/1
- పింక్‌బాల్ టెస్టు



స్టార్క్ (6/48)

అడిలైడ్: గులాబీ టెస్టును టీమిండియా పేలవంగా ఆరంభించింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/48) స్వింగ్ బౌలింగ్ ధాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ కనీసం 200 పరుగులు కూడా చేయలేకపోయింది. కనీసం బౌలర్లయినా ప్రత్యర్థిని ఇబ్బందిపెడతారనుకుంటే.. వారూ తేలిపోయారు. ఫలితంగా మొదటి రోజు అన్ని విభాగాల్లోనూ ఆతిథ్య ఆస్ట్రేలియానే ఆధిపత్యం చూపింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే కుప్పకూలింది. చివర్లో నితీశ్ కుమార్ (42) మెరుపు బ్యాటింగ్ కారణంగా ఆ మాత్రం స్కోరైనా నమోదయ్యింది. భారత్ ఇన్నింగ్స్‌లో నితీశ్‌దే టాప్ స్కోర్ కావడం విశేషం. రాహుల్ (37), గిల్ (31) ఫర్వాలేదనిపించారు. పేసర్లు కమిన్స్, బోలాండ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. క్రీజులో ఓపెనర్ మెక్‌స్వీనే (38 బ్యాటింగ్), లబుషేన్ (20 బ్యాటింగ్) ఉన్నారు. ఏకైక వికెట్ బుమ్రాకు దక్కింది. శనివారం తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా వికెట్లు తీయగలిగితేనే ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంటుంది.

తొలి బంతికే వికెట్: టాస్ గెలిచిన భారత్ వెంటనే బ్యాటింగ్ ఎంచుకుంది. వాస్తవానికి పింక్ బాల్ టెస్టులో తొలి రెండు రోజులు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. కానీ భారత బ్యాటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. అటు ఆసీస్ పేసర్లు మాత్రం కొత్త బంతితో చెలరేగారు. ముఖ్యంగా గులాబీ టెస్టంటే రెచ్చిపోయే స్టార్క్ ఈసారి కూడా బెదరగొట్టాడు. బంతిని ఇరువైపులా స్వింగ్ చేస్తూ అతడు సాగించిన విధ్వంసానికి భారత బ్యాటర్లు చకచకా పెవిలియన్ బాట పట్టారు. మ్యాచ్ తొలి బంతికే జైస్వాల్‌ను గోల్డెన్ డకౌట్ చేశాడు. ఆ తర్వాత బరిలోకి దిగిన గిల్ అదే ఓవర్‌లో రెండు ఫోర్లతో జట్టు పరుగుల ఖాతాను తెరిచాడు. అటు మరో ఓపెనర్ రాహుల్ ఓపిగ్గా క్రీజులో నిలిచే ప్రయత్నం చేశాడు. అయితే అతను బోలాండ్ ఓవర్‌లో డకౌట్ అయినప్పటికీ నోబ్ వేయడంతో బతికిపోయాడు. అదే ఓవర్‌లో అతను ఖవాజాకు క్యాచ్ ఇచ్చినా పట్టలేకపోయాడు. తానెదుర్కొన్న 20వ బంతికి రాహుల్ తొలి పరుగు సాధించాడు. కమిన్స్ ఓవర్‌లో అతను రెండు వరుస ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. గిల్ కూడా నిలకడను కనబర్చడంతో ఇద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కానీ టీ విరామానికి నాలుగు ఓవర్ల ముందు భారత్ తడబడింది. స్టార్క్ విజృంభించి వరుస ఓవర్లలో రాహుల్, విరాట్ కోహ్లీ (7) వికెట్లు తీయగా.. గిల్‌ను బోలాండ్ అవుట్ చేయడంతో జట్టు 69/1 నుంచి 81/4కి చేరింది. రెండో సెషన్‌లోనూ కథ మారలేదు. ఆరోనెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ (3)ను ఆరంభంలోనే బోలాండ్ ఎల్బీగా అవుట్ చేశాడు. పంత్ (21) కూడా ఎక్కువసేపు నిలవలేదు.

నితీశ్ మరోసారి..: తొలి టెస్టు మాదిరే ఆంధ్ర క్రికెటర్ నితీశ్ మరోసారి ఆకట్టుకున్నాడు. అటు అశ్విన్ (22) బంతికో పరుగు చొప్పున సాధిస్తూ అతడిపై ఒత్తిడి తగ్గించాడు. ఈ దశలో స్టార్క్ మళ్లీ దెబ్బతీస్తూ 39వ ఓవర్‌లో ఇన్‌స్వింగ్ యార్కర్లతో అశ్విన్, హర్షిత్ (0) వికెట్లు తీశాడు. అప్పటికే 8 వికెట్లు కోల్పోవడంతో బుమ్రా (0)ను అండగా చేసుకుని నితీశ్ ఎదురుదాడికి దిగాడు. స్టార్క్ ఓవర్‌లో సిక్సర్ బాదిన తను.. మరుసటి ఓవర్‌లో 6,4,6తో బోలాండ్‌కు షాకిచ్చాడు. ఈ ఓవర్‌లో స్లిప్ వైపు రివర్స్ స్కూప్‌లో సాధించిన సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. కాసేపటికే వరుస ఓవర్లలో ఈ జోడీ వెనుదిరిగారు.

బ్యాటింగ్‌లోనూ జోరు: సహజంగానైతే డే/నైట్ టెస్టు మూడో సెషన్‌లో పేసర్లు పండగ చేసుకుంటారు. కానీ ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ ఆసీస్ బ్యాటర్లను భారత బౌలర్లు ఇబ్బందిపెట్టలేకపోయారు. ఈ సెషన్ మొత్తంలో తీసింది ఒక్క వికెటే కావడం గమనార్హం. బుమ్రా ఖవాజా (13)ను అవుట్ చేశాడు. కెరీర్‌లో రెండో టెస్టు ఆడుతున్న ఓపెనర్ మెక్‌స్వీనే పట్టుదలగా క్రీజులో నిలిచాడు. అటు లబుషేన్ తన సహజశైలితో భారత బౌలర్లను విసిగించాడు. పిచ్ స్పిన్‌కు సహకరించకపోవడంతో అశ్విన్ కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు.



నితీశ్ (42)

7

టెస్టుల్లో తొలి బంతికే అవుటైన ఏడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. 1974లో గవాస్కర్ తొలిసారి ఇలా డకౌటయ్యాడు.

మొరాయించిన ఫ్లడ్‌లైట్లు

ఈ మ్యాచ్‌లో ఫ్లడ్‌లైట్ల కారణంగా ఒకే ఓవర్లో రెండుసార్లు ఆటకు అంతరాయం ఏర్పడింది. ఆసీస్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో మూడో బంతికి, ఐదో బంతికి ముందు ఇలా లైట్లు ఆఫ్ కావడంతో పేసర్ హర్షిత్ రాణా అసహనంగా కనిపించాడు. అయితే అటు ప్రేక్షకులు మాత్రం సరదాగా తమ మొబైల్ ఫోన్లలో టార్చిలైట్లను ఆన్ చేయడం కనిపించింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) స్టార్క్ 0; రాహుల్ (సి) మెక్‌స్వీనే (బి) స్టార్క్ 37; గిల్ (ఎల్బీ) బోలాండ్ 31; విరాట్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 7; పంత్ (సి) లబుషేన్ (బి) కమిన్స్ 21; రోహిత్ (ఎల్బీ) బోలాండ్ 3; నితీశ్ (సి) హెడ్ (బి) స్టార్క్ 42; అశ్విన్ (ఎల్బీ) స్టార్క్ 22; హర్షిత్ (బి) స్టార్క్ 0; బుమ్రా (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 44.1 ఓవర్లలో 180 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-69, 3-77, 4-81, 5-87, 6-109, 7-141, 8-141, 9-176, 10-180; **బౌలింగ్:** స్టార్క్ 14.1-2-48-6; కమిన్స్ 12-4-41-2; బోలాండ్ 13-0-54-2; లియోన్ 1-0-6-0; మార్ష్ 4-0-26-0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనే (బ్యాటింగ్) 38; లబుషేన్ (బ్యాటింగ్) 20; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 33 ఓవర్లలో 86/1; వికెట్ పతనం:** 1-24; **బౌలింగ్:** బుమ్రా 11-4-13-1; సిరాజ్ 10-3-29-0; రాణా 8-2-18-0; నితీశ్ 3-1-12-0; అశ్విన్ 1-1-0-0.

నల్ల బ్యాడ్జీలతో బరిలోకి..



గులాబీ టెస్టులో ఆసీస్ ఆటగాళ్లు తమ భుజాలకు నల్ల బ్యాడ్జీలను ధరించి బరిలోకి దిగారు. ఈనెల ఒకటిన మృతి చెందిన మాజీ ఆటగాడు ఇయాన్ రెడ్‌పాత్‌కు సంతాపాన్ని తెలియజేయడంతో పాటు క్రికెటర్ ఫిల్ హ్యూజ్ మరణించి పదేళ్లయిన సందర్భంగా అతడికి ఈ విధంగా నివాళులర్పించారు.

‘వైభవ’ంగా ఫైనల్‌కు

- సెమీస్‌లో లంకపై భారత్ గెలుపు
- రేపు బంగ్లాతో తుదిపోరు
- అండర్-19 ఆసియా కప్



వైభవ్ (36 బంతుల్లో 67)

షార్జా: ఐపీఎల్‌కు ఎంపికైన పిన్న వయసు క్రికెటర్‌గా రికార్డుకెక్కిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ లీగ్‌కు ముందే మేజర్ టోర్నమెంట్‌లో సత్తా చాటుతున్నాడు. అండర్-19 ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరచి జట్టును ఫైనల్ చేర్చాడు. వైభవ్ (36 బంతుల్లో 5 సిక్సర్లు, 6 ఫోర్లతో 67) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను ఏడు వికెట్లతో చిత్తు చేసింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక.. భారత బౌలర్లు చేతన్ శర్మ (3/34), కిరణ్ చోర్మాలె (2/32), ఆయుష్ మాత్రే (2/37) ధాటికి 46.2 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. ఇక.. ఛేదనలో వైభవ్ దూకుడుగా ఆడడంతో భారత్ 21.4 ఓవర్లలోనే 175/3 స్కోరు చేసి గెలిచింది. 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్.. మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (28)తో కలిసి తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును గెలుపుతీరాలకు చేర్చాడు. వైభవ్ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీఫైనల్లో బంగ్లా ఏడు వికెట్లతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పాక్ 37 ఓవర్లలో 116 పరుగులకే పరిమితమైంది. బంగ్లా బౌలర్ ఇక్బాల్ (4/24) పాక్ బ్యాటర్ల భరతం పట్టాడు. స్వల్ప లక్ష్యాన్ని బంగ్లా 22.1 ఓవర్లలో 120/3 స్కోరుతో ఛేదించింది. బంగ్లా సారథి అజీజుల్ (61 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో అదరగొట్టాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సుమిత్



మెల్‌బోర్న్: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగాల్ వచ్చే ఏడాదిలో తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. నిరుడు క్వాలిఫయింగ్ రౌండ్లు ఆడిన సుమిత్.. ఈసారి మాత్రం నేరుగా చోటు దక్కించుకున్నాడు. వచ్చే జనవరి 12 నుంచి 26 వరకు జరిగే ఈ గ్రాండ్‌స్లామ్‌లో తలపడే క్రీడాకారుల జాబితాను టెన్నిస్ ఆస్ట్రేలియా శుక్రవారం ప్రకటించింది. పురుషులు, మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాలో ఆడేందుకు ఆటగాళ్ల కటాఫ్ ర్యాంక్ 98. దీంతో ప్రస్తుతం సింగిల్స్‌లో 98వ ర్యాంక్‌లోనున్న సుమిత్.. ప్రధాన రౌండ్‌కు అర్హత సాధించాడు. ఇక.. పురుషులు, మహిళల డిఫెండింగ్ చాంపియన్లుగా టాప్‌సీడ్లు సినర్, సబలెంకా బరిలోకి దిగనున్నారు.

పారా క్రీడల్లో తెలుగోళ్లకు 7 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ ఎబిలిటీ పారా యూత్ గేమ్స్‌లో తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు ఏడు పతకాలు కైవసం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ ఐదు స్వర్ణాలు సహా మొత్తం 16 పతకాలు నెగ్గగా, అందులో తెలుగోళ్లు ఏడు సాధించడం విశేషం. తెలంగాణ అథ్లెట్ దేవేంద్ర అండర్-17 షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రెండు పసిడి, 100 మీటర్ల స్ప్రింట్‌లో రజతం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివాని అండర్-20 షాట్‌పుట్‌లో స్వర్ణం నెగ్గారు. ఇక అండర్-17 కేటగిరీ హైజంప్‌లో లోకేష్ స్వర్ణం, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలలో సతీష్ రజతాలు సాధించారు.

శ్రీలంక 243/3

గెబెహ: దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో శ్రీలంక దీటుగా బదులిస్తోంది. రెండో రోజైన శుక్రవారం ఆట ముగిసేసరికి లంక 3 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 269/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 358 రన్స్‌కు ఆలౌటైంది. వెరిన్నే (105) అజేయ శతకంతో సత్తా చాటాడు.

బ్రూక్ సెంచరీ

- ఇంగ్లండ్ 280 ● కివీస్ 86/5



వెల్లింగ్టన్: హ్యారీ బ్రూక్ (123) సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో తొలిరోజు ఇంగ్లండ్ పైచేయి సాధించింది. శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. బ్రూక్ శతకానికి తోడు ఒలీ పోప్ (66) అర్ధ సెంచరీతో రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులకు ఆలౌటైంది. నాథన్ స్మిత్ (4/86) నాలుగు, విల్ ఓరూర్కీ (3/49) మూడు, హెన్రీ (2/43) రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆతిథ్య కివీస్ బ్యాటర్లను పర్యాటక జట్టు బౌలర్లు కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ఫలితంగా మొదటిరోజు ఆట ముగిసేసరికి కివీస్ ఐదు వికెట్లు కోల్పోయి 86 పరుగులే చేయగలిగింది. ఓపెనర్లు లాథమ్ (17), కాన్వే (11) తక్కువ స్కోర్లకే వెనుదిరగగా.. కేన్ విలియమ్సన్ (37) ఫర్వాలేదనిపించాడు. విల్ ఓరూర్కీ (0), బ్లండెల్ (7) క్రీజులో ఉన్నారు.

బిజినెస్

బ్యాంకులకు సీఆర్ఆర్ బూస్ట్

4.5% నుంచి 4 శాతానికి తగ్గిన నగదు నిల్వల నిష్పత్తి

- బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల నిధులు
- 6.5% రెపో రేటు మాత్రం యథాతథం
- రుణగ్రహీతలకు మళ్లీ నిరాశే
- జీడీపీ వృద్ధి అంచనా 6.6%కి కుదింపు
- ద్రవ్యోల్బణం అంచనా 4.8%కి పెంపు
- ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 5-7 తేదీల్లో తదుపరి ద్రవ్యపరపతి విధాన సమీక్ష



ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో రుణగ్రహీతలకు ఎలాంటి ఊరట లభించకపోయినప్పటికీ.. ద్రవ్య కొరతతో సతమతం అవుతున్న బ్యాంకులకు మాత్రం ఉపశమనం కల్పించింది. ధరల పోటుకు భయపడి రుణాలకు ప్రామాణికమైన రెపో రేటును ఆర్‌బీఐ వరుసగా 11వ సారి యథాతథంగా కొనసాగించింది. పరపతి విధానంపై తటస్థ వైఖరినీ అలాగే కొనసాగించింది. తాజా నిర్ణయంతో రెపో మరికొంతకాలం 6.5 శాతంగానే ఉండనుంది.

ఒత్తిడిలో బ్యాంకులు

రుణాలపై వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పటికీ మార్కెట్లో రుణాలకు డిమాండ్ మాత్రం బాగానే ఉంది. కానీ, డిమాండ్‌కు తగ్గ స్థాయిలో రుణాలిచ్చేందుకు అవసరమైన నిధుల్లేక బ్యాంకులు ఒత్తిడినెదుర్కొంటున్నాయి. ఇందుకు పరిష్కారంగా ఆర్‌బీఐ తాజా సమీక్షలో బ్యాంకుల నగదు నిల్వ నిష్పత్తి (సీఆర్ఆర్)ని అర శాతం తగ్గించింది. దాంతో సీఆర్ఆర్ 4.5 శాతం నుంచి 4 శాతానికి దిగిరానుంది. తత్ఫలితంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయి. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దాదాపు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి నెమ్మదించిన జీడీపీ వృద్ధికి ఊతమిచ్చేలా బ్యాంకులు మరింత విస్తృతంగా రుణాలిచ్చేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి. బ్యాంకులు సేకరించిన డిపాజిట్లలో తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేయాల్సిన నిష్పత్తినే సీఆర్ఆర్ అంటారు.

వృద్ధి డౌన్.. ధరలు అప్

దేశంలో వృద్ధి మందగించింది. ధరలు దిగిరానంటున్నాయి. దాంతో ఆర్‌బీఐ గత అంచనాలను సవరించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)కి ఆర్‌బీఐ జీడీపీ వృద్ధి అంచనాను 7.2 శాతం నుంచి 6.6 శాతానికి కుదించింది. అలాగే, ద్రవ్యోల్బణం అంచనాను 4.5 శాతం నుంచి 4.8 శాతానికి పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. ఈ ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో వృద్ధి నిరాశపరిచినప్పటికీ, ద్వితీయార్ధంలో మళ్లీ పుంజుకోనుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పలు స్థూల ఆర్థిక గణాంకాలు ఇదే సంకేతాలిస్తున్నాయన్నారు. ద్రవ్యోల్బణం విషయానికొస్తే, గరిష్ఠ స్థాయి ఆహార ధరల కారణంగా డిసెంబరుతో ముగియనున్న త్రైమాసికంలోనూ సూచీ నియంత్రణ లక్ష్యానికి ఎగువనే ఉండనుందన్నారు.

ఎఫ్‌సీఎన్ఆర్ డిపాజిట్ రేట్ల పరిమితి పెంపు: ప్రవాస భారతీయుల నుంచి మరిన్ని నిధులు ఆకర్షించేందుకు ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్) బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల పరిమితి పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. రూపాయి క్షీణతకు అడ్డుకట్ట వేయడంతో పాటు విదేశీ మారకం నిల్వల్లో ఒడుదుడుకులను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది.

తనఖా రహిత పంట రుణ పరిమితి రూ.2 లక్షలకు పెంపు

వ్యవసాయ వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకిచ్చే తనఖా రహిత పంట రుణ గరిష్ఠ పరిమితిని ప్రస్తుతమున్న రూ.1.6 లక్షల స్థాయి నుంచి రూ.2 లక్షలకు పెంచాలని నిర్ణయించింది. దీని అమలుకు సంబంధించి త్వరలోనే బ్యాంకులకు సర్క్యులర్ జారీ చేయనున్నట్లు తెలిపింది. తనఖా రహిత పంట రుణ పరిమితిని 2010లో రూ.లక్షకు, 2019లో రూ.1.6 లక్షలకు పెంచారు.

డీ-డాలరైజేషన్ ఆలోచన లేదు..

అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించే ఉద్దేశంతో ఆ కరెన్సీ ద్వారా చెల్లింపులను తగ్గించే (డీ-డాలరైజేషన్) ఆలోచనల్లేవని.. ప్రస్తుతానికి వాణిజ్యముప్పును తగ్గించుకోవడంపైనే దృష్టిసారించామని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ స్పష్టం చేశారు. సరిహద్దు వాణిజ్యంలో డాలర్‌ను పూర్తిగా పక్కన బెడితే గనుక బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సభ్య దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికాకు కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఈ మధ్యనే హెచ్చరించిన సంగతి తెలిసిందే.

డిజిటల్ ఆర్థిక మోసాలకు చెక్!

నకిలీ ఖాతాల ఏరివేతకు మ్యూల్‌హంటర్.ఏఐ అభివృద్ధి

డిజిటల్ ఆర్థిక మోసాలను గుర్తించి, వాటిని నిరోధించేందుకు ‘మ్యూల్‌హంటర్.ఏఐ’ పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాన్ని అభివృద్ధి చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. బెంగళూరులోని రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) దీన్ని అభివృద్ధి చేసింది. ఆర్థిక మోసాలు, మనీలాండరింగ్‌కు పాల్పడేందుకు అనుమానం రాకుండా ఇతరుల పేరిట తెరిచిన నకిలీ ఖాతాలను ఏరివేసేందుకు మ్యూల్‌హంటర్.ఏఐలో భాగస్వామ్యం కావాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. సాధారణంగా ఈ తరహా నేరాలకు పాల్పడేవారు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఇతరులకు సులభ ధనార్జన ఆశజూపి లేదా బలవంతంగా వారి పేరిట ఖాతాలు తెరుస్తారు. అక్రమ సొమ్మును ఈ అకౌంట్ల ద్వారా ఇతర అకౌంట్లకు మళ్లిస్తుంటారు. కాబట్టి, ఈ ఖాతాలను గుర్తించి, సొమ్ము రికవరీ చేయడం కష్టమే. ఆర్థిక సేవల రంగంలో డిజిటల్ మోసాలను అరికట్టేందుకు బ్యాంక్‌లతో కలిసి ఆర్‌బీఐ ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. తాజాగా అభివృద్ధి చేసిన మ్యూల్‌హంటర్.ఏఐలోనూ బ్యాంకులు భాగస్వామ్యం కావాలని కోరారు. జీరో ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ థీమ్‌తో ఆర్‌బీఐ ప్రస్తుతం హ్యాకథాన్‌ను నిర్వహిస్తోందని, నకిలీ ఖాతాల సమస్య అరికట్టేందుకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంక్‌లు, ఆర్థిక సేవల సంస్థలు ఆర్‌బీఐ అభివృద్ధి చేసిన మ్యూల్‌హంటర్.ఏఐతో పాటు ఇతర కృత్రిమ మేధ సాధనాలను వినియోగించుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ సైతం కోరింది.

కొత్త ఏడాదిలో కార్ల ధరలకు రెక్కలు

- ఇప్పటికే 3% మేర పెంచిన పలు కంపెనీలు
- తాజాగా అదే బాటలో మారుతి, మహీంద్రా
- జనవరి 1 నుంచి అమల్లోకి
- ఉత్పత్తి వ్యయాలు పెరగటమే కారణం

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో కార్ల ధరలు చుక్కలు చూపించనున్నాయి. నిర్వహణాపరమైన వ్యయాలతో పాటు ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరిగిపోవటంతో ఇప్పటికే హ్యుండయ్, మెర్సిడెస్ బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ కార్ల ధరలు జనవరి 1 నుంచి 3 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించాయి. తాజాగా శుక్రవారం దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ధరలు పెంచుతున్నట్లు వెల్లడించాయి. మారుతి సుజుకీ తన అన్ని మోడళ్ల ధరలు 4 శాతం వరకు పెంచినట్లు ప్రకటించింది. పెంచిన ధరలు కొత్త ఏడాది నుంచి అమల్లోకి వస్తాయని ఎంఎస్ఐ తెలిపింది. మోడల్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది. మరోవైపు ఎం అండ్ ఎం కూడా తన ఎస్‌యూవీ మోడళ్లు, వాణిజ్య వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ కూడా తన ఉత్పత్తుల ధరలను 3 శాతం మేరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు, కమోడిటీ ధరలతో పాటు నిర్వహణ వ్యయాలు పెరిగిపోవటంతో ఆ భారాన్ని కొనుగోలుదారులపై వేయాల్సి వస్తోందని మారుతి, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తెలిపాయి. కాగా ఈ నెల 5న హ్యుండయ్ మోటార్ తన కార్ల ధరలను రూ.25,000 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

సూచీలకు స్వల్పంగా నష్టాలు

ముంబై: ఈక్విటీ మార్కెట్‌లో ఐదు రోజుల ర్యాలీకి ఆర్‌బీఐ పాలసీతో బ్రేక్ పడింది. రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించడంతో పాటు వృద్ధి అంచనాను కుదించడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. తీవ్ర ఆటుపోట్ల మధ్యన ఊగిసలాడిన సెన్సెక్స్ చివరికి 56.74 పాయింట్ల నష్టంతో 81,709.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.60 పాయింట్లు నష్టపోయి 24,677.80 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,906.33 పాయింట్లు, నిఫ్టీ 546.7 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా ఐదు రోజుల ర్యాలీ కారణంగా మార్కెట్లో ఏర్పడిన ఈ విరామం ఆరోగ్యవంతమైనదేనని విశ్లేషకులంటున్నారు. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.60 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.36 శాతం లాభపడ్డాయి.

సురక్షకు నష్టాల స్వాగతం: సురక్షా డయాగ్నోస్టిక్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర రూ.441తో పోల్చితే 5.22 శాతం నష్టంతో రూ.417.95 వద్ద ముగిసింది. శుక్రవారం 0.90 శాతం నష్టంతో రూ.437 వద్ద లిస్టింగ్ అయిన ఈ షేరు ఇంట్రాడేలో 5.94 శాతం నష్టంతో కనిష్ఠ స్థాయి రూ.414.80ని తాకింది. ఎన్ఎస్ఈలో కూడా ఆ షేరు 5.43 శాతం నష్టంతో రూ.417.05 వద్ద ముగిసింది.

ఇన్వెస్టర్ నియమావళిని సవరించిన సెబీ

ఇన్వెస్టర్ భద్రతను పెంచడంతో పాటు మార్కెట్లో పారదర్శకత తేవడం, ఇన్వెస్టర్లలో విశ్వాసం కల్పించడం లక్ష్యంగా సెబీ సవరించిన ఇన్వెస్టర్ నియమావళిని విడుదల చేసింది. ఇన్వెస్టర్ సమాచార గోప్యతకు హామీ ఇవ్వడం, న్యాయబద్ధమైన/హేతుబద్ధమైన నిబంధనావళి సహాయంతో మార్కెట్ నుంచి వెలుపలికి వచ్చేందుకు భరోసా కల్పించడం ఈ నియమావళి సవరణ లక్ష్యం. దీనికి తోడు స్కోర్స్ 2.0, స్మార్ట్ ఆన్‌లైన్ సహాయంతో వివాద పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేసింది.

గోల్డ్ బులియన్ హాల్ మార్కింగ్ తప్పనిసరి

న్యూఢిల్లీ: బంగారానికి హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం ఇప్పుడు గోల్డ్ బులియన్ హాల్‌మార్కింగ్ దిశగా అడుగులేస్తోంది. సీఐఐ వజ్రాభరణాల సదస్సులో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే మాట్లాడుతూ.. నాణ్యమైన ఉత్పత్తులు అందించడం ద్వారా వినియోగదారుల ప్రయోజనాలు కాపాడడం అవసరమన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే గోల్డ్ బులియన్ హాల్‌మార్కింగ్‌కు కూడా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వాస్తవానికి తాము దిగుమతి చేసుకుంటున్న బంగారం నాణ్యమైనదే అనే విషయం ఆభరణాల వర్తకులకే తెలియదని, అందుకే మొత్తం వ్యవస్థను సరిదిద్దాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

11న సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓ

ఇష్యూ ధర రూ.522-549

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాయి లైఫ్ సైన్సెస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 11న ప్రారంభం కానుంది. 13న ఇష్యూ ముగియనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.522-రూ.549గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.3,042.62 కోట్లు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా రూ.950 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్ షేర్ హోల్డర్స్ ఇతర వాటాదారులు 3.81 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్ సంస్థ సాయి క్వెస్ట్ సిన్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు టీపీజీ ఆసియా 7 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాతో పాటు ఇతర వాటాదారులు తమ వాటాలను విక్రయించనున్నారు.

విశాల్ మెగామార్ట్, మొబిక్విక్ కూడా: విశాల్ మెగామార్ట్, మొబిక్విక్ పబ్లిక్ ఇష్యూలు కూడా ఈ నెల 11నే ప్రారంభం కానున్నాయి. విశాల్ మెగామార్ట్ ఒక్కో షేరు ధరను రూ.74-78గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.8,000 కోట్లు సమీకరించనుంది. కాగా మొబిక్విక్ ఒక్కో షేరు ధరను రూ.265-279గా నిర్ణయించింది.

ఐపీఓకి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా: దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ అనుబంధ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించనుంది. ఇష్యూలో భాగంగా మాతృసంస్థ 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఈ ఇష్యూ పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉండనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▼	71,150 ▼	1,01,000 ▼
ముంబై	76,187 ▼	69,787 ▼	90,820 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7న తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెంకాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	94
వరంగల్	80	గుంటూరు	94
కరీంనగర్	80	ఒంగోలు	94
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	82
కర్నూలు	80	నెల్లూరు	82
విశాఖపట్నం	90	అనంతపురం	82
గోదావరి	94		

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 16
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 249
శనివారం | 7-12-2024
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupati | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రామీణ మహిళకు నిలువెత్తు రూపం

తెలంగాణ తల్లి కొత్త విగ్రహ నమూనా విడుదల

9న ఆవిష్కరణ.. ఉట్టిపడుతున్న తెలంగాణతనం

బంగారు వర్ణం అంచుతో ఆకుపచ్చ చీర, గాజులు

ఎడమ చేతిలో వరి సహా చిరు ధాన్యాల కంకులు

అభయహస్తంగా కుడి చేయి.. మెడలోన నగలు

దిమ్మె పైన పోరాటాన్ని ప్రతిఫలించేలా పిడికిళ్లు


తెలంగాణ తల్లి కొత్త విగ్రహ నమూనా

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగారు రంగు అంచుతో ఆకుపచ్చ చీర! రెండు చేతులకు ఎరుపు, ఆకు పచ్చ రంగు గాజులు! ఎడమ చేతిలో వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ కంకులు! కాళ్లకు మెట్టెలు, పట్టీలు! మెడలో బంగారపు గొలుసులు! నుదుట రూపాయి కాసంత ఎర్రటి బొట్టుతో నిండైన గ్రామీణ మహిళ రూపం! ఇది.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి తాజా విగ్రహం! సబ్బండ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ విగ్రహం రూపుదిద్దుకుంది. సచివాలయం ప్రధాన ద్వారం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. 3 అడుగుల గద్దెపై 17 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేస్తున్న కాంస్య విగ్రహ నమూనాను శుక్రవారం విడుదల చేసింది. గత ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం రాచరిక పోకడలతో ఉందని, తెలంగాణ ఆనవాలు లేదంటూ

మిగతా 3వ పేజీలో...

ఆ విగ్రహం తెలంగాణ తల్లిదా..? కాంగ్రెస్ తల్లిదా..?

కేసీఆర్‌ను గౌరవిస్తేనే.. రేవంత్‌ను గౌరవిస్తాం

సమస్యలపై శాసనసభలో నిలదీస్తాం: కేటీఆర్

3

డ్రగ్స్, సైబర్ నేరాల విచారణకు..

ఫాస్ట్ ట్రాక్ కోర్టులు


ప్రజాపాలన విజయోత్సవాల్లో తుపాకీతో సీఎం, చిత్రంలో భట్టి

- ఆరు నెలల్లోనే నిందితులకు శిక్ష పడేలా ఏర్పాట్లు
- విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యందే బాధ్యత
- పీఈటీల లాగా డ్రగ్స్ గుర్తించేవారిని నియమించాలి
- ఠాణాల్లో డాబు, దర్పం ప్రదర్శిస్తే లోపలేసెయ్యండి
- ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకే.. నేరగాళ్లకు కాదు
- హోం గార్డుల రోజువారీ వేతనం వెయ్యికి పెంపు
- ప్రమాదంలో చనిపోతే కుటుంబానికి రూ.5 లక్షలు
- ట్రాన్స్‌జెండర్లకు ఇందిరమ్మ ఇల్లు: సీఎం రేవంత్ రెడ్డి
- 2వేల మందితో ఎస్‌డీఆర్‌ఎఫ్.. వాహనాల ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): "డ్రగ్స్, గంజాయి కేసుల్లో శిక్షల శాతం తక్కువగా ఉంది. సదరు కేసులు కూడా నాలుగైదేళ్ల విచారణ తర్వాత న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. ఇకపై అలా కుదరదు. డ్రగ్స్, సైబర్ నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. 6 నెలల్లో నిందితులకు శిక్షలు పడేలా వీటి ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించాం. అంతేనా.. న్యాయ వ్యవస్థ, న్యాయవాదులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పీఈటీ తరహాలో విద్యా సంస్థల్లో మత్తు పదార్థాలను గుర్తించే వారిని కచ్చితంగా నియమించుకోవాలన్నారు. విద్యా సంస్థల్లో మత్తు పదార్థాలు పట్టుబడితే యాజమాన్యాల్ని బాధ్యుల్ని చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నెక్లెస్ రోడ్డులోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో హోంశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు

మిగతా 13వ పేజీలో...

దుబాయ్, సింగపూర్ తరహా మాల్స్

ఆయా దేశాల్లో పరిశీలన.. హైదరాబాద్‌లో ఏర్పాటు

ప్రకృతి, ఆధ్యాత్మిక పర్యాటకం అనుసంధానం

31లోపు కొత్త విధానం.. అధికార్లకు సీఎం ఆదేశాలు

13

నేడు నల్లగొండకు రేవంత్

బ్రాహ్మణవెల్లంల లిఫ్ట్, వైటీపీఎస్, మెడికల్ కాలేజీలకు ప్రారంభోత్సవం

జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ

ఇక బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వం

- హీరో అల్లు అర్జున్ పుష్ప-2 ప్రీమియర్ షోకి వెళ్లడం సరికాదు
- మహిళ మృతి ఘటనపై చట్టపరంగా చర్యలు: మంత్రి కోమటిరెడ్డి
- కొనసాగుతున్న దర్యాప్తు.. బాధ్యులపై నేడో రేపో చర్యలు?

2

రేవతి కుటుంబానికి 25 లక్షలు

దాంతోపాటు వైద్య ఖర్చులు కూడా భరిస్తా

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

వీడియో విడుదల చేసిన అల్లు అర్జున్

అంబేడ్కర్ వర్సిటీ వీసీగా ఘంటా



అనూహ్యంగా చక్రపాణి నియామకం.. ఉత్తర్వులు జారీ

గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు

న్యాయ సలహా తర్వాతే నియామకంపై ముందుకు?

జేఎన్టీయూ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా బాలకిష్టారెడ్డి

10

తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు

మహబూబ్‌నగర్, నిజామాబాద్, సూర్యాపేట సహా 4 జిల్లాలకు మంజూరు

ఆంధ్రప్రదేశ్‌కు 8 కేంద్రీయ విద్యాలయాలు.. కేంద్రం ఆమోదం

13

తెలంగాణ గ్రూప్-1 రద్దు కుదరదు.. పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

ఆటుపోట్లున్నా.. అభివృద్ధి దిశగా!

ఏడాది ప్రగతిబాటలో రేవంత్ సర్కారు

రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు

కాంగ్రెస్ ముద్ర.. కొత్త ప్రాజెక్టులు

మూసీ, ఫోర్త్ సిటీ, ఆర్ఆర్ఆర్, మెట్రో

గురుకులాల్లో సమీకృత భవనాలు

55,143 ఉద్యోగాల భర్తీ

సాగునీటి ప్రాజెక్టులపై రూ.10 వేల కోట్ల ఖర్చు

దూకుడే కాస్త ఇబ్బందికరం

అత్యంత కీలకం కానున్న రెండో ఏడాది పాలన

10



12

సాగులో తెలంగాణ రోల్‌మోడల్ కావాలి

ఐఏఎస్, ఐపీఎస్, అధికారుల తరహాలో అన్నదాతలకూ నికర ఆదాయం అందాలి

ఆ దిశగా మా ప్రభుత్వం ఎంతో చేసింది

రైతుకు అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానం

20 లక్షల ఎకరాల్లో పామాయిల్‌కు చాన్స్

రైతు వేదికలన్నింటికీ వీడియో కాన్ఫరెన్సు

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేనడిగితేనే శిందే 'డిప్యూటీ'గా ఉండేందుకు అంగీకరించారు

» బీజేపీ వద్దే హోంశాఖ: ఫడణవీస్



ముంబై, డిసెంబరు 6: ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందు శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందేతో భేటీ అయ్యాయని.. తానడిగితేనే శిందే డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించారని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ చెప్పారు. మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత మహాయుతి తొలి సమావేశంలో సీఎంగా బీజేపీ వారే ఉండేందుకు శిందే అంగీకరించారు. అయితే శివసేనలోని ఓ వర్గం మాత్రం.. తమ పార్టీ నుంచే సీఎం కావాలని కోరుకుంది. ఏదైతేనేం శిందేతో నాకు మంచి సంబంధాలున్నాయి. నేను ఆయన్ను కలిసి మాట్లాడిన తర్వాత డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించారు. ఏ శాఖ కోసం శిందే డిమాండ్ చేయలేదు. ఈ నెల 16వ తేదీ లోపు క్యాబినెట్ విస్తరణ ఉంటుంది. దాదాపు అన్ని శాఖలపై ఏకాభిప్రాయానికి వచ్చాం. హోంశాఖ ఎప్పుడూ బీజేపీ వద్దే ఉంటుంది. కేంద్రంలో హోంశాఖ బీజేపీ వద్ద ఉన్న నేపథ్యంలో సమన్వయం చేసుకోవడానికి సులభతరమవుతుంది' అని వ్యాఖ్యానించారు.

ప్రిన్సిపాల్‌ను కాల్చి చంపిన విద్యార్థి

» మధ్యప్రదేశ్‌లో ఘటన.. నిందితుడి అరెస్టు

భోపాల్, డిసెంబరు 6: పాఠశాలకు రాకుండా బయట తిరుగుతున్నావెందుకని మందలించినందుకు ప్రిన్సిపాల్‌నే కాల్చి చంపాడు ఓ విద్యార్థి. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్ జిల్లాలో శుక్రవారం జరిగింది. సురేంద్ర కుమార్ సక్సెనా(55).. ధామోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. నిందితుడు అందులోనే 12వ తరగతి చదువుతున్నాడు. స్కూలుకు రాకుండా గేటు బయట తిరుగుతున్న అతనిపై ప్రిన్సిపాల్ కోప్పడ్డాడు. దీంతో ఉన్మాదిలా ప్రవర్తించిన నిందితుడు.. ప్రిన్సిపాల్ టాయిలెట్‌కు వెళ్లినప్పుడు కాపు కాసి బయటకు రాగానే తన వద్ద ఉన్న పిస్తోల్ తీసి కాల్చాడు. బుల్లెట్ తలలో దిగడంతో సక్సెనా అక్కడికక్కడే మృతిచెందారు. అయితే అక్కణ్నుంచి ప్రిన్సిపాల్ స్కూటర్‌పై పారిపోయిన నిందితుణ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కెనడాలో భారత విద్యార్థి హత్య

న్యూఢిల్లీ, డిసెంబరు 6: కెనడాలో ఓ భారతీయ విద్యార్థి హత్యకు గురయ్యాడు. వంట గదిలో తన రూమ్‌మేట్ విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన డిసెంబరు 1న జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంజాబ్‌కు చెందిన 22 ఏళ్ల గురాసిస్ సింగ్ నాలుగు నెలల క్రితం ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాడు. అక్కడ సర్నియా నగరంలోని లాంబ్టన్ కాలేజీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. స్థానికంగా ఉన్న ఓ అపార్టుమెంట్‌లో 36 ఏళ్ల క్రోసిలీ హంటర్ అనే వ్యక్తితో కలిసి ఉంటున్నాడు. డిసెంబరు 1న ఇద్దరి మధ్య జరిగిన చిన్న గొడవ తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో సింగ్‌పై హంటర్ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో సింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ట్రంప్ కోసం మస్క్ చేసిన ఖర్చు 2,200 కోట్లు

వాషింగ్టన్, డిసెంబరు 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి ఎలాన్ మస్క్ రూ.2,200 కోట్ల భారీ విరాళం అందించినట్టు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ (ఎఫ్‌ఈసీ) నివేదికలో తెలిసింది. ఈ ఎన్నికల్లో కీలక రాష్ట్రాల్లో ట్రంప్‌కు ఓటింగ్ పెంచేందుకు పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ)ని ఏర్పాటు చేసి భారీ స్థాయిలో ప్రచారం చేపట్టారు. ఈ పీఏసీకి మస్క్ దాదాపు రూ.2,000 కోట్లు విరాళం అందించారు. మరో పొలిటికల్ యాక్షన్ కమిటీ అయిన 'మేక్ అమెరికా హెల్దీ ఎగైన్'కు మస్క్ రూ.25 కోట్లు ఇచ్చారు. ఇలా ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం మస్క్ చేసిన రాజకీయ వ్యయం రూ.2,200 కోట్లకు చేరుకుందని ఎఫ్‌ఈసీ నివేదిక పేర్కొంది.

పాక్‌లోనే ఉగ్రవాది మసూద్ అజ్‌హర్

న్యూఢిల్లీ, డిసెంబరు 6: అంతర్జాతీయ ఉగ్రవాది అంటూ ఐక్యరాజ్యసమితి ముద్ర వేసిన జైష్ ఎ మహమ్మద్ (జేఈఎం) వ్యవస్థాపకుడు మసూద్ అజ్‌హర్ పాకిస్థాన్‌లో కనిపించాడు. రెండు దశాబ్దాల అనంతరం ఆయన తొలిసారిగా బహిరంగంగా ప్రసంగించగా ఆ వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. దాంతో అజ్‌హర్ తమ దేశంలో లేడంటూ ఇంతవరకు పాకిస్థాన్ చెప్పిన మాటలు తప్పని తేలింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఇది పాకిస్థాన్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితే అజ్‌హర్‌పై ఉగ్రవాది అన్న ముద్ర వేసినందున అతడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

చిలీ మాజీ అధ్యక్షురాలికి ఇందిర శాంతి బహుమతి



చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెలీ బాచెలెట్‌కు ఇందిరా గాంధీ శాంతి బహుమతి-2024 దక్కింది. అంతర్జాతీయంగా మానవ హక్కులు, శాంతి, సమానత్వం కోసం ఆమె చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ మీడియాకు వెల్లడించింది. మిచెలీ బాచెలెట్ గతంలో ఐక్యరాజ్య సమితి మహిళా కమిషన్, మానవ హక్కుల సంఘంకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. లింగ సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం గళమెత్తారు.

74 ఏళ్ల వయస్సులో పక్షి గుడ్డు



హోనలూలూ, డిసెంబరు 6: చిత్రంలో కనిపిస్తున్న పక్షి పేరు విజ్‌డమ్. ఇదో సముద్రపు పక్షి(ఇంగ్లిష్‌లో దీనిని లేసన్ ఆల్బాట్రాస్ అంటారు). ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ వయస్సు కలిగిన సముద్రపు పక్షిగా ఇది రికార్డులకెక్కింది. దీని వయస్సు 74ఏళ్లు. అయితే, ఇక్కడ విచిత్రం ఇది మాత్రమే కాదు. ఈ వయసులోనూ అది గుడ్డు పెట్టింది. కొన్ని రోజుల్లో పిల్లను కనబోతోంది. ఈ పక్షుల సగటు జీవిత కాలం 68ఏళ్లే. విజ్‌డమ్ 74ఏళ్లు జీవించడమే రికార్డు అనుకుంటే.. ఈ వయస్సులో అది గుడ్డు పెట్టి పిల్లను కనబోతుండటం మరో గొప్ప విశేషం. విజ్‌డమ్ హవాయీ దీవుల్లోని ఓ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో అధికారుల పర్యవేక్షణలో ఉంది. లేసన్ ఆల్బాట్రాస్ పక్షులు ఏడాదికొకసారి ఒక్క గుడ్డు మాత్రమే పెడతాయి.

మళ్లీ రైతాంగం భగ్గు

హిమాచల్‌లోని శంభు నుంచి ఢిల్లీకి రైతుల పాదయాత్ర.. బారికేడ్లు పెట్టి ఆపిన పోలీసులు

» వాటిని తొలగించి ముందుకు సాగేందుకు అన్నదాతల యత్నం

» అడ్డుకున్న పోలీసులు.. బాష్పవాయువు ప్రయోగం.. 8మంది రైతులకు గాయాలు



బారికేడ్లను తొలగిస్తున్న రైతులు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు కేంద్రం చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో రైతన్న మరోసారి గర్జించాడు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు శిబిరం నుంచి రైతులు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా పాదయాత్ర (జాతా) ప్రారంభించారు. కొంత దూరం సాగగానే హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. అయినా రైతులు అడుగు ముందుకేశారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఎనిమిది మంది రైతులు గాయపడ్డారు. దరివిలా పాదయాత్రను శుక్రవారం ఒక్కరోజు నిలిపివేస్తున్నట్లు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. అంతకు ముందు ఉదయం 101 మంది రైతులు తమ సంఘాల జెండాలను చేతబట్టి 'చలో ఢిల్లీ' పాదయాత్ర మొదలుపెట్టారు. అయితే పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి.. బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. 'సత్నాం వాహెగురూ' అని నినదిస్తూ రైతులు ముందుకు కదిలారు. బారికేడ్లను వారిలో కొందరు తొలగించారు. ఇనుప వలను గగ్గర్ నదిపై నిర్మించిన వంతెనపైకి విసిరేశారు. అయితే తొలి అంచె వరకే వారు ముందుకెళ్లగలిగారు. ఆ తర్వాత వారు అడుగు కూడా వేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఓ రైతు సాహసంతో పోలీసు బలగాలు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక షెడ్‌పైకి ఎక్కాడు. టియర్ గ్యాస్ గోళాల ప్రయోగంతో పొగ సోకకుండా చాలా మంది రైతులు గోనె సంచులను కళ్లు, నోటికి అడ్డుపెట్టుకుని అటూ ఇటూ పరుగులు తీశారు. పోలీసులు నీటి ఫిరంగి వాహనాలను కూడా మోహరించారు. అంబాలా జిల్లా అంతటా నిషేధాజ్ఞలు విధించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. యాత్ర సాగే తొమ్మిది గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, ఎస్‌ఎంఎస్ సేవలను నిలిపివేశారు. దీంతో శుక్రవారం యాత్రను సస్పెండ్ చేస్తున్నట్లు రైతు సంఘం నేత సర్వన్‌సింగ్ పంధేర్ ప్రకటించారు. గాయపడిన ఆరుగురు రైతులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తాయన్నారు. ట్రాక్టర్-ట్రాలీలను తీసుకు రాకుండా యాత్ర చేపడితే తమకు అభ్యంతరం లేదని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన బీజేపీ నేతలు ప్రకటించారని.. ఇప్పుడు పాదయాత్రను కూడా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఇంకోవైపు.. ఖనౌరీ వద్ద చేపట్టిన తన ఆమరణ దీక్షను సంయుక్త కిసాన్ మోర్చా నేత జగ్జీత్‌సింగ్ దల్లెవాల్ శుక్రవారం కూడా కొనసాగించారు.

రైతుల డిమాండ్లు ఇవీ..

కనీస మద్దతు ధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని.. రైతు రుణాలను మాఫీ చేయాలని.. రైతులకు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని.. అన్నదాతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని.. కరెంటు చార్జీలు పెంచకూడదని.. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని.. 2020-21లో ఉవ్వెత్తున జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని.. యూపీలోని లఖీంపూర్ ఖేరీలో 2021లో చోటుచేసుకున్న హింసాకాండ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు శంభు, ఖనౌరీ వద్ద మకాం వేసి ఉద్యమిస్తున్నారు. ఫిబ్రవరి 18న కేంద్రప్రభుత్వ ప్రతినిధులు వారితో చర్చలు జరిపారు. ఆ తర్వాత వారి వద్దకు ఎవరూ రాలేదు. కాగా.. 'చలో ఢిల్లీ' యాత్రకు జైరాం రమేశ్ మద్దతు ప్రకటించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలన్నారు.

బోర్డర్‌లో బంగ్లాదేశ్ కవ్వింపు

సరిహద్దులో కిల్లర్ డ్రోన్లను మోహరించిన పొరుగుదేశం

అప్రమత్తమైన భారత్.. నిఘా పెంపు

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సరిహద్దుల్లో బంగ్లాదేశ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. పశ్చిమ బెంగాల్‌కు సమీపంలో అత్యాధునిక బేరక్తర్ టీబీ2 డ్రోన్లను మొహరించింది. దీంతో వెంటనే అప్రమత్తమైన భారత్ సరిహద్దులో నిఘా పెంచింది. అయితే షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తర్వాత సరిహద్దు వెంట ఉగ్రవాద చర్యలు పెరుగుతున్నాయనే ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో ఆ డ్రోన్లను మొహరించినట్లు బంగ్లాదేశ్ చెబుతోంది. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, మన సరిహద్దుల భద్రత, రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సన్నద్ధంగా ఉన్నామని సీనియర్ రక్షణ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు భారత నిఘా వర్గాలు కూడా బోర్డర్ వెంట పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. హసీనా ప్రభుత్వ హయాంలో అణిచివేసిన ఉగ్రవాదులు ఇప్పుడు మళ్లీ సరిహద్దు సమీపంలో శక్తిపుంజుకుంటున్నారని నిఘా నివేదికలు వెల్లడిస్తున్నాయి. బోర్డర్ వెంట భారత్ వ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఓ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, కోల్‌కతాలో తాత్కాలిక డిప్యూటీ హైకమిషనర్ సిక్దర్ మొహమ్మద్ అష్రఫుర్ రెహమాన్, త్రిపురలోని డిప్యూటీ హైకమిషనర్ ఆరిఫుర్ రెహ్మాన్‌లను వెంటనే వెనక్కి వచ్చేయాలని బంగ్లాదేశ్ ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు నిరసనగా త్రిపుర రాజధాని అగర్తలలో తమ కార్యాలయం వద్ద హిందూ సంఘాల ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

9న బంగ్లాకు విదేశాంగ కార్యదర్శి

బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడుల నేపథ్యంలో ఆ దేశంతో చర్చలకు భారత్ సిద్ధమైంది. ఈనెల 9న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ విస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఆ దేశ విదేశాంగ కార్యదర్శితో చర్చలు జరుపుతారు. ఆ పర్యటనలో మరింత మంది అధికారులతో కూడా భేటీ అవుతారు. ఇరు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు సాగుతాయనే ఆశాభావంతో ఉన్నట్లు విదేశీ వ్యవహారాల ప్రతినిధి జైశ్వాల్ చెప్పారు.

లోకం తీరు



తెలంగాణలోనే సిజేరియన్లు ఎక్కువ

మొత్తం ప్రసవాల్లో 60.7% ఆపరేషన్లు

దేశవ్యాప్తంగా ఇది 21.5 శాతమే

న్యూఢిల్లీ, డిసెంబరు 6: తెలంగాణలో మొత్తం ప్రసవాల్లో 60.7% సిజేరియన్లేనని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్-5) ఆధారంగా ఢిల్లీలోని జార్జ్ ఇన్‌స్టిట్యూట్ జరిపిన అధ్యయనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా చూస్తే ఇది 21.5శాతంగా ఉన్నట్లు తెలిపింది. దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15-49 ఏళ్ల వయసు ఉన్న 7.2 లక్షల మంది మహిళల ప్రసవ వివరాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ వివరాలు ద లాన్సెట్ రీజనల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. దేశంలోని ప్రతి అయిదుగురిలో ఒకరు సిజేరియన్ (సి-సెక్షన్) ఆపరేషన్ ద్వారానే జన్మిస్తున్నారు. ఈ శస్త్రచికిత్సలు ఎక్కువ శాతం ప్రయివేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారే ఈ ఆపరేషన్లవైపు మొగ్గు చూపుతున్నారు. సిజేరియన్లలో రాష్ట్రాల వారీగా బాగా తేడాలు ఉన్నాయి. నాగాలాండ్‌లో 5.2 శాతం మేర సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండగా, తెలంగాణకు ఏకంగా 60.7 శాతం శాతం మేర ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండడం, ఆర్థిక స్థోమత, సహజ ప్రసవాలంటే భయం, బిడ్డ జననానికి ముహూర్తాలు చూసుకోవడం వంటి అంశాలు సిజేరియన్ల వైపు మొగ్గు చూపడానికి కారణాలవుతున్నాయి. బిహార్ వంటి పేద రాష్ట్రాల్లో డాక్టర్లు సి-సెక్షన్ ఆపరేషన్లు చేయాలని చెప్పినా అక్కడి వారు మాత్రం సహజ ప్రసవాలనే కోరుకుంటున్నారు. కాగా, 2019-21 సంవత్సరాల్లో ఆస్పత్రుల్లోని సమాచారం ఆధారంగా జాతీయ ఆరోగ్య సర్వే నిర్వహించారు.



చేతులు కలిపి.. చలోక్తి విసిరి

» పార్లమెంటు ఆవరణలో మోదీ, ఖర్గే సరదా ముచ్చట

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సభలో ఎన్ని వాగ్వాదాలు చేసుకున్నా.. వేరే సందర్భాల్లో కలుసుకున్నప్పుడు రాజకీయ నాయకులు సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం సహజమే! శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో అలాంటి దృశ్యమే కనిపించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో సర్కారు 'మహా పరినిర్వాణ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, రామ్‌నాథ్ కోవింద్ తదితరులు.. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా, ఆ సమయంలో ఖర్గే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఆయనతో కరచాలనం చేశారు. ఖర్గే ఏం చలోక్తి విసిరారో ఏమోగానీ.. మోదీ పెద్దగా నవ్వారు. వారిద్దరూ అలా చేతులు పట్టుకుని, కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజ్యసభలో నోట్ల కట్ట!

» తెలంగాణ ఎంపీ సింఘ్వీ సీటు వద్ద లభ్యం

» భద్రతా తనిఖీల్లో లభ్యమైందన్న చైర్మన్

» ఆ డబ్బులు నావి కావు: అభిషేక్ సింఘ్వీ



న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో సంచలన ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీ అభిషేక్ సింఘ్వీకి కేటాయించిన సీటు నంబర్ 222 వద్ద ఒక నోట్ల కట్ట లభ్యమైందని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం సభ వాయిదా పడగానే భద్రతా దళాలు నిర్వహించిన రోజువారీ తనిఖీల్లో సింఘ్వీ కూర్చునే సీటు వద్ద నోట్ల కట్ట కనిపించిందని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే నిబంధనల ప్రకారం దర్యాప్తునకు ఆదేశించానని చెప్పారు. దీనిపై సింఘ్వీ స్పందించారని, ఈ విషయాన్ని తాను మొదటిసారి వింటున్నానని చెప్పారని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. తాను సభకు వచ్చినప్పుడల్లా కేవలం రూ.500 నోటు మాత్రమే తీసుకువస్తానని సింఘ్వీ చెప్పినట్లు తెలిపారు. మరోవైపు సింఘ్వీ 'ఎక్స్'లోనూ, మీడియా వద్ద వివరణ ఇచ్చారు. గురువారం తాను సభకు వచ్చిన మూడు నిమిషాలకే వాయిదా పడటంతో క్యాంటీన్‌కు వెళ్లానని అన్నారు. ఆ తర్వాత అటు నుంచే బయటకు వెళ్లానని చెప్పారు. ఎంపీ సీటులో ఎవరైనా ఏమైనా పెట్టవచ్చునని వ్యాఖ్యానించారు. కాగా, దర్యాప్తు జరిగి ఎవరు డబ్బు పెట్టారో తేలనంతవరకూ ఎంపీ పేరును ప్రస్తావించకూడదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. చైర్మన్‌ను కోరారు. కానీ, బీజేపీ అభ్యంతరం తెలిపింది. డబ్బు ఎక్కడ దొరికిందో తేలినప్పుడు ఆ ఎంపీ పేరును ఎందుకు ప్రకటించకూడదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రశ్నించారు. అయితే పార్లమెంట్‌లో కీలకమైన చర్చల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. రైతుల సమస్య, మోదీ-అదానీ కుంభకోణంపై చర్చ జరగకుండా పక్కదారి పట్టించేందుకే నోట్ల కట్ట దొరికిందంటూ హంగామా చేస్తున్నారని మండిపడ్డారు. పైగా ఆ నోట్ల కట్ట విలువ రూ.50 వేలే ఉంటుందన్నారు. ఎవరి వద్దనైనా రూ.50 వేల కట్ట దొరికితే అందులో నేరం ఏముందని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏ ఏజెన్సీతోనైనా దర్యాప్తు చేయించుకోవచ్చని, జేపీసీ కూడా వేయవచ్చునని కాంగ్రెస్ నేతలు రాజ్యసభ చైర్మన్‌ను కలిసి చెప్పినట్టు తెలిసింది.

మణిపూర్‌లో సత్వరమే పర్యటించండి

» శాంతి స్థాపనకు అదే మార్గం

» ప్రధానికి ఇండియా కూటమి డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 6: అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో సత్వరమే పర్యటించాలని ప్రధాని మోదీని ఇండియా కూటమి డిమాండు చేసింది. ప్రధాని నేరుగా జోక్యం చేసుకుంటేనే శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అభిప్రాయపడింది. ఇండియా కూటమిలోని పది పార్టీల నాయకులు శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తాము జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామంటే అనుమతి ఇవ్వలేదని తెలిపారు. దాంతో ప్రధాని కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మేఘచంద్ర మాట్లాడుతూ తమ రాష్ట్రం కూడా భారత్‌లో అంతర్భాగమేనని, 18 నెలలుగా హింస నెలకొన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. 60వేల మంది సహాయ శిబిరాల్లో ఉన్నారని, ఇంకెంతమంది ఇబ్బందులు పడాలని ప్రశ్నించారు. మణిపూర్‌లో 'అప్రకటిత రాష్ట్రపతి పాలన' కొనసాగుతోందని, సీఎం కాగితం పులిలా విగిలిపోయారని విమర్శించారు. మణిపూర్ ఇండియా కూటమి కన్వీనర్ క్షేత్రిమయుం శాంతా మాట్లాడుతూ శాంతి స్థాపన కోరుతూ ధర్నా చేసేందుకు 3,000 కి.మీ.దూరం నుంచి వస్తే అనుమతి నిరాకరించారని తెలిపారు. రెండేళ్లుగా హింస కొనసాగుతున్నా ప్రధాని మోదీ మణిపూర్‌ను సందర్శించలేదని విమర్శించారు.

కేంద్ర మంత్రులు 700 సార్లు పర్యటించారు

ఈశాన్య రాష్ట్రాల అందాలను పరిచయం చేయడానికి ఢిల్లీలో నిర్వహించిన అష్టలక్ష్మి మహోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఓట్లు లేవన్న కారణంతో గత ప్రభుత్వాలు ఆ ప్రాంతాన్ని పట్టించుకోలేదని చెప్పారు. తమ ప్రభుత్వం హయాంలో గత పదేళ్లుగా కేంద్ర మంత్రులు 700 సార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించారని తెలిపారు. ఆ ప్రాంతం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

రేవతి కుటుంబానికి రూ.25 లక్షలు

» దాంతోపాటు.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా

» ఏం చేసినా.. ఆమె లేని లోటు పూరించలేం: అల్లు అర్జున్



హైదరాబాద్, డిసెంబరు 6: పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంపై ఆ చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామంటూ ఒక వీడియో విడుదల చేశారు. 20 ఏళ్లుగా ఆనవాయితీగా థియేటర్‌కు వెళ్లి అభిమానులతో సినిమా చూస్తున్నానని.. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఏమీ జరగలేదని.. అనూహ్యంగా ఇప్పుడు జరిగిన ఘటన తమను కలచివేసిందని అందులో పేర్కొన్నారు. రేవతి మరణవార్త తెలియగానే తామంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని చెప్పారు. "రేవతి కుటుంబానికి.. మా ప్రగాఢ సానుభూతి. మేమేం చేసినా.. ఎంత మాట్లాడినా.. ఆ లోటు పూరించలేనిది" అని ఆవేదన వెలిబుచ్చారు. "మీకు మేమున్నాం. మావైపు నుంచి మీకు ఏ సాయం కావాలన్నా.. మా శక్తి మేరకు చేస్తాం. నా తరఫు నుంచి రూ.25 లక్షలు వారి భవిష్యత్తు కోసం ఇవ్వాలనుకుంటున్నాను. ఈ డబ్బుతో సంబంధం లేకుండా.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా. ఆ కుటుంబం బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. "మేము సినిమా తీసేది ప్రేక్షకులను సంతోషపెట్టాలనే. మీరంతా కుటుంబాలతో కలిసి థియేటర్లకు వచ్చి, చూసి ఆనందించాలనే. కాబట్టి, సినిమా చూడ్డానికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఎంజాయ్ చేయండి. తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లండి" అని తన అభిమానులకు, ప్రేక్షకులకు హితవు పలికారు.

ఇక బెనిఫిట్ షోలకు అనుమతివ్వం

» అల్లు అర్జున్ ప్రీమియర్ షోకి వెళ్లడం సరికాదు

» థియేటర్ వద్ద మహిళ మృతిపై మంత్రి కోమటిరెడ్డి

» చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ

» కొనసాగుతున్న దర్యాప్తు.. బాధ్యులపై నేడో రేపో చర్యలు?



హైదరాబాద్, చిక్కడపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇక నుంచి విడుదలయ్యే సినిమాలకు 'బెనిఫిట్ షో'లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వబోమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సంధ్య థియేటర్‌లో 'పుష్ప-2' ప్రీమియర్ షో చూడ్డానికి వెళ్లిన రేవతి అనే మహిళ.. అక్కడ తొక్కిసలాటలో చనిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతి తనను ఎంతగానో కలచివేసిందన్నారు. బెనిఫిట్ షో ప్రదర్శించే సమయంలో అల్లు అర్జున్ థియేటర్లకు వెళ్లడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సినిమా చూసేందుకు వచ్చిన మహిళ మరణించినా.. హీరో, చిత్ర బృందం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 'ఇప్పుడు మనిషి ప్రాణాన్ని తీసుకురాగలరా?' అని వారిని నిలదీశారు. ఈ సినిమా రూ.వేల కోట్లు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారని.. కాబట్టి, బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని మంత్రి పేర్కొన్నారు. "ఆ సినిమా హీరో, ప్రొడ్యూసర్లకు చెప్తున్నా వాళ్లను ఆదుకోవాల్సిందే" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై దర్యాప్తు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు. బాధ్యులపై ఒకటి-రెండు రోజుల్లోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



హుండీకి వచ్చిన డబ్బులతో ఆలయ సిబ్బంది.

రాజస్థాన్ కృష్ణుడి ఆలయంలో కానుకల వర్షం

కిలో బంగారు బిస్కెట్.. 23 కోట్ల నగదు.. భారీగా ఇతర బంగారు, వెండి కానుకలు

జైపూర్, డిసెంబరు 6: రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ సమీపంలో ఉన్న సన్వాలియా సేఠ్ ఆలయ హుండీకి భారీగా ఆదాయం వచ్చింది. భక్తులు శ్రీకృష్ణుడికి పలు రూపాల్లో విరివిగా కానుకలు అందజేశారు. ఆలయ అధికారులు రెండు నెలల తర్వాత చేపట్టిన లెక్కింపులో ఇప్పటి వరకు కేజీ బరువు ఉండే ఒక బంగారు బిస్కెట్, రూ.23 కోట్లకు పైగా నగదు, వెండి పిస్తోల్, చేతి సంకెళ్లు వంటివి గుర్తించారు. ఇంకా చిన్న బంగారు బిస్కెట్లు, వెండి తాళం, చెవి, ఫ్లూట్, వెండి కళాఖండాలు పలు ఇతర ప్రత్యేక కానుకలను సమర్పించారు. తాజా లెక్కింపులో తేలిన విరాళాల లెక్క.. ఆలయ చరిత్రలోనే రికార్డు అని అధికారులు పేర్కొన్నారు. కానుకలు భారీగా ఉన్న నేపథ్యంలో లెక్కింపును దశలవారీగా చేపడుతున్నారు. హుండీల నుంచి సేకరించిన నగదు, ఇతర బంగారం, వెండి వస్తువుల తూకం, వాల్యుయేషన్ ప్రక్రియ, ఆన్‌లైన్ విరాళాల లెక్కింపు కొనసాగుతోంది. ప్రతి నెల అమావాస్య నాడున ప్రారంభించే లెక్కింపు, ఈసారి 6-7 దశల వరకు కొనసాగే అవకాశం ఉంది.

గ్రామీణ మహిళకు నిలువెత్తు రూపం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆరోపించిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి రాగానే అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించి, ఆవిష్కరిస్తామని చెప్పింది. అన్నట్లుగానే.. గత ఏడాది డిసెంబరులో అధికారం చేపట్టిన వెంటనే విగ్రహం రూపకల్పనపై దృష్టిసారించింది. తెలంగాణ గ్రామీణ మహిళ రూపాన్ని ప్రతిబింబించేలా దీనిని రూపొందించింది. గతంలోలా ఒక దేవత రూపంలోనో, రాచరిక పోకడలతోనో కాకుండా అచ్చం సగటు సామాన్య స్త్రీలా ఉండేలా తయారు చేయించింది. గతంలో ఒక చేతిలో బతుకమ్మ ఉన్నప్పటికీ, మరో చేతిలో మొక్కజొన్న కంకి మాత్రమే ఉండేది. కానీ, తెలంగాణ అంటేనే చిరుధాన్యాల పంటలకు పెట్టింది పేరు. ఇక్కడి మహిళలు పండుగల సమయంలో మెడ చుట్టూ బంగారు గొలుసులను ధరిస్తారు. అవన్నీ ప్రతిబింబించేలా.. తెలంగాణలోని సామాన్య స్త్రీ ఎలా ఉంటుందో ఆ రూపంలోనే ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించింది. అలాగే, పోరాటానికీ ఇందులో పెద్దపీట వేసింది. విగ్రహం దిమ్మెను ప్రజలు పట్టుకున్నట్లు రూపొందిస్తూనే.. దాని కింద ఉద్యమానికి గుర్తుగా బిగించిన పిడికిళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విగ్రహ పనులన్నీ పూర్తవ్వగా.. పచ్చిక బయళ్లు, లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్ పనులు జరుగుతున్నాయి. ఈనెల 9న సాయంత్రం లక్ష మంది మహిళల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భావితరాలకు స్ఫూర్తిగా విగ్రహం: శిల్పి రమణా రెడ్డి

తెలంగాణ తల్లి తాజా విగ్రహాన్ని శిల్పి రమణారెడ్డి రూపొందించారు. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం సహా ఎన్నో ప్రముఖ విగ్రహాలను ఆయన తయారు చేశారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి తాజా విగ్రహం రాష్ట్ర సంప్రదాయాన్ని, బహుజనుల ఉద్యమ భాగస్వామ్యాన్ని, పోరాట స్ఫూర్తిని వ్యక్తపరుస్తుందని తెలిపారు. "కొత్త విగ్రహం సగటు స్త్రీమూర్తిగా, సబ్బండ వర్గాల ఆకాంక్షల స్ఫూర్తిగా, భావితరాల విశ్వాస స్ఫూర్తిగా అందరినీ ఆకట్టుకుంటుంది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని గతంలోనూ ప్రొఫెసర్ గంగాధర్ రూపొందించారు. అప్పట్లో నాటి సీఎం ఆకాంక్షల మేరకు రూపకల్పన జరిగింది. ఆ విగ్రహాన్ని ప్రజల సంస్కృతికి భిన్నంగా రాచరికపు హావభావాలతో ధనిక స్త్రీగా చిత్రీకరించారు. అందుకే ఆ విగ్రహం ప్రజల మన్ననలు పొందలేదు. తెలంగాణ తల్లి అంటే ప్రజల మాతృమూర్తి. దశాబ్దాల పోరు, పోరాటాల చరిత్ర ఈ రాష్ట్రానిది. తొలి, మలిదశ ఉద్యమాల్లో వేలమంది అమరుల త్యాగాలతో, సోనియా గాంధీ ఆశీర్వాదంతో రాష్ట్రం సిద్ధించింది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు సహా సకల బహుజనులు సాధించిన విజయమిది. సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగానే దీనిని రూపొందించాం" అని ఆయన వివరించారు.

ఆస్పత్రి లిఫ్ట్ కూలి బాలింత మృతి

» ఉత్తరప్రదేశ్‌లో ఘటన

లఖ్‌నవూ: నవ మాసాలు మోసి కన్న బిడ్డను ఒడిలోకి తీసుకోక ముందే ఆ తల్లి మృత్యు ఒడికి చేరింది. ఈ విషాదకర ఘటన ఉత్తరప్రదేశ్ మేరఠ్‌లోని క్యాపిటల్ ఆస్పత్రిలో శుక్రవారం జరిగింది. మేరఠ్‌కు చెందిన కరిష్మా శుక్రవారం క్యాపిటల్ ఆస్పత్రిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత కరిష్మాను ఇద్దరు ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ ద్వారా గ్రౌండ్‌లో ఫ్లోర్‌లోని వార్డుకు తరలిస్తుండగా లిఫ్ట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో కరిష్మా మృతి చెందగా.. ఇద్దరు ఆస్పత్రికి సిబ్బంది గాయాలపాలయ్యారు. ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే కరిష్మా మృతి చెందిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు.

'ఫీటల్ లైట్'తో గర్భిణులకు సులువుగా పరీక్షలు



ఇన్నాసెల్ అనే సంస్థ గర్భిణులకు సులువుగా పరీక్షలు నిర్వహించేందుకు 'ఫీటల్ లైట్' పేరుతో కొత్త పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. చిన్న బొమ్మలాంటి పరికరాన్ని పొట్టపై ఉంచి పరీక్షిస్తే... లోపల శిశువు గుండె పనితీరు, రక్తపోటు, ఇతర వివరాలన్నీ స్ర్కీన్‌పై డిస్‌ప్లే అవుతాయి. ఈ పరీక్షలను ఆస్పత్రుల్లో డాప్లర్ విధానంలో చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో పనిచేసే ఈ పరికరాన్ని చిన్న సూట్‌కేసులో ఎక్కడికంటే అక్కడికే తీసుకువెళ్లి పరీక్ష చేయవచ్చు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

మళ్లీ ఆక్రమణల కూల్చివేత షురూ

» రంగంలోకి హైడ్రా బృందాలు

హైదరాబాద్ సిటీ/నేరేడ్‌మెట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైదరాబాద్ హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఈ సంస్థ.మళ్లీ కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. మేడ్చల్ జిల్లా యాప్రాల్‌లో చెరువు బఫర్ జోన్‌లోని సర్కారు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ఫంక్షన్ హాల్‌లోని కొంత భాగం, ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా.. సంబంధిత విభాగాలతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వేచేయించి వాస్తవాలు నిగ్గు తేల్చింది. మేడ్చల్ జిల్లా యాప్రాల్‌లోని నాగిరెడ్డికుంట బఫర్ జోన్‌లో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి డీఎస్ఆర్ పేరిట ఫంక్షన్ హాల్ నిర్మించాడు. ఆ ఫంక్షన్ హాల్ కొంత మేర సర్కా రు స్థలంలో నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదు రావడం తో కమిషనర్ రంగనాథ్ స్పందించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, నీటిపారుదల, హెచ్ఎండీఏ, మునిసిపల్ అధికారులకు సూచించారు. వారి సర్వేలో ప్రభుత్వ భూములుగా ఉన్న సర్వే నం.14, 32లలోని దోబీఘాట్ స్థలం కొంత భాగంలో ఫంక్షన్ హాల్ ఉన్నట్టు గుర్తించారు. దాదాపు 200 చదరపు గజాల స్థలం ఆక్రమించినట్టు నిర్ధారించారు. యాప్రాల్ ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది.

విగ్రహం తెలంగాణ తల్లిదా? కాంగ్రెస్ తల్లిదా?

» కేసీఆర్‌ను గౌరవిస్తేనే..

రేవంత్‌రెడ్డిని గౌరవిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వాలు మారినప్పుడల్లా.. గత ప్రభుత్వ నిర్ణయాలు మారాలా? ఆ విగ్రహం నమూనా తెలంగాణ తల్లిదా..? కాంగ్రెస్ తల్లిదా..?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తమకు ఆహ్వానం అందటం ముఖ్యం కాదని, తెలంగాణ తల్లి రూపమే తమకు ముఖ్యమన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని హెచ్చరించారు. సీఎం స్థాయి వ్యక్తి నోటికి హద్దు.. అదుపు లేకుండా కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని, ఆయన చెప్తే నేర్చుకునే స్థితిలో కేసీఆర్ లేరన్న విషయం గుర్తుచుకోవాలన్నారు. తనను యూపీలో తిరగనివ్వడం లేదని మొత్తుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణలో ఏంజరుగుతుందో ముందు తెలుసుకోవాలన్నారు. ప్రజాసమస్యలపై శాసనసభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అసెంబ్లీ, మండలి సమావేశాలు కనీసం నెలరోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ తల్లి నెత్తిన కిరీటం మాయం.. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ మాయం.. తెలంగాణ తల్లి కాళ్ల కడియాలు మాయం. రవాణా లోగోలో చార్మినార్, కాకతీయ కళాతోరణం మాయం'అని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. మోసం చేయడం మినహా ప్రజలకు చేసిందేమిటి?జాగో తెలంగాణ'అని పేర్కొన్నారు.

యువతను మోసం చేసిన రాహుల్, రేవంత్ : కవిత

బూటకపు హామీలతో తెలంగాణ యువతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ మోసం చేశారని, వారికి ఇచ్చిన హామీల అమలు ఏమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. యువవికాసం పేరిట రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ? వాంకిడి గురుకుల పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మరింత నాణ్యంగా గురుకుల భోజనం



» బాగోలేకుంటే మేడమ్ వస్తేనే తింటామని టీచర్లకు చెప్పాలని పిల్లలకు సూచించా

» భోజన మెనూలో త్వరలో మరిన్ని మార్పులు

» ఇక ప్రవేశ పరీక్ష లేకుండానే ఇంటర్ అడ్మిషన్లు

» 'ఆంధ్రజ్యోతి'తో ఎస్సీ గురుకులాల కార్యదర్శి వర్షిణి

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'భోజనం నాణ్యత కోసం నియమించిన ప్రత్యేక అధికారి ఆమోదం తెలిపిన తరువాతే పిల్లలకు భోజనం వడ్డిస్తున్నాం. ఒకవేళ హాస్టల్‌లో భోజనం బాగోలేకపోతే.. మేడమ్ వస్తేనే తింటామని టీచర్లకు చెప్పాలంటూ పిల్లలకు సూచించాను. ఎస్సీ గురుకులాల్లో పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనపడాల్సిన అవసరం లేదు' అని ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'ఎక్కడైనా పిల్లలు మృతి చెందారన్నా.. ఏమైనా ఇబ్బంది అయిందన్న వార్త వింటే.. ఆ రోజు నిద్ర కూడా పట్టడంలేదు. మేం ఎంతో పవిత్రమైన వృత్తి, బాధ్యతల్లో ఉన్నాం. అలాంటిది పిల్లలకు చెడు జరగాలని ఎవరైనా కోరుకుంటారా?' అని అన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచడంతో ఇప్పటికే భోజన మెనూ మారిందని, త్వరలో మెనూలో మరిన్ని మార్పులు చేయబోతున్నామని వెల్లడించారు. గురుకులాల్లో విద్యార్థుల మానసికోల్లాసం కోసం.. 'ప్రాజెక్టు సంపూర్ణ' పేరుతో క్లాసులు చెబుతున్నామన్నారు. ఇక నుంచి ఎస్సీ గురుకుల పరిధిలోని ఇంటర్ కాలేజీల అడ్మిషన్లను నేరుగా భర్తీ చేయనున్నామని, ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండబోవని చెప్పారు. అయితే, ఈ నిబంధన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లకు (సీవోఈ) వర్తించదని.. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చి నవారికే సీవోఈల్లో అవకాశం ఉంటుందని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు మాత్రం ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ గురుకులంలో 5వ తరగతి అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేస్తున్నామన్నారు. గురుకుల వెబ్‌సైట్‌లో అడ్మిషన్ పేజీని ఎం చుకుని, దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించామన్నారు. కాగా, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మే 15 నాటికి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18న ఐదో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి, ఫిబ్రవరి 23న పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. గురుకులంలో చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లిన వారితో అనుభవాలు, పలు అంశాలపై పిల్లలకు ప్రత్యేకంగా క్లాసులు చెప్పించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. గురుకులాలను కొంతమంది స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం తగదన్నారు. ప్రజాప్రతినిధుల పేరుతో కొంతమంది గురుకులాల్లోకి చొరబడేందుకు యత్నిస్తున్నారని, అలాంటివారి విషయంలో క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులూ పెడతామని హెచ్చరించారు.

సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి

» పామేడు సమీపంలోని జీడిపల్లిలో ఘటన

» బీజీఎల్స్‌తో కాల్పులు.. ఇద్దరు జవాన్లకు గాయాలు

» మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ప్లాన్?

చర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లలో సహచరులను కోల్పో తూ తీవ్ర ఆగ్రహంతో ఉన్న మావోయిస్టులు.. ప్రతి చర్యగా శుక్రవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ పామేడు సమీపంలోని జీడిపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడి చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ నాయకుడు మాద్వి హిడ్మా ఆధ్వర్యంలో జరిగినట్లుగా భావిస్తున్న ఈ దాడి దాదాపు 6 గంటల పాటు సాగింది. వందల మంది మావోయిస్టులు పాల్గొన్నట్లుగా తెలుస్తోంది. జీడిపల్లిలో సీఆర్‌పీఎఫ్-228కి చెందిన 2 క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. మొదటిది పూర్తయింది. నిర్మాణంలో ఉన్న రెండో క్యాంపుపై గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. లేజర్ గైడెడ్ బాంబులైన బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లను (బీజీఎల్స్) వినియోగించారు. దీంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ప్రతిగా బలగాలు ప్యారా బాంబులు వేశాయి. కాగా, కాల్పుల సమయంలో బీజాపూర్ జిల్లా కీలక పోలీస్ అధికారులు క్యాంపుల్లోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు క్యాంపు నిర్మాణంలో పని చేస్తున్న కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, సమీప గ్రామస్థులు భయాందోళన చెందారు. సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లను మావోయిస్టులు వ్యతిరేకిస్తున్నారని, పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలోనే దాడికి పాల్పడ్డారని బలగాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి 16న పామేడు సమీపంలోని ధర్మారం క్యాంపుపై వందలమంది దాడికి దిగారు. శుక్రవారం దాడి జరిగిన ప్రదేశం.. జీడిపల్లి క్యాంపునకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. తెలంగాణ సరిహద్దులోని చర్ల మండలానికి ఇవి 8 నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ

» హాజరు కానున్న చంద్రబాబు, వెంకయ్యనాయుడు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 14న దివంగత ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ స్మారక సాహిత్య కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దనరావు శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. "గత నెల 24 నాటికి ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75 ఏళ్ల పూర్తయ్యాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నియంతపై తిరుగుబాటు

దక్షిణకొరియా అధ్యక్షుడు తనకుతానుగా తప్పుకోవడమో, మిగతావారంతా ఆయనను దించేయడమో రేపోమాపో ఖాయం. ఆయనను అభిశంసించే ప్రయత్నం మరింత వేగం పుంజుకుంది. ఎంత పాపిష్టిపనిచేసినా అధినాయకుడి నిర్ణయాలను గుడ్డిగా సమర్థించే దిగువస్థాయి నేతలను చూస్తున్న మనకు దక్షిణకొరియా పరిణామాలు ఆశ్చర్యం కలిగించేవే. అప్రజాస్వామిక వైఖరులను, నిరంకుశ నిర్ణయాలను కేవలం నిరసనలతోనూ, ధర్నాలతోనూ జనం వ్యతిరేకిస్తే కూడా సహించలేని పాలకులు మన మధ్య ఉన్నారు. లాఠీ దెబ్బలతోనూ, తూటాలతోనూ అణచివేయడం తప్ప, ప్రజాభీష్టాన్ని గౌరవించడం, ప్రజాస్వామికంగా వ్యవహరించడం మన నాయకులకు తెలియనివిద్య. అవినీతి ఆరోపణలతో పరువుపోగొట్టుకొని, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం సైనికపాలనను ప్రకటించిన ఆరుగంటల్లోనే జనానికి జడిసి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న దక్షిణకొరియా అధ్యక్షుడిని విమర్శించాలో, ప్రశంసించాలో తెలియని స్థితి.

అధ్యక్షభవనాలను వేలాదిమంది చుట్టుముట్టినా కాల్చిపారేయడం తప్ప, గద్దెదిగిరాని నియంతలను మనం చూశాం. సైనికపాలన నిర్ణయాన్ని కొద్దిగంటల్లోనే వెనక్కుతీసుకోవడానికి అధ్యక్షుడు యూన్ సెక్‌యోల్ మీద వచ్చిన ఒత్తిడి చిన్నదేమీ కాదు. దానిని బేఖాతరు చేసి, ఆఖరు నిముషం వరకూ ఆయన అంతే నిరంకుశంగా వ్యవహరించివుంటే, అంతకంతకూ మరింత మూర్ఖంగా వ్యవహరించి ఉంటే, పరిస్థితి పూర్తిభిన్నంగా ఉండేది, కథ ఇలా ముగిసేది కాదు. తప్పటడుగువేసినా, వెనకడుగువేసినందుకు, విపక్షనేతల, ప్రజల ఒత్తిడికి తలొగ్గినందుకు ఆయనను మెచ్చుకోవాలి. ఇటువంటి వాడు దేశాధ్యక్షస్థానానికి పనికిరాడు, ఆయన తనకుతానుగా దిగితే సరి, లేదా కలసి దించేస్తామని విపక్షాలు ఏకకంఠంతో నిర్ణయాన్ని ప్రకటించాయి. ఆశ్చర్యమేమంటే, స్వపక్షంనుంచి కూడా అదే అభిప్రాయం వినబడుతూండటం. ఆయనను దేశాధ్యక్షుడిగా కూచోబెట్టిన పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) పెద్ద తలకాయలు కూడా ఇదేమాట అంటున్నారు. ఆయన మర్యాదగా తప్పుకోవడం కాదు, అంతలోగా మనమే దించేయకపోతే పార్టీ పరువు పోతుందన్న ఆ కాస్తంత ఇంగితజ్ఞానం వాళ్ళకు ఉన్నందుకు సంతోషించాలి. రాష్ట్రాలకు రాష్ట్రాలు కులం కార్చిచ్చుల్లోనో, మతం మంటల్లోనో తగలబడుతున్నప్పుడు నిమ్మకునీరెత్తినట్టుండే పాలకులను, అస్మదీయులను వెనకేసుకొచ్చే అధినాయకులనూ మనం చూస్తూనే ఉన్నాం.

అంతచైతన్యవంతంగా ఉన్నందుకు దక్షిణకొరియా ప్రజలను మెచ్చుకోవాలి. విపక్షనేతలు సరేసరి. అపఖ్యాతి పాలైన అధ్యక్షుడు నిరంకుశుడై, నిరవధికంగా దేశాన్ని ఏలాలని కుట్రపన్నుతున్నాడు కనుక, అతడితో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధపడ్డారు. రెండువందలమంది ఎంపీలు రాత్రికిరాత్రి గేట్లు దూకి, చట్టసభల్లోకి ప్రవేశించి అధ్యక్షుడి నిర్ణయాన్ని తిరగదోడటం మంచి పరిణామం. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ఒక నాయకుడు, రాజ్యవ్యతిరేక శక్తుల్ని ఏరిపారేస్తానని, కల్లోలంగా ఉన్న దేశాన్ని చక్కదిద్దుతానని ఏవో బూటకపు మాటలు చెబుతూ మరో నియంతగా తయారైనాడని ప్రజలు ఇట్టే గ్రహించారు. ఎవరి ప్రోద్బలమూ, నాయకత్వమూ లేకుండా, అనతికాలంలో అన్నివేలమంది రోడ్లమీదకు వచ్చి, నినాదాలతో, నిరసనలతో అధినాయకుడిని గడగడలాడించడం ప్రశంసనీయమైనది. ఉత్త చేతులతో వీధుల్లోకి వచ్చి, సైన్యం చేతుల్లో ఉన్న తుపాకులు లాక్కోగలిగిన ఆ సాహసం మెచ్చుకోదగినది. పొరుగుదేశాలను, అక్కడి మతాలను, కార్చిచ్చులను, కల్లోలాలను చూపి, లేని కుట్రలన్నీ వాటికి ఆపాదించి హాయిగా అధికారంలో కొనసాగే పాలకులను మనం చూస్తున్నాం. కానీ, ఒక మహానియంత ఏలుబడిలో ప్రత్యర్థిదేశం పొరుగునే ఉండగా, నిత్యమూ నెత్తిన యుద్ధవిమానాలు తిరిగే వాతావరణంలో దశాబ్దాలుగా బతుకుతూన్నప్పటికీ దక్షిణకొరియా ప్రజలు తమ అధ్యక్షుడి వాదనలకు విలువ ఇవ్వకపోవడం ఆశ్చర్యం. పొరుగుదేశం ఎంత ప్రమాదకరమైనదో వారికి తెలియనిదేమీ కాదు. కానీ, తన తప్పుడు పనికి అధినాయకుడు ఉత్తరకొరియా బూచిని చూపడాన్ని వారు అంగీకరించలేదు, తీవ్రంగా ప్రతిఘటించారు కూడా. ఆదేశాలున్నాయి కదా అని జనాన్ని పిట్టల్లా కాల్చేయకుండా ప్రజాగ్రహానికి జడిసిన, వారి నిరసనలను గౌరవించిన సైన్యాన్ని సైతం మెచ్చుకోవాలి.

నాలుగుదశాబ్దాల క్రితం వరకూ అనుభవించిన సైనికపాలనను దక్షిణకొరియా ప్రజలు విస్మరించలేదు. ఆనాటి నియంతృత్వం తిరిగి తలెగరేయకుండా జాగ్రత్తపడ్డారు. అప్పటిపాలకులను ఘనంగా కీర్తించే ఇప్పటి దేశాధ్యక్షుడు ఆర్థికంగా ఎదిగిన దేశాన్ని ముంచేయకుండా కాపాడుకున్నారు. పొరుగుదేశాలను, కమ్యూనిస్టులను బూచిగా చూపే కుట్రలను ఛేదించారు. కష్టపడి సాధించిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నారు.

జెలెన్ స్కీ పుణ్యమే ఉక్రెయిన్ యుద్ధం!

అధినేత అని ఊరికే అనరు. ప్రజలు వారికి అలవోకగా ఆ బిరుదు ఇవ్వరు. పరిపాలనా దక్షకుడు అనేది కూడా భావోద్వేగాల లోంచి పుట్టుకురాదు. తాను పాలించే ప్రజల ధన ప్రాణ మానాలకు నష్టం కలగకుండా ఓర్పుతో నేర్పుతో నెగ్గుకు రావడం వల్ల కలిగే కీర్తి పరిపాలనా దక్షత. ఈ మధ్య కాలంలో అవేవీ లేకుండా గాలి వాటంగా నేతలు అధినేతలై గద్దెనెక్కుతున్నారు. ముఖ్యంగా ప్రజల పాలన పట్ల ఏ మాత్రం అవగాహన లేనివారు, తమ అభిమాన గణం అహో ఓహోల మధ్య నాయకులై పోతున్నారు. వారికి తోచిందే నినాదం. దేశమేదైనా ప్రజలను చాలా చాలా సులువుగా ఆకట్టుకొని మంట పుట్టించే నినాదాలు జాతీయవాదం, మతం. మనదేశంలో అయితే కులం అనే మరో అదనపు నినాదం కూడా ఉంది. ఈ నినాదాలకు కాస్త గ్లామర్ తోడైతే ఇక నేతల జనాదరణకు ఆకాశమే హద్దు. ఇలాంటి వారిని మన దేశంలో చాలా మందే చూడొచ్చు. కాకపోతే వారు ఇంకా రాష్ట్రాల పరిధిలోనే ఉండిపోయారు కాబట్టి మనం బతికిపోతున్నాం సుమా!

అసలు విషయంలోకి వస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా ఈ కోవలోనే అధికారంలోకి వచ్చాడు. అంతకుముందు ఆయన రాజకీయాలతో ఎలాంటి ప్రమేయం లేని వ్యక్తి. ప్రజలు, ప్రజా జీవితంతో మమేకమైన మనిషి కాదు. ఉక్రెయిన్ సినిమాల్లో కమెడియన్ పాత్రధారి మాత్రమే, క్వార్టర్ 95 నిర్మాణ సంస్థ 'వన్ ప్లస్ వన్' నెట్ వర్క్‌లో నిర్మించిన 'సర్వెంట్ ఆఫ్ ది పీపుల్' సిరీస్‌లో హిస్టరీ ప్రొఫెసర్ పాత్రలో నటించాడు. ప్రొఫెసర్ పాత్రలో అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో అనుకోకుండా ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు అవుతాడు. అప్పుడున్న ఉక్రెయిన్ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టినట్టు ఉండటంతో ఆ సినిమా సూపర్ డూపర్ హిట్టయ్యింది. అచ్చు గుద్దినట్టుగా ఈ కల్పిత పాత్రే కొంచెం అటు ఇటుగా నిజమైంది. క్వార్టర్ 95 టీవీ సంస్థ ఆ సిరీస్ పేరుతోనే సర్వెంట్ ఆఫ్ ది పీపుల్ అనే పార్టీ స్థాపించింది. జెలెన్ స్కీ ఆ పార్టీ తరఫున పోటీ చేసి 72 శాతానికి పైగా ఓట్లు సాధించి ఉక్రెయిన్ అధ్యక్షుడయ్యారు. ఇది మన దగ్గర అంతకుముందే తెలుగు తమిళ భాషల్లో అర్జున్ హీరోగా నటించిన హిట్ సినిమా 'ఒక్కడు' మూవీని కాపీ కొట్టినట్టు ఉంటుంది. జెలెన్ స్కీ ఆ ఎన్నికల్లో తూర్పు ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పుతా, అవినీతిని అంతమొందిస్తా... ఇత్యాది నినాదాలతో అధికారంలోకి వచ్చాడు. అవినీతి సంగతేమో కానీ ఆ దేశం మొత్తంలోనే శాంతి లేకుండా పోయింది. అశాంతి ఉక్రెయిన్‌కే పరిమితం కాలేదు. యూరప్ మొత్తం యుద్ధ భయంలో ఉంది. ఐరోపా ఏమిటి, ప్రపంచమే అణుయుద్ధం భయంతో ఉలిక్కిపడుతోంది. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రష్యాతో యుద్ధం విషయంలో జెలెన్ స్కీ అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని అనిపిస్తోంది. దాని పర్యవసానాలు, దేశ ప్రజల స్థితిగతులు ఎలా మారిపోతాయో అంచనా వేయకుండా ఆయన కయ్యానికి కాలు దువ్వారని భావించక తప్పడం లేదు. దీనర్థం రష్యా దురాక్రమణను సమర్థించడం కాదు. పిరికితనంతో వ్యవహరించమనడం అంతకంటే కాదు.

ప్రజలను పాలించడం అంటే సినిమాల్లోనో లేక స్టేజీల మీద పూనకాలు వచ్చినట్టు బూతులు తిడుతూ, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ఊగిపోతూ చేసే ప్రసంగాలు చేయడం కానే కాదు. సమయానుకూలంగా, సందర్భోచితంగా చాకచక్యంతో వ్యవహరించడం. అవసరాన్ని బట్టి ఒకడుగు ముందుకు మరో అడుగు వెనక్కు అన్నట్టు ఉండాలి. ప్రత్యర్థి బలాబలాలను, స్వంత బలాన్ని అంచనా వేసి నిర్ణయాలు తీసుకోవాలి. అవతలివాడు బలవంతుడైతే వాడు బలహీనపడే సమయం కోసమే ఎదురు చూడాలి. మన వెంట వచ్చేవారు నమ్మకస్తులు, చివరి వరకూ తమతో ఉండేవారు ఎవరు, మధ్యలో వీడేవారు ఎవరు అని గుర్తెరగాలి. పక్కవారికి చెవులు అప్పగించరాదు. ఒకవేళ వారి మాటలు విన్నా అవి ఏ మేరకు మనకు ఉపయోగపడతాయో చూసుకోవాలి. ఇవేవీ ఆలోచించకుండానే చెప్పుడు మాటలు విని హీరోయిజం మత్తులో జెలెన్ స్కీ తీసుకున్న తప్పుడు నిర్ణయం ఇప్పుడు ఆ దేశ ప్రజల జీవితాలను సర్వనాశనం చేసింది.



అమెరికా చెప్పుడు మాటలు విని నాటోలో చేరతామని రష్యా ముందు తొడలుగొట్టి మరీ జెలెన్ స్కీ యుద్ధ రంగంలోకి దిగాడు. నాటో సభ్యత్వం వచ్చి ఉంటే ఉక్రెయిన్‌కు వచ్చే లాభం ఏమిటో, ఎంతో తెలియదు కానీ ఇప్పుడు ఆ దేశం కకావికలమయ్యింది. నాటో సభ్యత్వం లేదు, బహిరంగంగా వెంట వస్తాయని భావించిన నాటో దళాలు చాటు మాటు సాయానికే పరిమితమయ్యాయి. ఉక్రెయిన్ తరఫున నేరుగా యుద్ధంలో పాల్గొంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ అణుదాడి చేస్తాడని నాటో దేశాలు గజగజ వణికిపోతున్నాయి. రష్యా, చైనా, ఉత్తర కొరియా, మూడూ ఒక కూటమిగా తిరగబడితే అమెరికా ఆధిపత్యం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఐరోపా దేశాలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ సమయంలో యుద్ధాన్ని ఆపడానికి అమెరికా చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు. శవాల మీద పేలాలు ఏరుకుంటున్నట్టుగా ఆ అగ్రరాజ్యం వ్యవహరిస్తోంది. ఉక్రెయిన్‌కు యుద్ధ సామగ్రి సరఫరా చేసి ఆయిల్ నిల్వలు దక్కించుకుంటూ తన నికృష్ట బుద్ధి చూపిస్తోంది.

> **ప్రజల రక్షణే ధ్యేయంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ నిర్ణయాలు తీసుకోలేదని ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. యుద్ధం ఎడతెగకుండా కొనసాగుతుంటే, నమ్మినవారు ఒక్కొక్కరు దూరమవుతుంటే నిస్తేజమైపోతున్న ఉక్రెయిన్ ప్రజలకు ఆయన ఏం సమాధానం చెప్పగలరు? ముందస్తు పరిణామాలు అంచనా వేయకుండా నాయకుడు తీసుకునే నిర్ణయాలు ప్రజలకు తీరని నష్టం చేస్తాయనడానికి ఉక్రెయిన్ ఒక ఉదాహరణ.**

జెలెన్ స్కీ ఈ పరిణామాలను గుర్తిస్తున్నారా? లేదు. కనుకనే ఉక్రెయిన్ ప్రజల్ని యుద్ధ గుండంలో దహనం చేస్తున్నాడు. ఈ యుద్ధ కాలంలో ఇంతవరకు ఉక్రెయిన్ జనాభా కోటి తగ్గింది. ప్రపంచంలోనే గణనీయంగా పెట్రో నిల్వలు, నూనె గింజల ఉత్పత్తి, అణు ఇంధన శక్తి కేంద్రాలు, (సోవియట్ యూనియన్ కాలంలో ఏర్పాటు చేసిన) సువిఖ్యాత వైద్య, విద్యా సంస్థలు ఉక్రెయిన్‌లో ఉన్నాయి. అక్కడ వ్యవసాయం అతి పెద్ద వనరు. ఎంతగా అంటే ఏటా కోటి టన్నుల పొద్దు తిరుగుడు పండుతుంది. దీని నుండి ఉత్పత్తి చేసే సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో 27 శాతం నూనె మన భారతదేశానికే ఎగుమతి చేస్తోంది ఉక్రెయిన్. ఇప్పుడు ఆ సారవంతమైన వ్యవసాయ భూములు, యుద్ధ క్షేత్రాలుగా మారిపోయాయి. ఆ భూముల్లో ల్యాండ్ మైన్లు, యుద్ధ ట్యాంకులతో నిండిపోయాయి. ఒకవేళ ఏదో రకంగా యుద్ధం ముగిసినా ట్యాంకులు వెళ్లిపోతాయి. కానీ ల్యాండ్ మైన్స్ అక్కడి రైతుల ప్రాణాలు బలిగొంటూనే ఉంటాయి.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దన్ను చూసుకొని యుద్ధ రంగంలోకి దిగాడు. ఇప్పుడు ఆయన అధ్యక్ష పదవి నుంచి దిగిపోతున్నాడు. రష్యా అధ్యక్షుడు పుతిన్ స్నేహితుడు ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాడు. ఇప్పుడు పరిస్థితి ఏంటి? బైడెన్ తరహాలో ట్రంప్ సాయం చేస్తాడా? అదునా ట్రంప్, జెలెన్ స్కీతో ఫోన్ ఆడియో లీక్ వ్యవహారం ఉండనే ఉంది. ఈ ఆడియో లీక్ చేసి కేసులు ఎదుర్కోవడానికి జెలెన్ స్కీనే కారణమన్న కోపంలో ఉన్న ట్రంప్ సహకరించకపోవచ్చు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే మన తుంటరి భాషలో చెప్పాలంటే జెలెన్ స్కీ బకరా అయ్యినట్టు కన్పిస్తోంది. వ్యక్తిగా ఆయన బకరా అవ్వడం అటుంచితే, ఉక్రెయిన్ నష్టాన్ని ఎవరు పూడ్చగలరు? ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 15 లక్షల కోట్ల డాలర్లకు పైగా అవుతుందని అంచనా. మరి వెలకట్టలేని ప్రాణాల సంగతేంటి? కొన్ని తరాలు చెల్లించాల్సిన మూల్యం ఎంత? కటువుగా చెప్పాలంటే దేశాధ్యక్షుడు ఇంత బుర్ర తక్కువ నిర్ణయం తీసుకుంటాడా అనే ప్రశ్న ఎదురవుతోంది. అధ్యక్షుడి పరిపాలనా నిర్ణయం అంటే కోట్ల మంది తలరాత అని గుర్తించాలి కదా.

ఉక్రెయిన్ యుద్ధం జెలెన్ స్కీ, పుతిన్‌ల మొండితనం వల్లే వచ్చింది కావొచ్చు. మరి రష్యాకూ భారీ నష్టం వాటిల్లింది. చెప్పవచ్చిందేమిటంటే అమెరికా రష్యా పోట్ల గిత్తల రాజకీయ ఎత్తుల్లో చిత్తయ్యింది మాత్రం ఉక్రెయిన్ ప్రజలు. జెలెన్ స్కీ దేశాధ్యక్షుడిగా ప్రజల రక్షణే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకోలేదని అర్థమవుతోంది. రాజకీయ పరిణతితో కాకుండ అపరిపక్వ నిర్ణయం తీసుకున్నారని రోజు రోజుకూ రూఢి అవుతోంది. యుద్ధం మొదట్లో అమెరికా కాంగ్రెస్ యూరప్ దేశాల పార్లమెంట్, ఐక్యరాజ్యసమితిని ఉద్దేశించి ఉక్రెయిన్ భాషలోనే గంభీర ప్రసంగాలు చేశారు. లోపల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి పైన ఆలివ్ గ్రీన్ టీ షర్ట్ ధరించి సైనికులను నేరుగా కలిస్తే చూపరులకు ఆకర్షణీయంగా ఉంటుందేమో కానీ దేశ ప్రజల జీవితాలకు ఏ రకంగానూ ఉపయోగపడదు. దీర్ఘకాల యుద్ధం కొనసాగుతుంటే, నమ్మినవారు ఒక్కొక్కరు దూరమవుతుంటే నిస్తేజమైపోతున్న ఉక్రెయిన్ ప్రజలకు ఏం సమాధానం చెప్పగలరు. ఆవేశపూరిత ప్రసంగాలు, ముందస్తు పరిణామాలు అంచనా వేయకుండా తీసుకునే నిర్ణయాలు తీరని నష్టం కలుగచేస్తాయని చెప్పడానికి ఉక్రెయిన్ ఒక ఉదాహరణ. జెలెన్ స్కీ శాశ్వత మానవుడు లేదా ఉక్రెయిన్ శాశ్వత అధ్యక్షుడు కాదు కదా. యుద్ధాన్ని ఏదో ఒకనాడు ముగించాల్సిందే రేపటి తరానికి సమాధానం చెప్పాల్సిందే. అన్నింటికీ యుద్ధమే గత్యంతరం కాదు.

● జయసారథి రెడ్డి
జర్నలిస్టు

ఈ వివాదాలకు అంతమెక్కడ?

చాలా చట్టాల రూపకల్పనను నేను మొదటి నుంచి చివరివరకు పర్యవేక్షించడం జరిగింది. ముసాయిదా బిల్లు చిన్నదిగా, స్ఫుటంగా, స్పష్టంగా ఉండాలని న్యాయమంత్రిత్వ శాఖ న్యాయశాస్త్ర నిపుణులకు గట్టిగా సూచించేవాణ్ణి. 'ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం—1991' నా ప్రమేయమున్న చట్టాలలో ఒకటి. అది చాలా చిన్న చట్టం. 8 సెక్షన్లు మాత్రమే అందులో ఉన్నాయి. ఆ చట్టానికి ఒక లక్ష్యమున్నది. ఆ లక్ష్యం స్ఫుటంగా ఉన్నది: ఆగస్టు 5, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని స్తంభింపజేయడం అంటే యథాతథంగా ఉండేలా చేయాలని నిర్దేశించింది. ఆ చట్టం చాలా స్పష్టంగా ఉంది. 'అయితే'లు, 'అయినా'లు, 'కానీ'లకు లేదా అయినప్పటికీ' ఇత్యాది మినహాయింపులు, అభ్యంతరాలకు తావివ్వనిదిగా ఉన్నది. మరీ ముఖ్యంగా ఆ చట్టం పూర్తిగా 'పక్షపాత రహితం'గా ఉన్నది. పూర్వ భావనలు, అవిచారితాభిప్రాయాలను ప్రోత్సహించేదిగా లేదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆ చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4 (1)ని ప్రతి ఒక్కరూ చదవాలని నేను కోరుతున్నాను. సెక్షన్ 3: ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని మార్చడంపై నిషేధం. ఒక మతపరమైన ప్రార్థనా స్థలం లేదా మతపరమైన ప్రార్థనా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి లేదా అదే మతానికి చెందిన వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనా స్థలంగా ఎవరూ మార్చకూడదు. సెక్షన్ 4: ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని మార్చడానికి సంబంధించి అన్ని అప్పీళ్లు, దావాలు లేదా ఇతర న్యాయవిచారణ కార్యకలాపాలు చట్టం ప్రారంభమైన తరువాత ముగుస్తాయి. తాజా అప్పీళ్లను దాఖలు చేయడం అనుమతించబడదు. ఆగస్టు 15, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావం ఎలా ఉన్నదో, ఆ రోజున ఉన్న రీతిలోనే కొనసాగుతుంది. అయితే (అయోధ్యలో ఉన్న) రామజన్మభూమి—బాబ్రీ మసీదుగా దేశ ప్రజలకు సుపరిచితమైన ప్రార్థనా స్థలాన్ని మాత్రం ఈ చట్టం నుంచి మినహాయించారు. ఆ ప్రార్థనా స్థలంపై అప్పటికే సుదీర్ఘకాలంగా న్యాయ వివాదం కొనసాగుతుండడమే ఆ మినహాయింపునకు కారణం.


ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం లక్ష్యం, ఉద్దేశం, స్ఫూర్తి, పరిధికి విస్తృతంగా ప్రజామోదం లభించింది. సామాన్య విద్యావంతులు, న్యాయశాస్త్ర నిపుణులు ఆ చట్టాన్ని హర్షామోదాలతో స్వాగతించారు. ఆ చట్టం తన లక్ష్యాన్ని సాధించిందని నేను అభిప్రాయపడుతున్నాను. వివిధ ప్రార్థనా స్థలాలకు సంబంధించిన పలు వివాదాలపై ఎటువంటి జగడాలు లేకుండా మూడు దశాబ్దాల పాటు ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దేవాలయం ఒక దేవాలయంగా ఉండాలని, ఒక మసీదు ఒక మసీదుగా ఉండాలని, ఒక చర్చి ఒక చర్చిగా ఉండాలని, ఒక గురుద్వారా ఒక గురుద్వారాగా ఉండాలని, ఇంకా ఇతర మతాల ప్రార్థనా స్థలాలు ఆగస్టు 15, 1947న ఎలా ఎలా ఉన్నాయో అలాగే యథాతథంగా ఉండాలనే విషయాన్ని దేశ పౌరులు చాల వరకు అంగీకరించారు.

దురదృష్టవశాత్తు ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం అమలవుతున్న తీరు తెన్నులపై సమగ్ర సమాచారం లేదు. PRISM పార్లమెంటు కార్యకలాపాల పరిశోధనా సంస్థ)ను వాకబ్ చేయగా ఆ చట్టం కింద జరిగిన అరెస్టులు, విధింపబడిన శిక్షల గురించి పార్లమెంటులో మూడు సందర్భాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం చప్పిడి సమాధానాలు మాత్రమే ఇచ్చిందని తెలియజేసింది. మొత్తం మీద కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆ చట్టం పనిచేస్తున్న తీరుపై నిరపాయకరమైన నిరక్ష్యం చూపారని చెప్పవచ్చు.

న్యాయస్థానాలు రంగప్రవేశం చేశాయి. అక్టోబర్ 28, 2020న దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఒక రిట్ పిటిషన్ దాఖలయింది. ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం—1991-లోని సెక్షన్లు 2, 3, 4 సెక్షన్లను నిష్ప్రయోజనకరమైనవిగాను, రాజ్యాంగవిరుద్ధమైనవిగాను ప్రకటించాలని ఆ రిట్ పిటిషన్ విజ్ఞప్తి చేసింది. పిటీషన్‌దారు అందుకు చూపిన కారణమేమిటి? అనాగరిక దురాక్రమణదారులు న్యాయసమ్మతం కాని రీతిలో 'ప్రార్థనా స్థలాల'ను తమవిగా చెల్లబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నందున 1991 చట్టంలోని 2, 3, 4 సెక్షన్లను రద్దు చేయాలి. ఇదీ ఆ పిటీషనర్ వాదన.

సెక్షన్ 3, సెక్షన్ 4 ఆ చట్టంలోని కీలక భాగాలు. అవి లేకుంటే ఆ చట్టంలో ఏమీ ఉండదు. అది అసలు అనవసరం. భారత రాజ్యాంగం అధికరణలు 14, 15, 21, 25, 26, 29ని ఆ రెండు సెక్షన్లు ఉల్లంఘిస్తున్నాయనే వాదనతో సుప్రీంకోర్టులో సెక్షన్ 3, సెక్షన్ 4ను సవాల్ చేశారు. ఆ 'ప్రార్థనా స్థలాలు' అనాగరిక దురాక్రమణదారులు చట్టవిరుద్ధంగా స్వాయత్తం చేసుకున్నవని పిటీషనదారు పేర్కొనడం గమనార్హం. ఏ మత ప్రజల తరఫున తాను ఈ పిటిషన్ దాఖలు చేసింది, ఏ మత సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పిటీషన్‌ను వేసింది కూడా పిటీషన్‌దారు స్పష్టంగా పేర్కొన్నాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'హిందువుల, జైనుల, బౌద్ధుల, సిక్కుల' మత ప్రదేశాలను చట్టబద్ధంగా ఆయా మతస్థులకు పునరుద్ధరించాలని ఆ పిటీషన్‌దారు అభ్యర్థించాడు. అక్టోబర్ 28, 2020 నుంచి ఆ రిట్ పిటీషన్ పెండింగ్‌లో ఉన్నది.

2023లో సుప్రీంకోర్టు ఒక స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి)ను విచారణకు స్వీకరించింది. వారణాసిలోని అంజుమన్ ఇంతెజామియ మసీద్ నిర్వహణా కమిటీ ఆ పిటిషన్‌ను దాఖలుచేసింది. ఆగస్టు 3, 2023న అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఒక ఆదేశాన్ని ఆ ఎస్ఎల్‌పి సవాల్ చేసింది. జ్ఞాన్‌వాపి మసీదు ఉన్న స్థలాన్ని సర్వే చేయాలని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ను జిల్లా జడ్జి ఆదేశించారు. ఈ ఆదేశానికి వ్యతిరేకంగా వారణాసిలోని అంజుమన్ మసీదు నిర్వహణదారుల అప్పీల్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని అంజుమన్ మసీదు నిర్వహణదారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆగస్టు 4, 2023న సుప్రీంకోర్టు జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇలా పేర్కొంది: 'హైకోర్టు అభిప్రాయంతో విభేదించలేక పోతున్నాం. రాజ్యాంగ అధికరణ 136 కింద మా న్యాయాధికారాలను వినియోగించుకుంటూ ఆ నిర్ణయానికి వచ్చాం. సొలిసిటర్ జనరల్ వాదనలను నమోదు చేశాం. ఈ కేసులో న్యాయప్రక్రియ అంతా ఎఎస్ఐ అనుసరించే పద్ధతులపై ఆధారపడి ముగుస్తుంది'.



> **ఇప్పుడు మథురలోని ఈద్గా మసీదు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్ మసీదు, ఢిల్లీలోని కుతుబ్ మీనార్ కట్టడం, అజ్మీర్ (రాజస్థాన్)లోని దర్గాపై వివాదాలు ముసురుకుంటున్నాయి. వీటన్నిటికీ ఆస్కారమిచ్చింది జ్ఞానవాపి ఉత్తర్వు కాదూ?**

సుప్రీంకోర్టు ఉత్తర్వు అనేక ఉపద్రవాలకు ఆస్కారం కల్పించింది. చిక్కులకు దారితీస్తోంది. 2022లో సివిల్ దావా (18) వేసిన వారి ఉద్దేశాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరపలేదు. ఆ దావా వేసినవారి అభ్యర్థన: జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలోని ఉన్న దేవతామూర్తులకు పూజలు, ఇతర క్రతువులు నిర్వహించే హక్కు తమకు ఉందని, కనుక ఆ మసీదులో పూజలకు తమను అనుమతించాలి. ఒక మసీదులో ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు తమను అనుమతించాలన్నదే దావా వేసిన వారి అభ్యర్థన అన్నది స్పష్టం. వారి విజ్ఞప్తిని అంగీకరించి, అక్కడ ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు అనుమతి నివ్వడమంటే ఆ మసీదును, కనీసం పాక్షికంగా అయినా ఒక దేవాలయంగా మార్చడమే అవుతుంది. మరి ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం—1991లోని సెక్షన్ 3, సెక్షన్ 4 ప్రకారం అటువంటి అనుమతినివ్వడమంటే ఆ మసీదును హిందూ దేవాలయంగా మార్చడమే అవుతుంది!

2022లో సివిల్ దావా 18 వేసిన వ్యక్తుల ఉద్దేశాన్ని, వారు కోరిన విధంగా జ్ఞాన్‌వాపి మసీదులో పూజలకు అనుమతినిస్తే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో చూడలేమా? అర్థం చేసుకోలేమా? సామాన్య విద్యావంతులకూ అదేమంత కష్టం కాదు. సుప్రీంకోర్టు రాజ్యాంగ అధికరణ 141 కింద తన అధికారాలను వినియోగించుకుని ఆ దావాలో 'న్యాయప్రక్రియ పూర్తి చేసి ఉండాల్సింది' అని నేను అభిప్రాయపడుతున్నాను. దావా 18ని దాఖలు చేయడానికి అనుమతించి, మూడు దశాబ్దాలుగా అందరూ గౌరవిస్తున్న ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం—1991 ప్రకారం ఆ దావాను కొట్టివేసి ఉండవల్సింది. దురదృష్టవశాత్తు దేశ సర్వోన్నత న్యాయస్థానం అలా చేయలేదు. సరే, ఇప్పుడు మథురలోని ఈద్గా మసీదు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్ మసీదు, ఢిల్లీలోని కుతుబ్ మీనార్ కట్టడం, అజ్మీర్ (రాజస్థాన్) లోని దర్గాపై వివాదాలు ముసురుకుంటున్నాయి. వీటన్నిటికీ ఆస్కారమిచ్చింది జ్ఞాన్‌వాపి ఉత్తర్వు కాదూ? జ్ఞాన్‌వాపి ఉత్తర్వు పర్యవసానాలు భారత ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠాకరమైన ఎడిఎమ్ జబల్పూర్ కేసులో వలే ఉండవచ్చు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తెలంగాణ మాతృమూర్తి సోనియా

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం... ప్రపంచానికే ఆదర్శం. అధికారం కోసం ఆమె రాజకీయాల్లోకి రాలేదు. రాజకీయ కుటుంబంలో ఉన్నా ఒక సాధారణ గృహిణిగానే పరిమితమైన ఆమెను విషాదకరమైన పరిస్థితులు రాజకీయాల్లోకి నడిపించాయి. వార్డు మెంబర్ పదవిని త్యాగం చేయడానికి కూడా సిద్ధపడని నేటి రోజుల్లో మూడుసార్లు ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసి కర్మయోగిలా రెండు విడతలలో మొత్తం 22 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఆమె సేవలు అందించారు. లౌకికవాదానికి కట్టుబడుతూ కులం, మతం, ప్రాంతం, భాష.. ఇలా ఏ విషయంలోనూ వివక్ష చూపకుండా అన్ని వర్గాలను ఆదరించే నెహ్రూ—గాంధీ వారసత్వాన్ని ఆమె కొనసాగిస్తున్నారు.

"దుఃఖాన్ని మర్చిపోలేం... అలాగని అధిగమించలేం. దానితో కలిసి బతకడం నేర్చుకోవాలి" అని సంజయ్ గాంధీ మరణించినప్పుడు ఇందిరాగాంధీ చెప్పిన మాటలను సోనియాగాంధీ తన జీవితానికి అన్వయించుకున్నారు. రాజకీయాల్లోకి రావాల్సి వస్తుందని సోనియా ఏనాడు ఊహించలేదు.

దురదృష్టవశాత్తు 1984 అక్టోబర్ 31న ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ హత్యతో సోనియాగాంధీ అంతులేని దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక సోనియా ఎక్కువగా ఆయన్నే అంటిపెట్టుకుని ఉండేవారు. ఆయన కోసం పిల్లలతో గడిపే సమయాన్ని కూడా ఆమె త్యాగం చేశారు. రాజీవ్‌గాంధీ బయటికెళ్లాక ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేవరకు తాను, పిల్లలు భయంతో ఉండేవాళ్లం అని ఒక ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన మాటలను బట్టి అప్పటి వారి వేదనను అర్థం చేసుకోవచ్చు.

> **తెలంగాణ రాష్ట్రంపై సోనియాకు ఉన్న ప్రేమ ప్రత్యేకమైంది. ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుండి జరిగిన అనేక ఉద్యమాలు, బలిదానాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేస్తామని 2004లో కరీంనగర్ వేదికగా సోనియాగాంధీ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2009 డిసెంబర్ 9న హోం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రకటింపజేశారు. అలా తెలంగాణ ప్రజల కలను నెరవేర్చడమే కాకుండా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ఆమె ఎనలేని కృషి చేశారు. తెలంగాణ ప్రజలకు ఆమె తల్లితో సమానం.**



1991 లోక్‌సభ ఎన్నిక ప్రచారానికి రాజీవ్ దేశవ్యాప్తంగా పర్యటించాల్సి ఉండడంతో, సోనియాగాంధీని అమేథీ నియోజకవర్గం చూసుకోమని ఆయన చెప్పారు. ఆమె అమెథీ ప్రజలతో మమేకమై అక్కడ రాజీవ్‌గాంధీని అఖండ విజయంతో గెలిపించినా దురదృష్టవశాత్తు ఆ విజయాన్ని ఆస్వాదించడానికి ఆయన లేరు. రాజీవ్ గాంధీ గురించి ఆమె భయపడినట్టే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో హత్యకు గురయ్యారు. ఏడేళ్ల వ్యవధిలో దేశం కోసం ఇద్దరు కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న సోనియాగాంధీ తీవ్ర నిరాశా నిస్పృహల్లోకి జారిపోయారు. రాజీవ్ మరణం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షపదవి చేపట్టి, ప్రధానమంత్రి కావాలని యావత్ దేశం కోరినా సోనియాగాంధీ తిరస్కరించి, రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగిపోవడంతో లౌకికవాదంతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా బలహీనపడడంతో, పార్టీలోని సీనియర్ నాయకుల ఒత్తిడితో సోనియాగాంధీ 1997లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం 1998లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలు గెలవడంతో సోనియాగాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ప్రజల గొంతుకయ్యారు.

'షైనింగ్ ఇండియా' అంటూ గారడి మాటలతో గడిపిన వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతగా సోనియాగాంధీ అలుపెరగని పోరాటం చేశారు. 2004 ఎన్నికల సందర్భంగా 'కాంగ్రెస్ కీ హాత్.. గరీబోంకీ సాత్' (కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం) అనే నినాదం ఇచ్చి దేశ ప్రజల మనస్సులను చూరగొనడమే కాకుండా 2004లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టడానికి ఆమె ఎంతో కృషిచేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించడానికి, లౌకికవాదాన్ని కాపాడడానికి ఆమె ప్రతిపక్ష పార్టీలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి యూపీఏ కూటమిని ఏర్పాటు చేశారు.

సోనియాగాంధీ 2003లో దేశవ్యాప్తంగా పర్యటించి దాదాపు 150 ర్యాలీల్లో పాల్గొన్నారు. దీంతో బెంబేలెత్తిన బీజేపీ ఆమెపై వ్యక్తిగత దూషణలు చేయడంతో 'ఇది నా మెట్టినిల్లు. మట్టిలో కలిసిపోయే వరకు నేను భారతీయురాలినే. ఈ దేశం నా ప్రాణం కంటే ఎక్కువ' అని వారి కుట్రలకు సమాధానం ఇచ్చారు.

వామపక్ష పార్టీల మద్దతుతో 2004లో సోనియాగాంధీకి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ ఓటమి చెందిన బీజేపీ ఆమెపై కక్షగట్టి అనేక రకాలుగా అడ్డుపడింది. విదేశీ మహిళ ప్రధానమంత్రి అయితే తాను గుండు గీయించుకుని తెల్లచీర కట్టుకుంటానని బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా, ఆమెపైన ఎటువంటి కక్షను పెంచుకోకుండా సుష్మాస్వరాజ్ బతికున్నంత కాలం ఆమెతో సోనియాగాంధీ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. తనకు పదవి కంటే దేశం సుభిక్షంగా ఉంటే చాలు అని తలచిన సోనియాగాంధీ ప్రధాని పదవిని త్యాగం చేశారు. వారి బెదిరింపులకు భయపడి ఆమె వెనకడుగు వేయలేదు. వారి విమర్శలను కూడా సానుకూలంగానే తీసుకున్నారు. 'వారు నన్ను విదేశీయురాలిగా చూస్తున్నారని నేనెప్పుడూ అలా భావించలేదని, ఒక భారతీయురాలిగా దేశాభివృద్ధి కోసం కృషి చేస్తాను..' అని ఎంతో సహనంతో పరిణతితో కూడిన సమాధానం ఇచ్చారు. దేశాభివృద్ధి కోసం అనుభవజ్ఞుడైన, నిజాయతీపరుడైన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు కృషి చేయడంతోపాటు ఆయనకు 10 సంవత్సరాలపాటు సంపూర్ణ మద్దతు అందజేశారు.

దేశ సమస్యలను పరిష్కరించేందుకు సోనియాగాంధీ నేతృత్వంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ 'నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్' అనేక సంస్కరణలపై అధ్యయనం చేసి, ఎన్.ఏ.సీ ద్వారా ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు, యూపీఏ ప్రభుత్వానికి అనేక సిఫార్సులు చేశారు. సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, విద్యాహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వంటి ప్రపంచంలోనే సంచలనమైన పథకాలను యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టడంలో సోనియాగాంధీ కృషి వెలకట్టలేనిది.

సోనియాగాంధీ దేశం కోసం పలు విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుంటుంటే ఓర్వలేని బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తే ఆమె ఎన్.ఏ.సీ చైర్మన్ పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసి, పదవులు తనకు తృణప్రాయమని మరోసారి నిరూపించారు. సోనియాగాంధీ యూపీఏ చైర్మన్‌గా ఉన్నప్పుడే చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారు. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడే దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, తొలి దళిత మహిళా లోక్‌సభ స్పీకర్‌గా మీరా కుమార్ ఎంపిక మహిళలకు ఆమె ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం. పదవిపై ఎలాంటి ఆశల్లేని సోనియాగాంధీ 2009 ఎన్నికల సమయంలో డాక్టర్ మన్మోహన్ సింగే మళ్లీ ప్రధానమంత్రిగా ఉంటారని ప్రకటించి రెండోసారి యూపీఏ అధికారం రావడానికి కృషి చేశారు.

తెలంగాణ రాష్ట్రంపై సోనియాకు ఉన్న ప్రేమ ప్రత్యేకమైంది. ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుండి జరిగిన అనేక ఉద్యమాలు, బలిదానాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేస్తామని 2004లో కరీంనగర్ వేదికగా సోనియాగాంధీ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2009 డిసెంబర్ 9న హోం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటింపజేశారు. అలా తెలంగాణ ప్రజల కలను నెరవేర్చడమే కాకుండా 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి ఆమె కృషి చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియాగాంధీ ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. తెలంగాణ ప్రజలకు ఆమె తల్లితో సమానం.

సెంటిమెంట్ పేరుతో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేయడంతో, తెలంగాణ కోసం కొట్లాడింది, ఇచ్చింది సోనియమ్మ నేతృత్వంలోని కాంగ్రెస్సే అని ప్రజలు విశ్వసించి తెలంగాణలో 2023లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు.

దేశంలోనే అత్యున్నతి పదవైన ప్రధానమంత్రి పదవిని మూడుసార్లు త్యాగం చేసి సుదీర్ఘకాలం పార్టీ అధ్యక్షురాలిగా సేవలందించిన చరిత్ర ప్రపంచంలోనే ఎక్కడా లేదు. 'కొన్ని రోజుల కింద నా తండ్రే నా హీరో అని చెప్పాను. ఇప్పుడు నాకు ఇంకో హీరో కూడా ఉన్నారు. అది మా అమ్మ. మా నాన్నమ్మ, మా నాన్న చనిపోయిన తర్వాత అమ్మ పోరాటం చూశాను. ఆ తర్వాత ప్రత్యర్థులపై చేసిన పోరాటాన్ని చూశాను..' అని 2004 విజయం తర్వాత రాహుల్‌గాంధీ మీడియాతో చెప్పిన మాటలు నాకింకా గుర్తే. నిజమే, రాహుల్‌గాంధీ మాట సత్యమే. ఎన్నో విషాదాలు, ఎన్నో విజయాలు, ఎన్నో అపజయాలు అంతకుమించి అత్యున్నత త్యాగాలను చేసిన సోనియాగాంధీ నిజజీవితంలో కూడా హీరోనే. ఇంతేకాకుండా సోనియాగాంధీ దేశం కోసం, ప్రజల కోసం చేసిన అనేక త్యాగాలను గమనిస్తే ఆమె జీవితం త్యాగాలకు చిరునామా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



■ బి.మహేశ్ కుమార్‌గౌడ్
టీపీసీసీ అధ్యక్షులు

(డిసెంబర్ 9: సోనియాగాంధీ పుట్టిన రోజు)

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో ఏడాదవుతోంది. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ప్రజాపాలన పేరుతో సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో దశాబ్దాల తరబడి కలగా మిగిలిన అభివృద్ధి పనుల్లో కదలిక మొదలైంది. తెలంగాణకు వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తూనే...అదే స్థాయిలో నిధుల కేటాయింపులు చేస్తోంది. దీంతో దీంతో 50ఏళ్లుగా ఎదురు చూస్తున్న మాస్టర్ ప్లాన్.. 30ఏళ్లుగా పడకేసిన భూగర్భ డ్రెయినేజీ పనులు, ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మాఢ వీధుల పనులు కార్యరూపం దాల్చాయి. కాళోజీ కళాక్షేత్రం సాక్షాత్కారమైంది. ఏడాది కాలంలో ఓరుగల్లు అభివృద్ధికి ఎన్నో అడుగులు పడ్డాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

కాంగ్రెస్ పాలనకు ఏడాది..

అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే పది చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. వరంగల్ తూర్పు, ములుగు నియోజకవర్గాల నుంచి గెలిచిన ఇద్దరు మహిళలు కొండా సురేఖ, సీతక్క రేవంత్ కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను సైతం కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా స్టేషన్‌ఘనపూర్ నుంచి విజయం సాధించిన కడియం శ్రీహరి సైతం హస్తం గూటికి చేరుకోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య 11కు చేరింది. రాజకీయంగా ఓరుగల్లులో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది కాలంలో పైచేయి సాధించింది.



ఏడాదిలో.. ఎన్నో అడుగులు!

- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- నేటితో కాంగ్రెస్ ప్రజాపాలనకు సంవత్సరం
- వరంగల్‌ను రెండో రాజధాని చేసేలా ప్రణాళిక
- నగరంలో అభివృద్ధి పనులకు రూ.4,962కోట్లు మంజూరు
- ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205కోట్లు.. వస్త్రనగరిపై ప్రత్యేక ఫోకస్
- భూపాలపల్లిలో మైలారం గుట్టల్లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు
- రూ.286కోట్లతో చిన్న కాళేశ్వరం పనులు ముమ్మరం
- 2026మార్చి నాటికి దేవాదుల పూర్తికి ప్రణాళిక
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు పనులకు మోక్షం

ఓరుగల్లు అభివృద్ధికి ప్రణాళికలు

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేలు హామీలు ఇస్తున్నారు. అదేస్థాయిలో నిధులు కూడా విడుదల చేస్తున్నారు. ఒక్క వరంగల్ నగరాభివృద్ధికే రూ.4,968 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వరంగల్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అనేక పనులను పూర్తి చేసి కాంగ్రెస్ ప్రభుత్వ మార్కును ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నారు. ప్రధానంగా 30ఏళ్లుగా ఎదురు చూస్తున్న భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 55ఏళ్ల అమలుకు నోచుకోని వరంగల్ మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించింది. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేని ప్రజాకవి కాళోజీ నారాయణరావు కళాక్షేత్రాన్ని రూ.95కోట్లతో పూర్తి చేసింది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 150కి.మీ నిబంధనపై జీఎంఆర్ సంస్థతో మాట్లాడి, ఆ నిబంధన సడలింపు తీసుకరావడమే కాకుండా, 263 ఎకరాల భూసేకరణ కోసం రూ.205కోట్లు విడుదల చేస్తు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అలాగే భూపాలపల్లిలో

మిగతా 8వ పేజీలో...

బాలికల పట్ల తల్లిదండ్రులకు అపోహ తొలగిపోవాలి

- అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ప్రారంభం



ఖిలావరంగల్‌లో ఇటీవల జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, డిసెంబర్ 6:(ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు బాలికల పట్ల ఉన్న అపోహలు పోవాలని, విద్యార్థులు ఆత్మరక్షణ కోసం మార్షల్స్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొందాలని అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికల కోసం ఆత్మరక్ష ప్రశిక్షన్, వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలికలకు రాణీ లక్ష్మిబాయి సెల్ఫ్ డిఫెన్స్ బాలికల ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బాలికలను తక్కువభావంతో చూడకుండా సరైన విద్యనందిస్తే భవిష్యత్తులో వారు ఉన్నతరంగాలలో రాణిస్తారన్నారు. విద్యార్థినులకు మార్షల్స్ ఆర్ట్స్‌లో తగిన శిక్షణనివ్వాలని అప్పుడే సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, దాడుల నుంచి రక్షించుకోవడానికి ఉపయోగపడుతాయన్నారు. కరాటే, కుంగ్‌ఫూ, జూడో తదితర శిక్షణల ద్వారా విద్యార్థినుల్లో శరీర దృఢత్వం, ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం, విశ్వాసం అలవడుతాయన్నారు. ఇదే విధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి శిక్షణను ఇప్పిస్తామన్నారు. విద్యార్థినులకు బయట ఎలాంటి ఇబ్బందులు కలిగినా.. తల్లిదండ్రులు, ఆ తర్వాత పాఠశాల ఉపాధ్యాయులకు, లేదా స్నేహ వలంటీర్లకు తెలిపి సహాయాన్ని తీసుకోవాలన్నారు. వరంగల్ జిల్లాలోని 20-25 ఎకరాల విశాలమైన స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బాలికల విద్యకోసం అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నామన్నారు. ప్రజాప్రభుత్వంలో పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు రెండుజతల దుస్తులు, పాఠ్య పుసకాలు, నోట్‌బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు.

కాగా, తెలంగాణ ప్రజాపాలనకు ఏడాది అయిన సందర్భంగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, తదితర పోటీలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలను మంత్రి సురేఖ, కలెక్టర్ సత్యశారదలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి , కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, 38వడివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, బెడిద వీరన్న, పోశాల సారంగపాణి, బి.రవిందర్, కాంగ్రెస్ నాయకులు నలిగంటి బెబ్బులి, బోయిన దూడయ్య, సంగరబోయిన చందర్ పాల్గొన్నారు.

భద్రత లేని బ్యాంకులే లక్ష్యంగా..

- రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు
- 2కిలోల 520 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- చోరీకి వినియోగించిన కారుతో పట్టుబడ్డ ముఠా సభ్యులు
- పరారీలో ప్రధాన నిందితుడితో పాటు మరో ముగ్గురు నిందితులు
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

8



చోరీకి గురైన బంగారు ఆభరణాలను చూపిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

అభివృద్ధిలో కాదు.. అప్పుల్లో రైజింగ్..

- వరంగల్‌కు సీఎం చేసిందేమీ లేదు..
- కొత్త మాస్టర్‌ప్లాన్ పేరుతో పాతది ఆవిష్కరణ
- బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



చార్జిషీటు విడుదల చేస్తున్న బీజేపీ నేతలు

హనుమకొండ టౌన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏదో అభివృద్ధి సాధించినట్లు 'తెలంగాణ రైజింగ్' అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణను అప్పుల్లో ముంచుతోందని, వాస్తవానికి తెలంగాణ రైజింగ్ కాదని, అప్పుల్లో రైజింగ్ అయిందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో చార్జిషీటు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావు పద్మ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ నిధులతో నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం చేసి, కాళోజీ క్షేత్రానికి తుదిమెరుగులు దిద్ది తామే నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లను పంచే దిక్కేలేదు కానీ.. ఇందిరమ్మ ఇళ్ల అంటూ ప్రజలకు ఆశలు రేపుతున్నారన్నారు. హైదరాబాద్, కొడంగల్‌లో పరిశ్రమల స్థాపనకు ఎంవోయూ చేసుకుంటున్న రేవంత్‌రెడ్డి.. వరంగల్ అభివృద్ధిని విస్మరించారన్నారు. విజన్ - 2051 పేరుతో 10 ఏళ్ల కిందటే రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ఇప్పుడు ఆవిష్కరించి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు.

బీజేపీ పరకాల ఇన్‌చార్జి డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యం, విద్యను కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కేఎంసీ అనాటమీ విభాగంలో వైద్య విద్యార్థులకు తరగతులు చెప్పడానికి ఒక్క అధ్యాపకుడు లేడన్నారు. ఎంజీఎంలో వైద్యులు కరువయ్యారని, రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు భరించలేక సూపరింటెండెంట్ వెళ్లిపోయాడన్నారు. కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై గత, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయన్నారు. రూ.33కోట్లతో నిర్మించతలపెట్టిన మెంటల్ ఆస్పత్రి కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.12 కోట్లు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను ఆలస్యం చేస్తోందన్నారు. రూ.120కోట్లతో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే అవినీతికి మారుపేరన్నారు. సుమారు రూ.1300కోట్లతో మెగా టెక్స్‌టైల్ నిర్మిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఉద్యోగం కల్పించలేదని ఆరోపించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై ఇటీవల ఒక జీవో తీసుకొచ్చారని, ఆపై ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. హంటర్‌రోడ్డు నుంచి హనుమకొండ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం నాలుగేళ్ల నుంచి అలాగే ఉందన్నారు. రోడ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే.. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పంచుకుని రోడ్ల నిర్మాణం చేయడం లేదని ఆరోపించారు. మంత్రులు కమీషన్ల కోసమే పనిచేస్తున్నారని, ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నప్పటికీ మాటలకే పరిమితమవుతున్నారని, నిధులు తీసుకరావడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, ఆర్‌పీ జయంత్‌లాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 6: (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ నెల 7న శనివారం సందర్శించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పర్యటన నేపథ్యంలో శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించి పార్కు పరిసరాల్లో ఉన్న ఐటీ కంపెనీలలలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కు నిర్మాణంలో భూమి కోల్పోయిన 863 మంది రైతులకు లక్కీడ్రా ద్వారా ప్లాట్‌నెంబర్లు కేటాయిస్తారన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఏవో అనురాధ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, ఇండస్ట్రీస్ జీఎం సాల్మన్‌రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గొప్ప రాజనీతిజ్ఞుడు

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాలు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మార్పీఎస్ నేత మంద కుమార్ మాదిగ

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజనీతిజ్ఞుడు, దార్శనీకుడు, ప్రపంచ మేధావి అని మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు కొనియాడారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహనీయుల జయంతి ఉత్సవాల చైర్మన్ పుట్ట రవి అధ్యక్షతన నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ చూపిన మార్గంలో సమాజంలోని ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. భారత దేశంతోపాటు ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను బహుముఖ ప్రజ్ఞాశాలిగా కొనియాడుతున్నారని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయడంతో ఆయన పేరు ప్రఖ్యాతులు ప్రపంచదేశాల్లో ఇమిడి ఉన్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, స్వేరోస్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పుల్ల కిషన్, జిల్లా అధ్యక్షుడు శనిగరపు రమేష్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్, అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎనుంట్ల రవీందర్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, బీఆర్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బొమ్మల్ల అంబేద్కర్, ప్రజా సంఘాల నాయకులు రౌతు రమేష్, సింగారపు రవిప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో దేశమంతా బుల్డోజర్ పాలన

- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య
- వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ (ఎంఎల్) జనసభ



జన సభలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

పోచమ్మమైదాన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వంలో దేశమంతా బుల్డోజర్ పాలన నడుస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. వరంగల్ మహానగరంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో అజంజాహీ మిల్లు మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జనసభకు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆరోపించారు. దేశమంతా బుల్డోజర్ పాలన నడుస్తోందని, ప్రజాసమస్యలు పక్కదారి పడుతున్నాయని అన్నారు. దేశ లౌకిక స్ఫూర్తిని, ప్రజా సంపదని కాపాడుకోవాలని, రాజ్యాంగ విలువలు పక్కదారి పట్టకుండా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం చేపట్టిందని తెలిపారు. సీపీఐ (ఎంఎల్) సంకల్పాన్ని విజయవంతం చేసి దేశాన్ని ఫాసిస్టు శక్తుల పాలన నుంచి విడిపించేవరకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రొయ్యల రాజు, శ్రీనివాస్, గుమ్మడిరాజుల సాంబయ్య, గోల్కొండ కుమార్, మారేపల్లి మల్లేష్, రజిత, ఖాజామొహినుద్దీన్, వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న 'జనరల్' కష్టాలు

- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

8

శరవణ భవ.. శరవణ భవ ..

- నేడు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాలు
- వేడుకలకు ముస్తాబైన ఊకల్ దేవాలయం
- పలుచోట్ల అభిషేకాలు, కల్యాణాలు, అన్నదానాలకు ఏర్పాట్లు

'భద్రకాళి' మట్టిపై.. అక్రమార్కుల కన్ను!



చెరువులో మట్టితవ్వకాలు జరిగిన ఆనవాళ్లు

- చుట్టూ తవ్వకాలు జరుపుతున్న ఆనవాళ్లు
- రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు తరలింపు?
- మట్టి కోసమేనా..? ఇతర వాటిపై ఆశతో చేస్తున్నారా? అని అనుమానాలు
- నీటిని వదిలి చెరువు రక్షణను మరిచిన అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సుందరీకరణ కోసమని వందల ఏళ్ల నాటి భద్రకాళి చెరువులోని నీటిని పూర్తిగా ఖాళీ చేయడంతో.. అక్రమార్కుల కన్ను అందులోని పూడికమట్టిపై పడిందన్న చర్చ జరుగుతోంది. సుందరీకరణ పనులకు ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం, అన్ని చెరువుల తరహాలోనే భద్రకాళి చెరువును కూడా చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చారిత్రాత్మకమైన భద్రకాళి అమ్మవారి ఆలయం ముంగిట ఉన్న కాకతీయుల నాటి చెరువు కావటంతో మట్టి పూడిక తీత సందర్భంగా పురాతన విగ్రహాలు లేదా చరిత్ర ఆధారితమైన వస్తువులు బయట పడే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే నీటిని ఖాళీ చేయడంతో కొందరు చూపు ఆమట్టిపై పడిందని, ఈ నేపథ్యంలోనే రాత్రి సమయంలో చెరువు చుట్టూ అక్రమార్కులు మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, ఇక మట్టిని తరలించే వాహనాలు వచ్చి పోయేందుకు వీలుగా కట్టను ఆనుకుని ఓ తాత్కాలిక రోడ్డును కూడా వేసిన ఆనవాళ్లు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది.



2018లో బండ్ పనుల కోసం సిద్దులగుట్ట వద్ద జరిగిన తవ్వకాల్లో బయటపడిన వినాయకుడి విగ్రహం

తవ్వకాలు మట్టికోసమేనా?

భద్రకాళి చెరువును సుందరీకరించేందుకు అధికారులు చెరువులో ఉన్న సుమారు 130 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని బయటకు వదిలేశారు. ఆ తర్వాత అధికారులు చేతులు దులుపుకోగా, తమకేమీ సంబంధం లేదన్నట్టుగా పురావాస్తుశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కనీసం చెరువుకు భద్రత కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోకపోవటంతో అక్రమార్కుల కన్ను చెరువుపై పడిందన్న చర్చ జరుగుతోంది. చెరువులో మట్టిని తరలించేందుకు తాత్కాలిక

మిగతా 6వ పేజీలో...



డుండి అశోక్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్ ఖాసీం

అశోక్ కుమార్‌కు డాక్టరేట్

హనుమకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని గీసుకొండ ప్రభుత్వ మోడల్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న దుండి అశోక్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ డిపార్టుమెంట్ దళిత సాహిత్యంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. 'నరేటివ్స్ ఆఫ్ రెసిస్టెన్స్‌ఏ స్టడీ ఆఫ్ ఐడియాలజీ అండ్ సోషల్ క్రిటిసిం ఇన్ ద సెలక్ట్ షార్ట్ స్టోరీస్ ఆఫ్ గోగు శ్యామల అండ్ జూపాక సుభద్ర' అనే పరిశోధనా గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధన ప్రొఫెసర్ బి.అశోక్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఇంతకు ముందు 2013లో దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన ఇఫ్లూ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో అశోక్ రాసిన సిద్ధాంత గ్రంధానికి మాస్టర్ ఆఫ్ పీలాసఫీని అవార్డు చేసింది. అశోక్ ఈ విషయంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ బయ్యా సునీత దళిత మహిళా రచయితల మీద పరిశోధన చేయడం ప్రశంసనీయం అని అభినందించారు.

10 మంది డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెగ్యులర్ 1,3, 5 సెమిస్టర్ పరీక్షలలో శుక్రవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని పలు పరీక్షల కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 10 మంది విద్యార్థులను తనిఖీల బృందాలు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి తెలిపారు. డీబారైన వారిలో ఖమ్మంలో 8, వరంగల్‌లో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2416	2080
పల్లికాయ (సూక)	5600	4000
పల్లికాయ (పచ్చిది)	-	-
కందులు	-	-
పెసళ్లు	-	-
పత్తి	6950	5800
పసుపు (కాడి)	11159	11000
పసుపు (గోల)	10868	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15021	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	13500	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి

● అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ● జనగామలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అలాగే రాజకీయాలకు తావు లేకుండా ఆలయాను అభివృద్ధి చేయనున్నట్లు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఆలస్యమయ్యేదని, అలా జరగొద్దని కలెక్టర్‌కు సూచించారు. కొమురవెల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి సురేఖను కోరగా ఆమె స్పందించారు. దేవాలయాల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వబోమన్నారు. ఏదైనా రెండు దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పంపితే, తప్పకుండా సహకరిస్తానని ఆమె ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

పల్లా కాంగ్రెస్‌లోకి రారు..

'పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిఖార్సైన బీఆర్ఎస్ నాయకుడు. ఆయన కాంగ్రెస్‌లోకి రారు. ఆయన అజాత శత్రువు. ఆయన వ్యక్తిత్వం నాకు తెలుసు' అంటూ మంత్రి సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓడిపోవడంతో నియోజకవర్గంలో మొదట్లో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి విషయంలో ఇలాంటి పరిస్థితులు సరికావని కొమ్మూరిని సముదాయించినట్టు ఆమె వివరించారు. పార్టీల మధ్య విబేధాలతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో అభివృద్ధి విషయంలో కలిసి మెలిసి పనిచేయాలనే నిర్ణయానికి వచ్చామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ మినహా మరెక్కడా తమకు ఇబ్బందికర పరిస్థితులు లేవన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి రావడం వల్ల స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇబ్బందికర పరిస్థితులు లేవన్నారు. అయితే గతంలో కొమురవెల్లి దేవస్థాన అభివృద్ధిపై జరిగిన సమీక్షలో కొండా సురేఖ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వావాదం జరగ్గా అప్పట్లో అది చర్చనీయాంశమైంది. కాగా.. తాజాగా ఎమ్మెల్యే పల్లాను పొగుడుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో ఆసక్తిని రేపాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనగామ మండలం యశ్వంతాపూర్ శివారులో నిర్మించనున్న తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీవో) జనగామ జిల్లా కార్యాలయ భవనానికి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు.

సాహితీ సభల కరపత్ర ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల సంఘం పదేళ్ల సాహితీ సభలకు సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి స్వగృహంలో జరిగింది. ఈనెల8న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే ఈ సభలో ప్రారంభ సమావేశంలో అతిథులుగా పరాంకుశ వేణుగోపాలస్వామి, డాక్టర్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఆచార్య సూర్య దనుంజయ్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ మామిడి హరిక్రిష్ణ, నాళేశ్వరం శంకరం, పొట్లపల్లి శ్రీనివాసరావు పాల్గొంటారు. మధ్యాహ్నం సదస్సులో తెలంగాణ అస్తిత్వ సాహిత్యం- వర్తమాన సందర్భం అనే అంశంపై ఆచార్య ఖాసీం, కొల్లాపూర్ విమల, బాణాల భుజంగ రెడ్డి మాట్లాడతారు. అనంతరం కవి బిల్ల మహేందర్ నిర్వహణలో ఇల్లు, పచ్చబొట్టు కవిత సంపుటాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం గంద్ర లక్ష్మణరావు అధ్యక్షతన కవి సమ్మేళనం జరుగుతుంది. కనుక ఈ సభకు వరంగల్ నుంచి కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెరసం అధ్యక్ష, కార్యదర్శులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్ పిలుపునిచ్చారు. కరపత్ర ఆవిష్కరణలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, వీఆర్ విద్యార్థి, శనిగరం రాజమోహన్, అస్నాల శ్రీనివాస్, రత్నమాల, అరుణకీర్తి పతాక తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్ తదితరులు



కంట్రోలర్ రాజేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న స్కాలర్లు

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్ బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో ఇప్పటివరకు పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ ఎస్.నాగరాజు, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి, ఏఆర్ శ్రీలతాదేవి, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ శ్యాంకుమార్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, జేఏసీ కేయూ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఎస్ఎఫ్ వర్సిటీ ఇన్‌చార్జి డాక్టర్ ఒడ్డెపల్లి మధు, ఎన్ఎస్‌యూఐ నేత మహ్మద్ పాషా, ఎమ్మార్పీఎస్ నేత మంద భాస్కర్, మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ వంగా మల్లేశ్, తాళ్లపల్లి నరేశ్, తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

'భద్రకాళి' మట్టిపై.. అక్రమార్కుల కన్ను!

5వ పేజీ తరువాయి

రోడ్డును వేస్తున్నారు. అయితే మ్యూజికల్ గార్డెన్ వైపు రాత్రిళ్లు చెరువులో తవ్వకాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. చెరువు కట్టలకు దగ్గరగా తవ్వకాలు చేస్తుండటంతో మట్టి కోసమేనా లేక ఇతర వాటిపై ఆశపడి తవ్వుతున్నారా అనే చర్చ జరుగుతోంది. మ్యూజికల్ గార్డెన్‌కు వెనుక వైపు నుంచి చెరువులోకి దారి చేసి మరీ మట్టి తవ్వకాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

చెరువుకు రక్షణ కల్పించలేరా..?

భద్రకాళి చెరువు 382 ఎకరాలకు పైగా విస్తరించి ఉండటంతో ఎక్కడెక్కడ తవ్వకాలు జరుగుతున్నాయో అర్థం కానిప పరిస్థితి. చెరువు పూడికలో అనేక దేవతమూర్తుల విగ్రహాలు ఉండి ఉంటాయనే చర్చ జరుగుతోంది. 2018 మే 4వ తేదీన భద్రకాళి బండ్ సుందరీకరణ పనుల సందర్భంగా 1,300ఏళ్ల నాటి గణపతి పోలిన విగ్రహంతో పాటు శివలింగం, మరికొన్ని శిల్పాలు లభ్యమయ్యాయి. ఇవి కాకతీయుల కాలం నాటికంటే పూర్వానివిగా గుర్తించారు. ప్రస్తుతం చెరువు మొత్తం పూడికతీస్తుండటంతో ఇలాంటి విగ్రహాలు, ఇతర చరిత్ర ఆనవాళ్లు బయటపడే అవకాశాలున్నాయనే చర్చ ఉంది. ఇలాంటి సమయంలో ఇష్టారీతిన ఎవరికి వారే చెరువులో మట్టి తవ్వకాలు చేస్తుంటే ఇరిగేషన్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌లు భద్రకాళి చెరువులో తవ్వకాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని, అధికారికంగా తవ్వకాలు జరిగే వరకు చెరువుకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల బంద్



అంబేద్కర్ సర్కిల్‌లో ఆటోల బంద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తాము ఉపాధి కోల్పోయామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆటోల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆటో డ్రైవర్ల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఇసంపెల్లి సంజీవ తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్ ప్రాంతంలోని ఆటో డ్రైవర్స్ అడ్డా వద్ద ఆటోల బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవ మాట్లాడుతూ.. ఈ ఆటోల బంద్‌లో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని తమ డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల జేఏసీ ఉమ్మడి జిల్లా నేతలు మడికొండ బాబు, కలకోట్ల జయరాం, మామిడాల వెంకటేశ్వర్లు, గుండా రమేష్, హరిశ్చంద్రునాయక్, చీకటి కుమార్, ప్రభాకర్, పసునూరి బాబు, రవీందర్, రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి హిస్టరీ విభాగంలో మూడు రోజుల సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో డిసెంబర్ 7,8,9 తేదీల్లో మూడురోజుల పాటు ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ సోషల్ సైన్స్ విభాగాల డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 7న కేయూ సెనెట్ హాల్‌లో జరిగే ప్రారంభ సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరిస్తారని, మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.స్వామినాథన్, కలకత్తా యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, యన్సియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్, విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సుస్మిత బసు మజుందార్, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అతిథులుగా హాజరై మాట్లాడుతారని వెల్లడించారు.

సెల్‌ఫోన్ పరిచయమే ప్రాణాల మీదికి తెచ్చిందా?

● కొలిక్కి వస్తున్న రిటైర్డు బ్యాంకు మేనేజర్ రాజమోహన్ హత్య ● మంగపేట వాసిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మట్టెవాడ, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): దొరికిన సెల్‌ఫోన్‌తో ఏర్పడిన పరిచయం కాస్తా పెరిగి.. బ్యాంకు రిటైర్డు మేనేజర్ హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. రిటైర్డు మేనేజర్ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, డబ్బుల కోసం రాజమోహన్‌ను నిందితుడు హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ కోణంలోనే దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు కొన్ని బలమైన ఆధారాలు లభించినట్లు సమాచారం.

కొన్ని నెలల కిందట రిటైర్డు బ్యాంకు మేనేజర్ రాజమోహన్ బంధువుకు చెందిన సెల్‌ఫోన్ పోయింది. ఈ సెల్‌ఫోన్ ములుగు జిల్లా మంగపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి దొరికింది. అయితే ఆఫోన్‌లో ఉన్న రాజమోహన్ సెల్ నెంబరుకు నిందితుడు ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. ఇలా మొదలైన పరిచయం.. చాలా రోజుల పాటు సాగింది. కొన్ని రోజులకు రాజమోహన్‌కు మంగపేట వాసి పెళ్లి సంబంధాలు చూస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో తరచుగా ఆ వ్యక్తి రాజమోహన్‌తో కలిసి తిరిగేవాడని సమాచారం. ఈ క్రమంలో రిటైర్డు బ్యాంకు మేనేజర్‌ను మంగపేట నివాసియైన వ్యక్తి ఇటీవల డబ్బులు కావాలని అడిగారని, అయితే రాజమోహన్ డబ్బులు ఇవ్వకుండా దాటవేశారని తెలిసింది. రాజమోహన్ 7,8 తులాల బంగారం ధరించేవాడని తెలిసింది. రాజమోహన్ అప్పుగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ వ్యక్తి రాజమోహన్ శరీరంపై ఉన్న బంగారంపై కన్నేసినట్లు పోలీసులు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మంగపేట ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి రాజమోహన్ ఇద్దరూ కలిసి హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో మద్యం సేవించినట్లు సమాచారం. అదే అదునుగా భావించిన వ్యక్తి రాజమోహన్‌పై రోకలిబండతో దాడి చేసి బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఆ వ్యక్తి రాజమోహన్‌ను పథకం ప్రకారమే రప్పించి మద్యం మత్తులో హత్య చేసినట్లు సమాచారం. అయితే మృతదేహాన్ని రాత్రి సమయంలో భద్రకాళి చెరువులో పడేయాలని చూసిన నిందితుడు.. అందులో నీరు లేకపోవడంతో ప్లాన్ మార్చుకున్నాడు. ఆపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగంపేటలో కారుతో పాటు రాజమోహన్ మృతదేహాన్ని వదిలి వెళ్లినట్లు పోలీసులకు కీలక ఆధారం లభించినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసులు ఆ కోణంలోనే విచారణ చేస్తున్నారు. హత్య చేసింది ఒక వ్యక్తా.. మరికొందరి సహాయం తీసుకున్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కత్తితో, రాయితో హత్య చేసి బంగారు ఆభరణాలను అపహరించినట్లు తెలుస్తోంది. ఈ హత్య కేసులో ఒక అనుమానిత వ్యక్తిని మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



జిల్లా మహిళా క్రీడాకారిణుల జట్టుతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

కబడ్డీలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలి..

కరీమాబాద్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వరంగల్ జిల్లా మహిళా కబడ్డీ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుర్తింపు తేవాలని వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాంరెడ్డి కోరారు. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవండరు 23న వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికైన మహిళా క్రీడాకారిణులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అక్తర్ ఆధ్వర్యంలో 10రోజుల పాటు కరీమాబాద్ రామస్వామి దేవాలయం మైదానంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాంరెడ్డి జిల్లా జట్టుతో మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని కోరారు. కాగా, 7,8,9,10వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా కబడ్డి అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, ట్రెజరర్ ముఖర్జీ, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్‌లు గోగు నారాయణ, షాబీర్ అలీ, డాక్టర్ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, హసన్, సీనియర్ కబడ్డీ ప్లేయర్ శ్రీకాంత్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..



రూబియాను అభినందిస్తున్న మైనారిటీ గురుకుల కళాశాల సిబ్బంది

శంభునిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని రాణించాలని వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ టి. రమేష్ అన్నారు. నగరంలోని శంభునిపేటలో గల మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ (ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుమియా జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి వేయిట్ లిఫ్టింగ్ పోటీలలో రుబియా బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబరు 9నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో రూమియా అండర్-19 లో 59 కిలోల విభాగంలో పాల్గొనేందుకు శుక్రవారం రూమియా వరంగల్ నుండి న్యూఢిల్లీకి బయలుదేరింది. ఈ సందర్భంగా కళాశాలలో రుమియాకు అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ టి. రమేష్, ఆర్ఎల్‌సీ శ్రీనివాస్‌లతో పాటు ప్రిన్సిపల్ తాళ్ళ నీలిమాదేవి, పీడీ జ్యోతి, అధ్యాపకులు రూమియాను ఘనంగా సత్కరించారు. కళాశాల నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం జిల్లాకే గర్వకారణమని జాతీయ స్థాయి పోటీల్లో రాణించి కళాశాలకు, వరంగల్ ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని అధికారులు, కళాశాల సిబ్బంది ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక



కల్పనాదేవిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

శంభునిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కల్పనాదేవి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కల్పనాదేవి ఇటీవలే జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించింది. కల్పనాదేవి ప్రతిభను గుర్తించి జిల్లా కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల పీఈటీ గోగు నారాయణ తెలిపారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో కల్పనాదేవి వరంగల్ జిల్లా జట్టు తరపున పాల్గొననుంది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి కల్పనాదేవితో పాటు కోచ్, పీఈటీ గోగు నారాయణను హెచ్‌ఎం వి.రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కరీమాబాద్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని పెరుకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 68వ పాఠశాల క్రీడా సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల విభాగంలో డిసెంబర్ 2న నిర్వహించిన సాఫ్ట్‌బాల్ సెలక్షన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పల్లపు కీర్తన, మాదాసు సుకుమార్‌లు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కాగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 7,8,9 మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సృజన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పాఠశాల అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, అభినందించారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్ వర్క్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాలో ఘనంగా నివాళులర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కీర్తించారు. ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

కేయూ దూరవిద్య కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు. కేయూలో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేయూలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ నగర పాలక సంస్థ ఆవరణలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. బల్దియా జేఏసీ నాయకులు ముందుగా బల్దియా ప్లే గ్రౌండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశాయిపేటలోని రుద్రమాంబ ఫిల్టర్‌బెడ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపెల్లిలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పైడిపెల్లిలో జన్ను పెద్దపులికొమ్మయ్య స్మారకార్థం శుక్రవారం వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించి చిత్రపటానికి నివాళులు అర్పించారు. 42వ డివిజన్‌లో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొని కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడారు.

అంబేద్కర్ ఆశయాలను నేటి యువత కొనసాగించాలని మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ సత్యశారదలు అన్నారు. ఖిలావరంగల్ చెమన్‌వద్ద గల అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాశిబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల, వివిధ సంఘాల నేతలు వేర్వేరుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నాయకులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, తదితరులు నివాళులర్పించారు. 36వ డివిజన్ చింతల్ ఎస్సీకాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాజీపేట ఎఫ్‌సీఐలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాపూజీనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్ పాల్గొన్నారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ, క్రూలాబీల్లో జరిగిన వేడుకల్లో స్టేషన్ మేనేజర్ అగ్గిరవీందర్, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక రావు, కుర్సపల్లి రవీందర్‌లు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, బోడగుట్టలో కాంగ్రెస్ నాయకులు సందెల విజయ్ పాల్గొన్నారు. డీజిల్‌కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాపూజీనగర్ పోచమ్మగుడి వద్ద జరిగిన కార్యక్రమంలో మాలకుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో రాజకీయ పార్టీలు, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మడికొండలో అంబేద్కర్ విగ్రహానికి ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పూల మాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. 45వ డివిజన్ కడిపికొండలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. న్యూశాయంపేట 31వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.31వ డివిజన్‌లోని సూర్జిత్‌నగర్‌లో సీపీఎం జిల్లా నాయకులు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.


అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని


ఖిలావరంగల్ నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ


బల్దియాలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జాక్‌నేతలు


కేయూలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, రామచంద్రం

మున్నూరుకాపు మహిళా భవనాన్ని ప్రారంభించిన మంత్రి

ఖిలావరంగల్, డిసెంబర్ 6:(ఆంధ్రజ్యోతి) 38వ డివిజన్ ఖిలావరంగల్ కాపువాడలో మున్నూరుకాపు మహిళా భవనాన్ని శుక్రవారం అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి రూ.కోటి 23లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ సాధారణ నిధులు 50లక్షలతోపాటు ప్రస్తుతం రూ.23లక్షల వ్యయంతో మొదటి అంతస్తు భవనం నిర్మిస్తున్నామన్నారు. డివిజన్‌లో సీసీరోడ్డు, సీసీ డ్రైయినేజీ, కమ్యూనిటీ భవనాలు పలు అభివృద్ధి కోసం నిధులను కేటాయించామన్నారు. ఖిలావరంగల్‌లోని మహిళా సమాఖ్య గ్రూపుల తో పాటు, వెనకబడిన ప్రాంతానికి చెందిన అన్నివర్గాలకు ప్రజలు వివిధ ఫంక్షన్‌లను జరుపుకోవచ్చన్నారు. అలాగే ఈ స్థలాన్ని గజ్జెల రాంనాథం కుమారులు రామకృష్ణ, రమేష్‌లు తమ సొంత భూమిని మహిళా భవనం కోసం భూమిని ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కార్పొరేటర్ బైరబోయిన ఉమా- దామోదర్ యాదవ్, నాయకులు గజ్జెల శ్యామ్, సాగర్ల శ్రీనివాస్, ఇను ముల మల్లేశం, మీసాల ప్రకాశ్, సులుగం గోపాల్, పసునూటి వేణు, బైరబోయిన రవీందర్, పోశాల సారంగపాణి, ఎనుకంటి నర్సిం గం, భరత్, రావుల రాజేష్, జారతి పద్మ, లక్ష్మి, రజిత, సువర్ణ, స్వరూప, నగరపాలక సంస్థ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.


మున్నూరుకాపు మహిళా భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

ప్రజల కోసమే ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ పరిధిలోని వడ్డెపల్లిలో రూ.6.43కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నగర అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అన్ని డివిజన్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి వరంగల్‌ను ఒక రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎనుకొంటి నాగరాజు, కేశబోయిన అరుణ శ్రవణ్‌కుమార్, 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు తాళ్లపెల్లి విజయ్, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్, జనగాం కుమారస్వామి, ఎండి అక్మల్, ఎండి ఆరీఫ్, బుస్స నవీన్, బోడ ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి

- ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయించాలని వడ్డెపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కేశబోయిన శ్రవణ్‌కుమార్, కోశాధికారి మట్టెపల్లి చంద్రశేఖర్, కార్యదర్శులు కేశబోయిన కోటేశ్వర్ తదితరులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని వడ్డెపల్లిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టిన మేరకు బిల్లు మంజూరి చేయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘం నేతలు మట్టెపల్లి రాంరాజ్, రోకుల సతీష్, మట్టెపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

భగవద్గీతను ప్రతీ ఒక్కరు పఠించాలి

వరంగల్ కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భగవద్గీతను ప్రతీ ఒక్కరు పఠించాలని టీటీడీ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వరంగల్ పిన్నవారి వీధిలోని శారద ఉన్నత పాఠశాలలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య ప్రముఖులు గట్టు మహేష్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు భగవద్గీతను చదవాలని కోరారు. శ్లోక కంఠస్థ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి, వంగల సోమయాజులు, తెన్నేటి వసుంధర, మురళి మనోహర్, వేణుగోపాలస్వామి, వన భూలక్ష్మి, విజయ్, శారద ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గుమ్మడవెల్లి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మార్కెటింగ్ నైపుణ్యాలను సాధించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు మార్కెటింగ్ నైపుణ్యాలను సాధించాలని ఖమ్మంకు చెందిన ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్, సైకాలజిస్టు, వర్సిటీ క్యాంపస్ కామర్స్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ అడిగ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఎంప్లాయింగ్ టూమరోస్ లీడర్స్- ఏ మోటివేషనల్ వర్క్‌షాప్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిగ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. చిన్ననాటి నుంచే విద్యార్థులతో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. 21వ శతాబ్దపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని సూచించారు. చదువులతోపాటు స్కిల్స్ అవసరమని వివరించారు. ఈ సందర్భంగా అడిగ శ్రీనివాస్‌ను వర్సిటీ కామర్స్ విభాగం ప్రిన్సిపాల్ పి.అమరవేణి నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, శ్రీరామోజు నరసింహచారి, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ బి.ప్రగతి స్కాలర్లు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

బంద్‌కు డ్రైవర్లు సహకరించాలి

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంజీఎం హాస్పిటల్ ఆవరణలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నారపు రమేశ్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేలు చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున ఆటోడ్రైవర్లకు రూ.10లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతిన్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో జిల్లాలోని ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండె బద్రి, అధ్యక్షులు అక్బర్, మహబూబ్‌పాషా, అంజాద్, లతిఫ్, రంజిత్, రత్నాకర్, అశోక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి శారదాపీఠం దేవాలయం పునః నిర్మాణం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకర మఠం వరంగల్ శాఖ ఆధ్వర్యంలో నూతన శంకరమఠం దేవాలయం పునఃనిర్మాణం వరంగల్ చరిత్రలో నిలిచిపోతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంజీఎం సెంటర్‌లోని ఆటోనగర్ శ్రీనివాస కాలనీలో శృంగేరి శంకర మఠం పునః నిర్మాణం శిలన్యాస పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శారదా పీఠం ప్రధానార్చకుడు సంగమేశ్వర జోషి పర్యవేక్షణలో శృంగేరి రుత్వికులు వేద మంత్రాలతో శిలన్యాస పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు రవీందర్‌రావు పాల్గొన్నారు. పూజ అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆలయానికి సంబంధించిన వివరాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సురేందర్, శంకర సేవా సమితి సభ్యులు రామారావు, దేవేందర్, కుమారస్వామి, రవీందర్, వెంకటేశ్వర్‌రావు, భూపాల్, రాజేంద్రప్రసాద్, కల్యాణి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పూరి గుట్టలోని బస్తీ దవాఖాన, జీఎంహెచ్‌లో వెల్‌నెస్ సెంటర్లను హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య శుక్రవారం తనిఖీ చేశారు. పూరి గుట్టలలోని బస్తీ దవాఖానాలో ప్రజలకందుతున్న సేవలను పరిశీలించి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. మందుల కొరత లేకుండా చూడాలని, ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన కల్పించాలని సూచించారు. సాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించి వృద్ధులతో మాట్లాడారు. హనుమకొండ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఎంప్లాయీస్ అండ్ జర్నలిస్టు వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి ఓపీలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫార్మసీలో ఉన్న మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కుటుంబ సభ్యులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సేవలు అందించాలని సూచించారు.

పరిశీలకుల విధుల కేటాయింపు

కాశిబుగ్గ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల నేపథ్యంలో క్రీడల పరిశీలకుల విధుల కేటాయింపు పూర్తి చేసినట్లు జిల్లా యువజన క్రీడా అధికారిణి సత్యవాణి తెలిపారు. పోటీల సందర్భంగా శుక్రవారం ఓ సిటీలోని స్టేడియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో గ్రామ స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో మండల స్థాయిలో జరిగే పోటీలకు అబ్జర్వర్స్‌ను నియమించామని తెలిపారు. వీరు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో కోచ్ అనిల్‌కుమార్, క్రికెట్ కోచ్ సుమన్, జూడో కోచ్‌లు లింగమూర్తి, కుమార్, సిబ్బంది మౌనిక, రాజేందర్, అహ్మద్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న డీవైఎస్‌వో సత్యవాణి తదితరులు

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

వరంగల్‌సిటీ, డిసెంబరు7: (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 14వ డివిజన్‌కు సంబంధించిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేసి ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ శుక్రవారం చలో హైదరాబాద్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో 14వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కేతిరి రాజశేఖర్, పస్తం యాదగిరి, పస్తం నర్సింగం, పత్రి పాపాలు, పసులాది మల్లయ్య, సౌరం కల్యాణ్‌లను ఏనుమాముల ఎస్ఐలు శ్రీకాంత్, రాజులు శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అదే రోజు సాయంత్రం విడుదల చేశారు.

నేడు పశ్చిమ నియోజకవర్గ విజయోత్సవ సభ

హనుమకొండ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విజయోత్సవ సభ శనివారం జరుగనుంది. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదురుగా గల ఆడిటోరియం ప్రాంగణంలో సభను నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన సభ జరగనుంది. సాయంత్రం 5.30 గంటలకు సభ ప్రారంభమవుతుంది. శుక్రవారం రాత్రి వరకు సభ నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. సభ ప్రాంగణంలో ముఖ్య నేతలతో నిర్వహణ అంశాలను సమీక్షించారు.

డ్రోన్లను సురక్షితంగా ఆపరేట్ చేయడానికి శిక్షణ

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ జనరల్ సివిల్ ఆఫ్ ఎవియేషన్ (డీజీసీఏ) నిబంధనలకు అనుగుణంగా ఉండేలా, డ్రోన్లను సురక్షితంగా, సమర్థంగా ఆపరేట్ చేయడానికి అవసరమైన శిక్షణతో పాటు నైపుణ్యాలను అందించనున్నట్లు మారుత్ డ్రోన్స్ అకాడమీ సీఈవో చింతల సాయికుమార్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ సమీప ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు అకాడమీ ఆధ్వర్యంలో రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ కోర్సు, డ్రోన్ రిపేర్, మెయింటనెన్స్ కోర్సు, అగ్రి స్పెషలైజేషన్ కోర్సుతో సహా అనేక రకాల డీజీసీఏ ఆమోదిత డ్రోన్ శిక్షణ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. మారుతి డ్రోన్ అకాడమీ అత్యాధునిక సౌకర్యాలతో అనుభవజ్ఞులైన శిక్షకులతో, నాణ్యమైన విద్యను నిబద్ధతతో అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కస్తూర్ డ్రోన్స్‌వ్యవస్థాపకులు అండ్ డైరెక్టర్లు కాట్రగడ్డ శిరీష, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు. వివరాలకు సెల్ నంబర్ : 99120 00365 లో సంప్రదించాలని సాయికుమార్ కోరారు.

గుర్తింపు ఎన్నికల్లో 90.6 శాతం పోలింగ్

కాజీపేట, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) కాజీపేటలో బుధవారం ప్రారంభమైన రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు శుక్రవారం మూడో రోజుతో ముగిశాయి. మూడోరోజు రైల్వే గార్డులు, లోకో పైలెట్‌లకు మాత్రమే ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. కాజీపేటలో మొత్తం 3474 ఓట్లకు గాను 3148 ఓట్లు పోలింగ్ కాగా 90.6 పోలింగ్ జరిగినట్లు రైల్వే ఎన్నికల అధికారులు తెలిపారు. బ్యాలెట్ బాక్సులను ప్రత్యేక వాహనం ద్వారా సికింద్రాబాద్ తరలించారు ఈ నెల 12న సికింద్రాబాద్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందని రైల్వే కార్మిక నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని అనంతసాగర్, ముచ్చర్ల గ్రామాలలో డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నియోజకవర్గ కోఆర్డినేటర్ లకావత్ ధన్వంతితో కలిసి ఎమ్మెల్యే వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన లోనే నిరుపేదలకు సంక్షేమం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు, డిజిటల్ రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులను జారీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండల, డివిజన్‌ల పరిధిలో ఏవైనా సమస్యలుంటే ప్రజలు నేరుగా డయల్ యువర్ ఎమ్మెల్యే 80961 07107 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ అరుణ కుమారి, టీపీసీసీ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, దేవరకొండ అనిల్, చంటిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రామంచ దయాకర్, ఐలయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

అబ్జర్వేషన్ హోంకు మైనర్ బాలురు

మట్టెవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 8 మంది మైనర్ బాలురు వాహనం డ్రైవింగ్ చేస్తుండగా ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మైనర్ బాలురపై జువైనల్ కోర్టులో చార్జీషీటు ఫైల్ చేయగా, 8 మంది మైనర్లను ఒకరోజు అబ్జర్వేషన్ హోంకు తరలించాలని జువైనల్ కోర్టు ఆదేశించ డంతో అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 26 మంది వాహనదారులకు జరిమానా, ఒకరికి ఒకరోజు సామాజిక సేవా శిక్షను శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన 26 మంది వాహనదారులకు రూ. 32300 జరిమాన విధించారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన కందిమల్ల మురళికి మెజిస్ట్రేట్ ఒకరోజు సామాజిక సేవ శిక్షను విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురు వాహనదారులకు రూ. 4500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

రంగోలమ్మ పాట ఆవిష్కరణ

బాలసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డబుల్‌స్టార్ ఫోక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన రంగోలమ్మ పాటను మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు.ప్రొడ్యూసర్లు నీరటి పావని, లత, మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధించాలి

బాలసముద్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను సాధించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల మృతిచెందిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభ శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అమరలైన వారి త్యాగాలను ఆయన కొనియాడారు. వారి మృతి పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయసారథి, రాజారెడ్డి, మేకల రవి, మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌లపై షాపుల తొలగింపు

కాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో పుట్‌పాత్‌లపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను శుక్రవారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. బుధవారం మునిసిపల్ సిబ్బంది దుకాణదారులకు ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ వారు ఖాళీ చేయకపోవడంతో శుక్రవారం ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగించారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య మునిసిపల్ సిబ్బంది తొలగించారు. కొందరు షాపు యజమానులు మునిసిపల్ సిబ్బందితో ఘర్షణకు దిగారు. పోలీసులు కల్పించుకో వడంతో వారు వెనక్కి తగ్గారు. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ కూల్చివేతలు జరిపినట్లు సిబ్బంది చెప్పారు.

నేడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు లోక కల్యాణార్థం ప్రత్యక్ష దైవం అలివేళు మంగ , ఆదిలక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణంతో పాటు హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పరశు రాందశ్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంక టరమణాచార్యులు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వేడుకలకు సంబంధించిన కరప త్రాలు , బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీనివాసుడి, అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.పరశురాందశ్ జిల్లా నాయకులు శ్రీవర్ధన్, మేగ శ్యామ్, శ్రీమన్నా రాయణ, శశికుమార్, సాత్విక్, సూరజ్‌సింగ్, లీలా, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో చోరీ

మడికొండ, డిసెంబరు 6: మడికొండలోని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల మేరకు.. శివాలయం వీధిలో ఉంటున్న రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగి సింగరాజు రవీందర్ తన భార్యతో కలిసి ఈనెల 3న విశాఖపట్నంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి రాగా ఇంటి తలుపుల పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాల లాకర్లు పగులగొట్టి అందులో ఉన్న రూ. 35,500 విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.25,000 నగదు కనిపించలేదు. మొత్తం రూ.60,500 విలువైన ఆభరణాలు, నగదును బీరువాలో నుంచి గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మినిమం టైం స్కేల్ ఇవ్వాలి

బాలసముద్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మినిమమ్ టైంస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులు రిలే దీక్షలను ఏకశిలా పార్కువద్ద శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తమ సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. లేకుంటే ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో కస్తూర్బా టీచర్లు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌ను అడ్డుకున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం వద్ద అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసేందుకు వచ్చిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్‌ల నేతృత్వంలో అడ్డుకున్నారు. వర్సిటీలో అంబేద్కర్ వర్ధంతి ఏర్పాట్లు లేవని, తాము సమాచారం ఇచ్చేవరకు అంబేద్కర్ విగ్రహం వద్దకు రాలేదని ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగారు. వర్సిటీ అధికారుల తీరును నిరసిస్తూ విద్యా ర్థులు నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు వర్సిటీలో గందరగోళం నెలకొంది.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

న్యూశాయంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యూశాయంపేటలోని పద్మశాలీ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 10న జరిగే సీపీఎం కాజీపేట 2వ మండల మహాసభలను విజయవంతం చేయాలని మహా సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సీపీఎం నాయకులు కారు ఉపేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం న్యూశాయంపేటలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద మహాసభలకు సంబంధించిన కరప త్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు ఓరుగంటి సాం బయ్య, జంపాల రమేష్, తొట్టె మల్లేశం, ధర్నా ప్రభాకర్, పెండ్యాల లక్ష్మణ్, సదానందం పాల్గొన్నారు.

పంచ సహస్ర గాజుల అలంకరణలో మహంకాళి

మడికొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మడికొండలోని మహంకాళి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉపద్రష్ట మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారిని పంచ సహస్ర గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పూజలలో చంద్రశేఖర్, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, విజయ, రాజ్యలక్ష్మీ, సరిత, సంధ్య, శారద, దివాకర్ల, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించిన పేద యువతి

- అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జ్యోతి
- దేశం నుంచి ప్రాతినిథ్యం వహించి గోల్డ్‌మెడల్ కైవసం
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు



పారా ఒలింపిక్ ఆర్గనైజర్ ద్వారా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జ్యోతి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యానికి ఏదీ అడ్డు కాదని నిరూపించింది భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ నిరుపేద యువతి. అంతర్జాతీయ స్థాయిలో దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి గోల్డ్‌మెడల్ సాధించింది. పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి ఈనెల 5న నేషనల్ పారాలింపిక్ అనే సంస్థ కాంబోడియా దేశంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఐదేళ్ల వయసులోనే రోడ్డు ప్రమాదంలో కుడికాలును కోల్పోయిన జ్యోతి.. కృత్రిమ కాలు సాయంతో నడుస్తోంది. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ఆమె ఇంటర్‌లో ఉన్న సమయంలో హనుమకొండ జేఎన్ఎస్ మైదానంలో జరిగిన క్రీడా పోటీలను చూసి తానూ ఆడాలనే ఆసక్తిని పెంచుకుంది. నేషనల్ పారా ఒలింపిక్ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పథకాలు సాధించి ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు అక్కడ జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కాంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈక్రమంలో పోటీల్లో పాల్గొనేందుకు కాంబోడియా వెళ్లేందుకు రూ.నలక్ష పైనే ఖర్చువుతుండటంతో మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో అధికారులు ఆర్థిక సహకారం అందించారు. దీంతో ఈనెల 5న కాంబో డియాలో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారుపతకం సాధిచించింది. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కాగా.. అంగవైకల్యాన్ని జయించి మెరిసిన జ్యోతిని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందిస్తున్నారు. జ్యోతికి పూర్తిస్థాయిలో శిక్షణనిస్తే ఒలింపిక్స్‌లోనూ పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకొస్తుందని పలువురు అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే అవినీతిని వ్యతిరేకించాలి : సీపీ

హనుమకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే అవినీతిని వ్యతిరేకించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండ జూనియర్ కళాశాల నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు. ఈ ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరనున్న 'జనరల్' కష్టాలు

- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



డోర్నకల్ / మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండటంతో సీట్లు దొరక్క.. కనీసం నిలుచోవడానికి కూడా చోటు ఉండక ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న రెండు జనరల్ బోగీలకు తోడు మరో రెండు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. జనాభాకు అనుగుణంగా రైళ్లు లేకపోవడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా రైల్వే బోర్డు అధికారులు అప్పటి వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లలో సుమారు 50శాతానికి పైగా రద్దుచేశారు. అదే సమయంలో ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో ఉన్న జనరల్ బోగీల సంఖ్యను కూడా తగ్గించి, వాటి స్థానంలో రిజర్వేషన్, ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో సాధారణ ప్రయాణికులు రైలు ప్రయాణమంటేనే హడలెత్తిపోయే పరిస్థితి వచ్చింది. ప్రతీ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు గతంలో ఐదు జనరల్ బోగీలచొప్పున ఉండేవి. వాటిలో ఒక బోగీ మహిళలు, దివ్యాంగుల కోసం కేటాయించారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇది మినహా మరో రెండు జనరల్ బోగీలే ఉండడంతో వాటిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు లబోదిబోమన్నారు. ఈక్రమంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, పిల్లల బాధలు వర్ణనాతీతం. కొన్ని రైళ్లలో కనీసం కాలుపెట్టే స్థలం కూడా లేక వందల కిలోమీటర్ల దూరం నిలుచుని ప్రయాణిస్తున్న దృశ్యాలు కోకొల్లలుగా ఉన్నాయి. అంతేకాదు డోర్లవద్ద కూర్చుని మరీ ప్రయాణిస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు పలు ప్రసార, వార్తా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రముఖంగా రావడం, దానికి తోడు.. మంత్రులు, ప్రజాప్రతినిధులకు రైళ్లలో సాధారణ బోగీలు పెంచాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపించాయి. కొన్నిచోట్ల సాధారణ బోగీలు పెంచాలని ఉద్యమాలు కూడా జరిగాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకు తలొగ్గిన రైల్వేశాఖ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మరో రెండు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో సికింద్రాబాద్, లింగంపల్లి, కాచిగూడ, గుంటూరు, నిజాముద్దీన్, తిరుపతి, కాకినాడ, దానపూర్, మచిలీపట్నం, యశ్వంతపూర్, నాందేడ్, మధురై స్టేషన్ల మధ్య నడుస్తున్న ముఖ్యమైన రైళ్లకు ఈ జనరల్ బోగీలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే బోర్డు ప్రకటించింది. నూతనంగా లింక్ ఆఫ్‌మెన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) రకానికి చెందిన అదనపు బోగీలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది. ఎల్‌హెచ్‌బీ బోగీలలో ఒక్కో బోగీలో వందమంది ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించేందుకు, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రాణ నష్టం తక్కువగా ఉండేలా ప్రత్యేకమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఈ ఎల్‌హెచ్‌పీ బోగీలను జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారు. అయితే ప్రస్తుతం 19 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు పెంచనున్నట్లు ప్రకటించగా త్వరలో మరో 21 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా రెండు సాధారణ బోగీలను పెంచుతామని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఇక దేశ వ్యాప్తంగా 370 రైళ్లలో దశల వారీగా జత చేయనున్నారు.

సాధారణ ప్రయాణికుల కష్టాలు తీరుతాయి

డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట



ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. మొత్తం ఆరు రాష్ట్రాల్లో పర్యటించి, సమస్యను వివరించాం. జనరల్ బోగీలు ఎక్కువగా లేకపోవడంతో రైలుఎక్కే సమయంలో జారి కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణికుల కష్టాలను తెలుసుకున్న రైల్వేశాఖ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రస్తుతం ఉన్న రెండు సాధారణ బోగీలకు అదనంగా మరోరెండు బోగీలను

ఏయే రైళ్లకు అదనపు బోగీలంటే..

సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ మధ్య నడిచే రైలు నెంబర్ 12706/12705 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-నిజాముద్దీన్-హైదరాబాద్ 12721/12722 దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిరిపూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్.. 12757/12758 కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -దానాపూర్-సికింద్రాబాద్ 12791/12792 ఎక్స్‌ప్రెస్, మచిలిపట్నం-ధర్మవరం-మచిలిపట్నం 17215/17216 ధర్మావరం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కొల్లం-తిరుపతి 17421/17422 తిరుపతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-హౌరా-సికింద్రాబాద్.. ఫలక్‌నామా 12704/12703 ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గూడూరు-సికింద్రాబాద్ 12715/12716 సాచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-లింగంపల్లి-కాకినాడ 12737/12738 గౌతమి ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-ముంబాయి సీఎస్ఎంటీ-లింగంపల్లి 17058/17057 దేవగిరి ఎక్స్‌ప్రెస్, కాకినాడ-సాయినగర్ షిర్డీ-కాకినాడ 17206/ 17205 షిర్డీ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-భౌనగర్-కాకినాడ 12755/12756 ఎక్స్‌ప్రెస్, మచిలిపట్నం-యశ్వంతపూర్-మచిలిపట్నం 17211/17212 ఎక్స్‌ప్రెస్, తిరుపతి-లింగంపల్లి-తిరుపతి 12733/12734 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-మంగళూరు-కాచిగూడ 12789/12790 ముర్డేశ్వర ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-మధురై-కాచిగూడ 22715/22716 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-సికింద్రాబాద్-తిరుపతి 12797/12798 వెంకటాద్రిఎక్స్‌ప్రెస్, నాందేడ్-నిజాముద్దీన్-నాందేడ్ 12753/12754 మరట్వాడ ఎక్స్‌ప్రెస్, నాందేడ్-అంబఅందవురా-నాందేడ్ 22709/22710 హజూర్‌సాహెబ్ నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేయనున్నారు.

ఉద్యమానికి నాందిపలికిన మానుకోట

పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ప్రధానికి కోటి ఉత్తరాలు

నిత్యం జనరల్ బోగీల్లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, ప్రతీ రైలులో ఐదు అదనపు బోగీలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమానికి మానుకోట నాంది పలికింది. ఈ ప్రాంతానికే పరిమితం కాకుండా ఇది దేశ వ్యాప్తమైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ 2024 మార్చి 8న వరంగల్ వెళ్లేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌కువచ్చారు. ఆ సమయంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉండడంతో జిల్లాకు చెందిన ఓ గర్భిణి చంకలో తన చిన్నపాపతో రైలు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండి ఆమె కింద పడిపోగా ఆమె చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. ఆరు రోజుల పాటు చికిత్స అందించినా ఆ చిన్నారి కన్నుమూసింది. దీంతో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ప్రతీ రైలులో జనరల్ బోగీల సంఖ్యను పెంచి, ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలంటూ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానికి కోటి ఉత్తరాల పేరుతో ప్రారంభించిన ఈ ఉద్యమం అతి తక్కువ సమయంలో తెలుగురాష్ట్రాలతో పాటు గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో విస్తృతమైంది. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్‌గా ఆయన ఆయా రాష్ట్రాల్లో పర్యటించి ఉద్యమాన్ని నడిపించారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్ (ఫైల్)

పలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు ఈ పోరాటానికి స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ ప్రధానికి ఉత్తరాలు రాశారు. ఇలా దాదాపుగా 30లక్షలకు పైగా లేఖలు రాశారు. ఇదే క్రమంలో రైళ్లలో సాధారణ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెస్తూ మీడియా చానళ్లు, వర్తాపత్రికలు కథనాలు ఇచ్చాయి. మరోపక్క ప్రజా ప్రతిపనిధులపై కూడా ప్రజలు ఒత్తిడి తెచ్చారు. ఈ పరిణామాలను గమనించిన రైల్వేశాఖ రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించి ప్రయాణికులకు తీపి కబురు అందించింది.

శరవణ భవ.. శరవణ భవ..

- నేడు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాలు
- వేడుకలకు ముస్తాబైన ఊకల్ దేవాలయం
- పలు దేవాలయాల్లో అభిషేకాలు, కల్యాణాలు, అన్నదానాలు



ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

గీసుగొండ/వరంగల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వల్లీ వల్లభ మాంపాయి సేనా నాయక మాంపాంయి.. శరవణ భవ దేవతల సైన్యాధ్యక్షుడు కృత్రిక పుత్రుడు శణ్ముఖ దేవుడు, శివపార్వతుల తనయుడు కార్తికేయుడు. మార్గశిర మాసం శష్టి శనివారం రోజున శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

గీసుగొండ మండలంలోని ప్రసిద్ధి చెందిన ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి సందర్భంగా శనివారం స్వామి వారి కల్యాణోత్సవానికి సర్వం సిద్ధమైంది. కల్యాణోత్సవ వేడుకలకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఏటా జరిగే ఈ ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకిస్తారు. కాగా, స్వయంభూగా వెలిసిన నాగేంద్రుడు ఈ ఆలయంలో కొలువుదీరి ఉండడం ఈ ఆలయానికి ప్రత్యేకత. స్వామి వల్లీదేవి, దేవసేనాదేవిల కల్యాణాన్ని తిలకించినవారికి, చేయించిన వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలతో పాటు ఆర్థిక ఈతి బాధలు, సకల దోషాలు తొలిగిపోతాయని భక్తులకు అపార నమ్మకం. రాహు, కేతువు, అంగారక గ్రహాలకు సుబ్రహ్మణ్యేశ్వరుడు అధిపతిగా ఉంటాడు కాబట్టి మూడు గ్రహాల దోషాలను స్వామివారు తొలగిస్తారని ఆలయ అర్చకుడు సుదర్శనాచార్యులు తెలిపారు.

ఘట్టం ఇలా..

శనివారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి ఎదుర్కోళ్లు, గ్రామసందర్శన, ఆలయప్రవేశం చేయించి మంగళవాయిద్యాలతో కల్యాణ మండపానికి తీసుకువస్తారు. 11 గంటలకు కల్యాణం, తలంబ్రాల ఘట్టం కనుల పండువగా జరుగుతుంది. అనంతరం ఉత్సవమూర్తులైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీదేవి, దేవసేనాదేవిలకు పుష్పమాల సేవ, ఊయలసేవ అనంతరం పారువేట క్రతువులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాచిన పెల్లి బాబురావు తెలిపారు.



ప్రత్యేక పూల అలంకరణలో ఉత్సవమూర్తులు

కల్యాణోత్సవం తిలకిస్తే అంతా శుభమే..

ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు



స్వయంభువుగా వెలిసిన ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా నిర్వహించే బ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించే భక్తులకు అంతా శుభం జరుగుతుంది. శనివారం 12.10 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. సౌభాగ్యం, సంతానభాగ్యం కలిగి, గ్రహదోషాలు, దృష్టిదోషాలు, రుణబాధలు తొలగిపోయి ఇష్టసిద్ధి లభిస్తుంది. స్వామివారి కల్యాణానికి వచ్చి కొబ్బరికాయ కొట్టి ఇంటి ముందు కట్టుకుంటే సకల దోషాలు నివారించబడుతాయి. ఎంతో మహామాన్వితం గల స్వామి తలంబ్రాలు భక్తులకు అందించబడుతాయి.

నగరంలో..

చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని వందలాది మంది దంపతులతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భద్రకాళి దేవాలయంలో జరిగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.516 టికెట్ చెల్లించాలని ఆలయ ఈవో శేషుభారతి తెలిపారు. ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకం అనంతరం వెయ్యి అరటి పండ్లతో సహస్రనామార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్లంబజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, బట్టలబజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాల యంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవాసవీ మాత దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉర్సు నాగేంద్ర స్వామి దేవాలయంతో పాటు నగరంలోని అనేక దేవాలయాల్లో సుబ్రహ్మణ్య శష్ఠి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా, నగరంలో అన్నదానాలు, ప్రసాద వితరణలు, ప్రత్యేక అభిషేకాలు, భజనలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఏడాదిలో.. ఎన్నో అడుగులు!

(5వ పేజీ తరువాయి)

రూ.176కోట్లతో ఎడ్యుకేషన్ హబ్‌కు శంకుస్థాపన చేసింది. రూ.286కోట్లతో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసిందుకు అడుగులు ముందుకు వేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఎదురుచూస్తున్న దేవాదుల ప్రాజెక్టును మార్చి 2026నాటికి పూర్తిచేసేలా రూ.689 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులు ఆహ్వానించటమే కాకుండా.. భూ నిర్వాసితులకు అండగా నిలిచింది. ములుగులో గిరిజన యూనివర్సిటీకి 211ఎకరాల భూమిని కేటాయించింది. ఇలా అనేక అభివృద్ధి పనులతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు రూ.500 సబ్సిడీపై గ్యాస్ పంపిణీ, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో వేలాది మందికి లబ్ధి చేకూరుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్కుపై ప్రత్యేక దృష్టి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును 1,350ఎకరాల విస్తరణలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌళిక వసతులు కల్పించారు. అయితే వరంగల్‌కు మరో వస్త్రనగరిగా అభివృద్ధి జరుగుతుందని భావించినా ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్రమే పరిశ్రమలు స్థాపించాయి. అయితే వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మొదటి భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశారు. తాజాగా ఆదివారం మెగా టెక్స్‌టైల్ పార్కులో అభివృద్ధి పనులకు రూ.160.99కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో పాటు ఆగస్టు 12వ తేదీన దక్షిణ కొరియాలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో పెట్టుబడులకు అక్కడి కంపెనీలతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. దీంతో త్వరలోనే భారీగా పెట్టుబడులు రానుండగా ఉపాధి అవకా శాలుపెరగనున్నాయి.

52 ఏళ్లకు కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి..

వరంగల్ నగరాభివృద్ధిలో కీలకమైన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయడానికి 52ఏళ్లు పట్టింది. 1972లో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ మాత్రమే ఇప్పటికి అమల్లో ఉంది. ప్రతి 20ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో వరంగల్ మాస్టర్ ప్లాన్ అమల్లోకి రాకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2041 మాస్టర్ ప్లాన్ తయారు చేసినప్పటికి 2016నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విస్తరణతో పాటు 2041 మాస్టర్‌ప్లాన్‌కు కొంత మార్పులు చేర్పులు చేసి ప్రభుత్వం ఆమోదించింది. దీంతో వరంగల్‌కు 52ఏళ్ల తరువాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది.

ఏడాదిలో అభివృద్ధికి నిధులొచ్చాయిలా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పెండింగ్ పనులకు మోక్షం కలిగించేలా నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఎయిర్‌పోర్టు భూసేకరణ, టెక్స్‌టైల్‌పార్కు, భూపాలపల్లి మైలారం గుట్టల్లో ఎడ్యుకేషన్ హబ్, చిన్నకాళేశ్వరం పనులు, దేవాదుల పూర్తి ఇలా పనులకు నిధులిచ్చింది. ఇక మహానగరం అభివృద్ధికి ఎన్నడూ లేని విధంగా రూ.4962.47కోట్లు కేటాయించింది. వీటిలో కొన్ని పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

- భూపాలపల్లిలో 40ఎకరాల్లో రూ.176కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాపన
- గణపురం మండలం మైలారం గుట్టల్లో 60ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన
- చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.286కోట్లు కేటాయింపులు
- ములుగు గిరిజన యూనివర్సిటీకి సుమారు రూ.10కోట్ల విలువైన 211ఎకరాల భూమి కేటాయింపు
- వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ : రూ.4,170 కోట్లు
- మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణ: రూ.205కోట్లు
- కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ : 160.92 కోట్లు
- టెక్స్ టైల్ పార్కులో రోడ్లు, స్కూల్స్ సదుపాయాలు : రూ.33.60 కోట్లు
- టెక్స్ టైల్‌పార్క్ నిర్వాసిత రైతులకు ఇందిరమ్మ ఇళ్లు : రూ. 43.15 కోట్లు
- కాళోజీ కళాక్షేత్రం : రూ.85 కోట్లు
- పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ : రూ. 65 కోట్లు
- నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణం: రూ.8.30కోట్లు
- వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్‌కు : రూ. 32.50 కోట్లు
- ఇన్నర్ రింగ్ రోడ్: రూ.107కోట్లు
- భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవనానికి రూ.28కోట్లు
- గ్రేటర్ వరంగల్ పరిధిలో రోడ్లు : రూ. 49.50
- వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానాకు : 1.50 కోట్లు

భద్రత లేని బ్యాంకులే లక్ష్యంగా..

- రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు
- 2కిలోల 520 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



నిందితుల అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

హనుమకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భద్రత, రక్షణ లేని బ్యాంకులే లక్ష్యంగా దొంగలు చోరీలకు ఎంచుకుంటున్నారని, ఈక్రమంలోనే వరంగల్ జిల్లా రాయపర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో దోపీడీ జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. ఈ మేరకు రాయపర్తి ఎస్బీఐలో చోరీకి పాల్పడిన ముఠాలోని సభ్యుల్లోని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోటి ఎనభై లక్షల నాలుగు వేల రూపాయల విలువ గల 2కిలోల 520 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, పదివేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దోపీడీకి సంబంధించిన ఆయన వివరాలు వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ నవాబ్ హసన్(39) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ వాసులు అర్షాద్ అన్సారీ(34), షాకీర్‌ఖాన్ అలియాస్ బోలెఖాన్ (28), హిమాన్షు బిగాం చండ్ జాన్వర్(30), సాజీద్ ఖాన్(35), మహారాష్ట్రకు చెందిన అక్షయ్ గజానన్ అంబోర్(24), సాగర్ భాస్కర్ గోర్ (32)లు ఏడుగురు ముఠాగా ఏర్పడి వ్యాపారం ముసుగులో హైదరాబాద్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ ముఠా బ్యాంకుల్లో సొమ్మును చోరీ చేసేందుకు గూగుల్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకుల సమాచారం సేకరించారు. అందులో భాగంగా వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకును చోరీ చేయాలని అనుకున్నారు. ఈ మేరకు గత నెల 18న నిందితుల్లో ఒకరైన హిమాన్షు డ్రైవింగ్ చేస్తుండగా మరో ఆరుగురు నిందితులు కారులో రాయపర్తి గ్రామశివారుకు చేరుకున్నారు. హిమాన్షును తెల్లవారుజామున 4 గంటలకు రమ్మని చెప్పి పంట పొలాల ద్వారా ఆరుగురు నిందితులు బ్యాంకుకు రాత్రి 11గంటలకు చేరుకొని ముందుగా కిటికీని తొలిగించారు. ఆపై బ్యాంకు సెక్యూరిటీ అలారంతో పాటు సీసీ కెమెరాల వైర్లను తొలిగించారు. తర్వాత ఇద్దరు నిందితులు తొలగించిన కిటీకిల దగ్గర కాపలా ఉండగా, మిగతా నలుగురు నిందితులు స్ట్రాంగ్ రూమ్ తాళాలు పగలగొట్టి వాటిలో ఉన్న మూడు లాకర్లను తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్లు వినియోగించి తెరిచారు. అందులో ఉన్న సుమారు రూ.13 కోట్ల 61 లక్షల విలువగల బంగారు ఆభరణాలను వారి వెంట తెచ్చుకున్న సంచుల్లో వేసుకున్నారు. గ్యాస్ సిలిండర్, ఇతర సామగ్రిని బ్యాంకులోనే వదిలేసి సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను తీసుకొని వచ్చిన కారులోనే హైదరాబాద్‌లోని అద్దె ఇంటికి వెళ్లారు. ఈ మేరకు చోరీ చేసిన సొత్తును ఏడు వాటాలుగా పంచుకొని నవంబరు 19న మూడు బృందాలుగా విడిపోయి ఉత్తప్రదేశ్, మహారాష్ట్రకు వెళ్లిపోయారు.

కాగా, బ్యాంకులో జరిగిన చోరీపై అప్రమత్తమైన వరంగల్ కమిషనరేట్ పోలీసులు.. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ నేతృత్వంలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ఇన్విస్టిగేషన్ ఆఫీసర్‌గా, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సీసీఎస్ ఏసీపీ భోజరాజు ఆధ్వర్యంలో 10కి పైగా పోలీసు బృందాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెతికారు. టెక్నాలజీని వినియోగించుకొని నిందితుల కదలికలను గుర్తించారు. ఆపై ఈ ముఠాలోని అర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్, హిమాన్షును అరెస్టు చేశారు. అతి తక్కువ కాలంలో చోరీ కేసును ఛేదించి, సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీలు కిరణ్‌కుమార్, నర్సయ్య, భోజరాజు, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ వరప్రసాద్, శివకుమార్, రఘుపతిరెడ్డి, శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డి, అబ్బయ్య, పవన్‌కుమార్, విశ్వేశ్వర్, ఏఏఓ సల్మాన్‌పాషా, ఎస్సైలను సీపీ అంబర్ కిషోర్‌ఝా అభినందించారు. కాగా, పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని, తొందర్లోనే పట్టుకుంటామని సీపీ పేర్కొన్నారు.

బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి..

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు సరిచూసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝా కోరారు. దొంగలు భద్రత లేని బ్యాంకులను ఎంచుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని గార్డు లేని బ్యాంకుల్లో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాయపర్తి ఎస్బీఐలో అలారమ్ సైతం పాత టెక్నాలజీ వినియోగించడంతో నిందితులు చోరీ సులువుగా చేశారన్నారు. అలారమ్ కట్‌చేయగానే బ్యాంకు అధికారులకు, పోలీస్‌శాఖకు ఎస్ఎంఎస్ వచ్చేలా అన్ని బ్యాంకులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కమిషరేట్ పరిధిలోని బ్యాంకులను పోలీసులు సందర్శించి సూచనలు చేశారన్నారు. 24 గంటలు సెక్యూరిటీ గార్డులు, బ్యాంకుల్లో సరిపడా సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
9
శనివారం
7 డిసెంబరు 2024

ఎర్ర బియ్యమే మేలు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

బియ్యాన్ని శాలి ధాన్యం అంటారు. శాలి అంటే శ్రేష్ఠమైనదని. బుద్ధిశాలి, ధైర్యశాలి లాంటి పదాలలో శాలి లాంటిదే ఇది కూడా!

అన్నంగా వండుకుని తినటానికి బియ్యాన్ని మించిన ధాన్యం లేదు. అందుకే దాన్ని శాలి (శ్రేష్ఠం) అన్నారు. శాలివనపాలికుడంటే వరి పండించే రైతు. వరి పండే నల్లరేగడి భూమిని శాలేయం అంటారు. ఒకప్పుడు కాసరవడ్లు, తిరువరంగాలు, నెమలివడ్లు, బంగారు తీగలు, పిషాణపు వడ్లు, వెన్నముద్దలు ఇలా అనేక రకాల వరిధాన్యాలు పండించేవాళ్లు. ఇప్పుడంటే సైన్సు బాగా అభివృద్ధి చెందింది కాబట్టి జన్యు పరివర్తన పద్ధతిలో అనేక రకాల ధాన్యాలు తయారు చేస్తున్నారు. సైన్సు ఇంతగా అభివృద్ధి చెందని సమయంలో మన పూర్వీకులు ఎలాంటి ధాన్యాలు పండించారనే ఆసక్తి చాలా మందిలో ఉంటుంది. మన పూర్వీకులు తెలుపు, నలుపు, ఎరుపు... మూడు రంగుల్లో ధాన్యాలు పండించారని 'భోజన కుతూహలం'



గ్రంథం చెబుతుంది. ఈ ధాన్యాలకు ఉన్న లక్షణాలను కూడా ఇది తెలియజేస్తుంది.

తెల్ల బియ్యం

"రాజాన్నంతు త్రిదోషఘ్నం మధురం లఘ్నుదీపనం బలకృత్ పథ్యం కాంతిదం వీర్యవర్ధనమ్"

ఈ శ్లోకాన్ని భోజన కుతూహలంలో రాజనిఘంటువు అనే గ్రంథంలోంచి తీసి ఉదహరిస్తారు. దీని ప్రకారం చూస్తే-

శాలిధాన్యంతో వండిన అన్నాన్ని రాజాన్నం అంటారు. అన్ని దోషాలను పోగొట్టి ఆరోగ్యాన్నిస్తుంది. రుచిగా మధురంగా ఉంటుంది. తేలికగా అరుగుతుంది. జీర్ణశక్తిని పెంచుతుంది.బలకరం. అన్ని వ్యాధుల్లోనూ తినదగినది. పురుషులలో జీవకణాలను పెంచుతుంది. దీనిలోనే "మహారాష్ట్రేషు రాజభోగ్రైతి, రాజాన్న మిత్యేవాంధ్రేషు ప్రసిద్ధమ్" అనే శ్లోకం కూడా ఉంది. అంటే

మహారాష్ట్రలో ఈ ధాన్యాన్ని రాజభోగాలని, ఆంధ్రప్రాంతంలో రాజాన్నం అంటారనీ ఈ గ్రంథం వివరించింది. ఇది 500 ఏళ్ల క్రితం నాటి సమాచారం. అందుకే బియ్యంలో ఎన్ని మార్పులు వచ్చినా ఈనాటికీ వరన్నం తెలుగు వారికి రాజాన్నమే!

నల్ల బియ్యం

ఈ నల్లబియ్యం మనకు కొత్త కాదు. భోజనకుతూహలంలో - దీనిని "కృష్ణశాలీర్గోదాతీరే ప్రసిద్ధః" అని పేర్కొన్నారు. అంటే మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతాల్లో ఈ బియ్యం లభ్యమవుతుందని అర్థం. ఇక దీని గొప్పతనం గురించి చెబుతూ..

"కృష్ణశాలీస్త్రిదోషఘ్నో మధురాః పుష్టివర్ధనః వర్ణకాంతికరో బల్యో దాహజిద్వీర్యవర్ధనః" అని పేర్కొన్నారు. కృష్ణశాలీ అంటే నల్లబియ్యం. ఇది దోషాలనూ హరిస్తుంది. మధురాతిమధురంగా ఉంటుంది. చిక్కి పోతున్నవారికి పెట్టదగినవి. శరీరానికి మంచి రంగుని కాంతినీ కలిగిస్తుంది. శరీరంలో వేడిని తగ్గించి, పురుషుల్లో జీవకణాలను పెంచుతుంది. ప్రస్తుతం మనకు ఇండోనేషియా రకం, ఫిలిప్పిన్ రకం, థాయిల్యాండ్ రకం- ఇలా అనేక రకాల బియ్యాలు దొరుకుతున్నాయి. చక్‌హావ్ అనే మణిపురి బియ్యం, తమిళనాడులో పండే కవునిఅరిసి రకం కూడా లభ్యమవుతున్నాయి. ఈ బియ్యంలో 10 శాతం దాకా ప్రొటీన్లు లభిస్తాయి. కొవ్వు శాతం కూడా చాలా తక్కువ!

ఎర్ర బియ్యం

ఎర్ర బియ్యం (రక్తశాలిధాన్యం) అంటే, దంపుడు బియ్యం కాదు. ఈ బియ్యమే ఎర్రగా ఉంటాయి. నల్ల బియ్యం పైపొరలో ఉండే


యాంథోసియనైన్ అనే రంజకమే ఈ ఎరుపు రంగు రావటానికి కూడా కారణం అవుతోంది. కానీ తెల్ల బియ్యంకన్నా, నల్లబియ్యంకన్నా ఎర్రబియ్యానికి పోషకాలు ఎక్కువ. గ్లైసీమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది కాబట్టి ఎర్రబియ్యం సర్వ శ్రేష్ఠం. మధుమేహ వ్యాధిగ్రస్తులు, స్థూలకాయులు కూడా దీనిని తినవచ్చు. 'భోజనకుతూహలం' లో దీని గురించి

" రక్తశాలిస్తు మధురోలఘుః స్నిగ్ధో బలావహః రుచికృద్దీపనః పథ్యో ముఖజాడ్యరుజాపః సర్వామయ హరో రుచ్యో పిత్తదాహానిలాస్రజిత్"

..అని వర్ణిస్తారు. అంటే ఎర్రబియ్యం తియ్యగా, కమ్మగా మృదువుగా ఉంటాయి. తేలికగా అరుగుతాయి. అమిత బలకరం, ఆకలిని పెంచుతాయి. తృప్తినిస్తాయి. నోటికి రుచి తెలియకపోవటం, అన్నహితవు లేకపోవటం లాంటి పరిస్థితులున్నవారికి ఈ బియ్యం ఎంతో మంచివని అర్థం. ఈ బియ్యం కంటి చూపును పెంచటంలో కూడా గొప్ప పాత్రను పోషిస్తుంది.

● గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



వెచ్చని సూప్‌లు

చలి పెరిగినప్పుడు వెచ్చని సూప్ తాగాలనిపిస్తుంది. రకరకాల కాయగూరలతో చేసే సూప్‌లు ఆరోగ్యకరమైనవే కావు... తాగటానికి రుచిగా కూడా ఉంటాయి. అలాంటి కొన్ని సూప్‌లు ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...



కాలీఫ్లవర్ సూప్

కావాల్సిన పదార్థాలు:
తరిగిన కాలీఫ్లవర్ ముక్కలు- ఆరు కప్పులు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, తరిగిన బంగాళదుంప ముక్కలు- రెండు స్పూనులు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, నానబెట్టిన వాల్‌నట్స్- రెండు స్పూనులు, దాల్చినచెక్క పొడి- పావు స్పూను, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- వాల్‌నట్స్‌ను వేడి నీళ్లలో 15 నిమిషాలు నానబెట్టాలి. పై తొక్కలు తీయాలి. తొక్క తీసిన వాల్‌నట్స్‌ను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. దానిలో నీళ్లు పోయాలి. పలచగా అయిన ఆ మిశ్రమాన్ని ఒక గిన్నెలో పోయాలి.
- ఒక మూకుడులో నూనెను వేసి వేడి చేయాలి. నూనెలో ఉల్లిపాయ ముక్కలు, కాలీఫ్లవర్ ముక్కలు, బంగాళదుంప ముక్కలు వేసి వేయించాలి. కొద్దిగా వేగిన తర్వాత దానిలో తగినన్ని నీళ్లు పోసి పైన మూత పెట్టాలి.
- ఇలా బాగా ఉడికిన ముక్కల్లో మూడొంతులు బయటకు తీసి, వాటిని మిక్సీలో ముద్దగా చేయాలి. ఆ తర్వాత ఈ ముద్దను మళ్లీ మూకుడులో వేయాలి. దానిలో వాల్‌నట్స్ మిశ్రమాన్ని పోసి, మూత పెట్టి ఉడకబెట్టాలి.
- చివరగా దాల్చినచెక్క పొడి, ఉప్పు, తరిగిన కొత్తిమీర వేసి బాగా ఉడకనివ్వాలి.

ఎర్ర కందిపప్పు సూప్

కావాల్సిన పదార్థాలు:
ఎర్రకంది పప్పు- ఒక కప్పు, జీలకర్ర- ఒక స్పూను, ఆవాలు- ఒక స్పూను, వెల్లుల్లి- రెండు రెబ్బలు, పసుపు- అర స్పూను, మసాలా పొడర్- పావు స్పూను, తరిగిన కొత్తిమీర- అర స్పూను, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ఎర్ర కందిపప్పును 8 గంటలు నానబెట్టాలి. దీనిని ఒక గిన్నెలో ఐదు కప్పుల నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. ఉడకబెట్టిన పప్పును మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఒక మూకుడులో నూనె వేసి జీలకర్ర, ఆవాలు, వెల్లుల్లి, పసుపు, మసాలాపొడర్‌లు వేసి బాగా వేయించాలి.
- వేయించిన మిశ్రమంలో పప్పు ముద్దను వేయాలి. తగినన్ని నీళ్లు పోసి.. ఉప్పు కూడా వేయాలి. మూతబెట్టి 15 నిమిషాలు ఉడకనివ్వాలి. ఆ తర్వాత తరిగిన కొత్తిమీర పైన జల్లాలి.



జాగ్రత్తలు

- ఎర్ర కందిపప్పును బాగా నానబెట్టాలి. లేకపోతే ముద్ద చేయటం కష్టమవుతుంది. రుచి కూడా మారుతుంది.
- కొందరు మసాలా పొడర్ బదులుగా కారం వేసుకుంటారు.
- ఈ సూపును అప్పడాలతో పాటుగా తింటే బావుంటుంది.

చిలకడదుంప సూప్

కావాల్సిన పదార్థాలు:
ఆలీవ్ ఆయిల్- రెండు స్పూనులు, వెల్లుల్లి ముక్కలు- ఒక స్పూను, తెల్ల ఉల్లిపాయ ముక్కలు- రెండు స్పూనులు, క్యాప్సికం- రెండు స్పూనులు, చిలకడ దుంప ముక్కలు- అర కప్పు, పాలు- ఒక కప్పు, కొబ్బరి పాలు- అర కప్పు, మిరియాలు- రెండు స్పూనులు, కారం- అర స్పూను, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

- ఒక మూకుడులో రెండు స్పూన్ల ఆలీవ్ నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికం ముక్కలు, వెల్లుల్లి ముక్కలను బాగా దోరగా వేయించాలి.
- ఆ తర్వాత చిలకడదుంపలు, ఉప్పు, కారం, మిరియాల పొడి వేయాలి. తగినన్ని నీళ్లు పోసి మూతబెట్టి బాగా ఉడికించాలి. ముక్కలు బాగా మగ్గిన తర్వాత ముద్దలా చేయాలి.
- దీనిలో ముందు పాలు పోయాలి. ఐదు నిమిషాలు ఉడికిన తర్వాత కొబ్బరి పాలు కూడా పోయాలి. ఐదు నిమిషాలు ఉడికించి కిందకు దింపేయాలి.



జాగ్రత్తలు

- ఆలీవ్ ఆయిల్ త్వరగా వేడి ఎక్కుతుంది. అందువల్ల ఎక్కువ మంటపై వేడి చేయకూడదు.
- పాలు చివర్లోనే పోయాలి. ముందు పోస్తే పాలు విరిగిపోయే ప్రమాదముంది.

తోలుబొమ్మలతో తిరుగులేని మార్పు

వర్ణ, లింగ వివక్షను ప్రదర్శించే సమాజంలో మార్పు తీసుకురావడం కోసం వినూత్న ప్రయత్నానికి పూనుకుంది తమిళనాడుకు చెందిన రతి. కథలు, తోలుబొమ్మలాటలతో విద్యార్థులను చైతన్యపరుస్తూ, సమూల మార్పుకు దోహదపడుతున్న 39 ఏళ్ల ఆమె కథనమిది.



తమిళనాడు, తిరునల్వేలిలోని కీల తెంకాలం గ్రామానికి చెందిన రతికి తోలుబొమ్మలు, కథలతో అనుబంధం ఐదేళ్ల వయసులోనే ఏర్పడింది. తండ్రితో పాటు తోలుబొమ్మలాటలకు హాజరైన రతి వాటితో ప్రేమలో పడిపోయింది. బొమ్మల ద్వారా మనోభావాలను వ్యక్తీకరిస్తూ, వినోదాన్ని పంచే ఆ కళనే వృత్తిగా మలుచుకోవాలని కూడా భావించింది. కానీ చివరకు జీవనభృతి కోసం తోలు పరిశ్రమను ఎంచుకోక తప్పలేదు. 99.9 శాతం పురుషాధిక్యతలో కొనసాగే తోలు పరిశ్రమ మహిళలకు తగని రంగమని రతి ఆలస్యంగా గ్రహించింది. అక్కడి వాతావరణం ఇబ్బందికరంగా మారడంతో ఉద్యోగానికి స్వస్తి చెప్పి, 2009లో తనకెంతో ఆసక్తి ఉన్న నటనారంగంలోకి అడుగుపెట్టింది. అలాగే 2014లో కథలు చెప్పి అలరించే అభిరుచిని కూడా అలవాటు చేసుకుంది. అలా రతి స్టేజి యాక్టర్‌గా, స్టోరీ టెల్లర్‌గా, పప్పెటీర్‌గా 2010 నుంచి ఈరోడ్‌లోని పాఠశాలల్లో ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది.

మార్పు సాధ్యమే...

ఒక సందర్భంలో తనకెదురైన ఒక అనుభవం గురించి ప్రస్తావిస్తూ... "ఒక బడిలో ప్రదర్శన ఇస్తున్న సమయంలో ఒక విద్యార్థి 'మీరు ఆఫ్రికా నుంచి వచ్చారా?' అని అడిగింది. రంగు తక్కువ కాబట్టి నాకి లాంటి ప్రశ్నలు మామూలే! ఆ మాటలు విన్న టీచర్ తర్వాత ఆ విద్యార్థిని దండించబోతుంటే, నేను వారించాను. ఆ తర్వాత వర్ణ వివక్ష గురించి 40 నిమిషాల నిడివి గల కథను వినిపించాను. ఆ కథ విన్న తర్వాత, తరగతిలోని కొందరు ఆడపిల్లలు నా దగ్గరకొచ్చి, వాళ్లెలా వర్ణవివక్షకు గురయ్యారో వివరిస్తూ, వాళ్ల అనుభవాలను పంచుకున్నారు. నా కథ వాళ్ల మీద ప్రభావం చూపించగలిగినందుకు ఎంతో సంతోషించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు మళ్లీ అదే బడికి వెళ్లినప్పుడు, ఆ ఆడపిల్లలందరూ నా దగ్గరకు పరుగున వచ్చి, అందరూ వాళ్లను నల్ల పిల్లా అని పిలవడం మానేశారని ఎంతో హుషారుగా చెప్తుంటే ఆనందంతో పొంగిపోయాను" అంటూ చెప్పుకొచ్చింది రతి. అయితే అందరు కళాకారుల్లాగే ప్రారంభంలో రతి కూడా సవాళ్లను ఎదుర్కొంది.

సవాళ్లను స్వీకరించి...

"వృత్తిలోకి అడుగుపెట్టిన మొదట్లో ప్రదర్శనలకు వేదికలు దొరికేవి కావు. 30వ ఏటలోకి అడుగుపెట్టగానే నేను మానసిక కుంగుబాటుకు గురయ్యాను. దాన్నుంచి అతి కష్టం మీద కోలుకుని పట్టుదలగా ప్రదర్శనలివ్వడం



మొదలుపెట్టాను. చెన్నైకి చెందిన నటి, దర్శకురాలు సుకన్యా ఉమేష్, తాను రచించిన ఒక స్క్రిప్ట్‌ను నాటకంగా ప్రదర్శించమని నన్ను ఆహ్వానించారు. ఆ స్క్రిప్ట్ అచ్చంగా నా జీవితాన్నే తలపించింది. చెన్నైలో పెరిగే క్రమంలో రంగు తక్కువ అమ్మాయి ఎదుర్కొన్న అవమానాలకు సంబంధించిన కథ అది. రిహార్సల్స్ సమయంలో భోరున ఏడ్చేసేదాన్ని. ఆ నాటకానికి నాకెంతో మంచి పేరొచ్చింది. అప్పటి నుంచి నాటక ప్రదర్శననే నా వృత్తిగా ఎంచుకోవాలని నిర్ణయించుకున్నాను. అలా ఒక స్టోరీ టెల్లింగ్ కంపెనీ కోసం పని చేయడం మొదలుపెట్టాను. ఆహార, ప్రయాణ ఖర్చులు పోను, వాళ్లు నాకు రెండు వేల రూపాయలు పారితోషికంగా ఇచ్చేవారు. ఆ తర్వాత కొవిడ్‌తో కంపెనీ మూతపడింది. లాక్‌డౌన్ కాలంలో కళాకారులందరం ఇబ్బంది పడ్డాం. ప్రదర్శనలకు అవకాశాలే లేకుండా పోయాయి. దాంతో స్టోరీ టెల్లింగ్‌తో పాటు తోలుబొమ్మలాటలను వృత్తిగా మలుకుని కొత్త జీవితం మొదలుపెట్టాను.

వెయ్యి ప్రదర్శనలతో...

కథలు చెప్పడం ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకోసం శిక్షణ తీసుకోవాలి. అయితే రతి యూట్యూబ్ ద్వారా శిక్షణ తీసుకుంది. ఎన్నో పుస్తకాలు చదివింది. ఆన్‌లైన్ సెషన్లకు హాజరైంది. "పిల్లల బుక్ ట్రస్ట్ నుంచి నేనెన్నో పుస్తకాలను సేకరించాను. ప్రారంభంలో అవి నాకెంతో ఉపయోగపడ్డాయి. అలాగే నేను 100 వరకూ తోలుబొమ్మలను సంపాదించుకోగలిగాను. జైపూర్ నుంచి తీగలకు వేలాడే తోలుబొమ్మలు, టిలోనియా నుంచి చేతి తొడుగుల తోలుబొమ్మలు, హంపి, తెలంగాణాల నుంచి తోలుతో తయారైన బొమ్మలు సేకరించాను. అలా వాటితో 40 నుంచి 50 నిమిషాల నిడివి కలిగిన ప్రదర్శనలను రూపొందుకుని ప్రదర్శించడం మొదలుపెట్టాను" అంటూ తన ప్రస్థానాన్ని వివరించిన రతి, ప్రత్యేక అవసరతలు కలిగిన వారికి టిక్కెట్ రుసుములో ప్రత్యేక రాయితీ కూడా అందిస్తూ ఉంటుంది. ఇప్పటివరకూ తాను వెయ్యి తోలుబొమ్మలాటలను ప్రదర్శించాననీ, ఈ కళ ద్వారా తన మనోభావాలను వ్యక్తం చేయగలగడంతో పాటు వర్ణ, లింగ వ్యవక్షల పట్ల చైతన్యం తీసుకురాగలిగాననీ అంటోంది రతి.

అత్తర్లు రాసుకుందాం

మానసిక ఆనందం కోసం సువాసన భరితమైన పరిమళ ద్రవ్యాలను శరీరానికి రాసుకోవాలని ఆయుర్వేదం చెబుతోంది. ప్రతిరోజూ ఉదయం వృత్తి సంబంధిత పనులు ప్రారంభించే ముందు... అలాగే రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు కూడా అత్తర్లు రాసుకోవడం భారతీయ సంప్రదాయం. ఇది వ్యక్తిగత శ్రద్ధకు నిదర్శనం. నలుగురిలో ప్రత్యేకంగా నిలిపేందుకు, వ్యక్తిత్వాన్ని అంచనా వేసేందుకు అత్తర్ల సువాసనలు కొలమానంగా పని చేస్తాయి. ప్రకృతిలో సహజంగా దొరికే పూలు, మూలికలు, సుగంధ ద్రవ్యాల నుంచి తయారు చేసిన అత్తర్లు రాసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

ఒత్తిడిని తగ్గిస్తూ...

● తేలికపాటి సువాసన గల అత్తర్లు రాసుకోవడం వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ జాతి సువాసన గల అత్తర్లని చేతి మణికట్టుమీద రాసుకుంటే రోజంతా మనసు ఉత్సాహభరితంగా ఉంటుంది. మెదడు ఉత్తేజితం అవుతుంది. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఈ అత్తర్లు ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటాయి. వేసుకున్న బట్టల మీద వీటిని కొద్దిగా రాసినా కూడా రోజంతా సువాసన నిలిచి ఉంటుంది.



ఆందోళన లేకుండా...

● మల్లె, గులాబీ, చమేలీ వంటి పూల పరిమళాలతో ఉన్న అత్తర్లు రాసుకోవడం వల్ల ఆందోళన తగ్గి మనసు ప్రశాంతంగా మారుతుంది. వీటిని మహిళలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చేతులమీద, మెడమీద, బట్టలమీద కొద్దిగా రాసుకుంటే రోజంతా తాజా అనుభూతితో ఉండవచ్చు. విసుగు, కోపం, చిరాకు, అలసట వంటి భావనలు దరిచేరవు. ఎలాంటి పరిస్థితులలోనైనా ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుంది.

మానసిక స్పష్టత కోసం...

● తులసి, వట్టివేళ్లు, సాంబ్రాణి వాసనలతో ఉన్న అత్తర్లు ఎదుటివారిని ఆకర్షిస్తాయి. వీటిని ఏదైనా సమావేశానికి హాజరయ్యేముందు రాసుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మనసులోని భావాలను సూటిగా స్పష్టంగా చెప్పగలమనే ధీమా వస్తుంది. సంభాషణలను పొడిగించేలా ఈ సువాసనలు మెదడుని ప్రభావితం చేస్తాయి. మనసులో సంతోషం, ముఖంలో మెరుపు ప్రకటితమవుతాయి.

విశ్రాంతి కోసం...



● రోజంతా ఎన్నో పనులతో శారీరకంగా మానసికంగా అలసిపోతుంటాం. రాత్రి పడుకునేముందు లావెండర్, గంధం చెక్క, కుంకుమ పువ్వు సువాసనలు గల అత్తర్లను మెడమీద రాసుకుంటే వెంటనే నిద్ర పడుతుంది. ప్రకృతి సహజంగా ఉండే ఈ సువాసనల వల్ల శరీరానికి అలసట తీరుతుంది. మెదడు కూడా విశ్రాంతి పొందుతుంది. సానుకూల దృక్పథం పెరుగుతుంది. గెలిచి తీరాలన్న పట్టుదల పెరుగుతుంది.

అందమైన అతిథుల్లా కనిపించాలంటే...

వేడుకలకు అతిథిగా హాజరయ్యే సమయంలో మేకప్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. అటు ఎబ్బెట్టుగా ఉండకుండా, ఇటు పేలవంగా ఉండకుండా తగు మాత్రం ఆకర్షణీయంగా కనిపించేలా మేకప్ చేసుకోవాలి.

సన్‌స్ర్కీన్: మేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్ర్కీన్‌లను అప్లై చేసుకోవాలి. ఈ రెండింటితో చర్మం పొడిబారకుండా ఉండడంతో పాటు, వేడుకల్లో లైట్ల వెలుగుకు కమిలిపోకుండా చర్మానికి రక్షణ దక్కుతుంది.

రెండు ఫౌండేషన్లు: వేడుకల్లో తీసే ఫొటోల్లో ముఖం అవసరానికి మించి వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు వేసుకోవాలి. ఇందుకోసం మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ రకాలకు చెందిన ఫౌండేషన్లను కలిపి వేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖం మొత్తం డ్యూయీ ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. తర్వాత పౌడర్ అద్దుకోవాలి.



బ్లష్ కీలకం: పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా, సహజసిద్ధంగా కనిపించే లేదా గులాబీరంగు బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా: అందరి చూపులూ ముఖం మొత్తంలో కళ్లూ, పెదవుల మీదే ఉంటాయి. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలనే ఎంచుకోవాలి. ముడతలు పడకుండా ఉండడం కోసం క్రీమ్‌కు బదులుగా పౌడర్ రూపంలోని ఐ షాడోలనే ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసిపోయి, ఎక్కువ సమయం పాటు నిలిచి ఉంటాయి.

లవ్లీ లిప్‌స్టిక్: ఎరుపు, ప్లమ్, మెరూన్ మొదలైన రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు నప్పే లిప్‌స్టిక్ ఎంచుకోవడం మర్చిపోకూడదు. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటి వేడుకలకు సూటవుతాయి. మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు బాగుంటాయి.

ఈఎన్సీ(ఓ అండ్ ఎం)గా విజయభాస్కర్‌రెడ్డి!

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలోని ఈఎన్సీ(ఓ అండ్ ఎం)గా జి.విజయభాస్కర్ రెడ్డిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం నాగర్‌కర్నూలు చీఫ్ ఇంజనీర్(సీఈ)గా పనిచేస్తున్న ఆయనకు ఈఎన్సీ(ఓ అండ్ ఎం)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈఎన్సీ(ఓ అండ్ ఎం)గా పనిచేస్తున్న బి.నాగేంద్రరావు పదవీ కాలం నవంబరు 30వ తేదీతో ముగిసింది. అయితే అర్నెల్ల కిందటే ఆయన పదవీ విరమణ చేశారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో బి.నాగేంద్రరావు అవసరం ఉందని గుర్తించి సర్వీసును పొడిగించింది. ఈ క్రమంలో ఆయన సర్వీసును మళ్లీ పొడిగిస్తారని ప్రచారం జరగ్గా ఉద్యోగ సంఘాలన్నీ మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ నిరసన తెలిపాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి విజయభాస్కర్ రెడ్డి నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

దూర ప్రాంత ప్రయాణికులకు పికప్ వ్యాన్లు:ఆర్టీసీ

రాజధాని శివారు ఈసీఐఎల్.. ఎల్బీనగర్‌ల మధ్య నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు పికప్ వ్యాన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ(టీజీఎస్ఆర్టీసీ) అధికారులు తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, కందుకూరు రూట్‌లలో వెళ్లే ప్రయాణికుల కోసం ఈసీఐఎల్, కాప్రా మునిసిపల్ కాంప్లెక్స్, మౌలాలిహెచ్‌బీ కాలనీ, మల్లాపూర్ బస్‌స్టాప్, హెచ్ఎంటీనగర్, నాచారం బస్‌స్టాప్, హబ్సిగూడ బస్‌స్టాప్, ఉప్పల్ మెట్రో స్టేషన్, నాగోలు, సుప్రజా హాస్పిటల్, ఎల్బీనగర్ ఎల్పీ మార్కెట్‌ల నుంచి పికప్ వ్యాన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్‌లో (నెంబర్లు) 04069440000, 04023450033 సంప్రదించాలని సూచించారు.

డీఎస్ చౌహాన్‌కు కేంద్ర ప్రభుత్వ అవార్డు



కేంద్ర మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న చౌహాన్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాలశాఖలో సంస్కరణలు చేపట్టి ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరిచినందుకు కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కేంద్ర ప్రభుత్వ అవార్డు వరించింది. కేంద్ర ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం ఢిల్లీలో చౌహాన్‌కు ఈ అవార్డును అందజేశారు. సరఫరాగొలుసు నిర్వహణలో పారదర్శకత, నాణ్యత ప్రమాణాలు పాటించటం, జవాబుదారీతనం, ఆధునిక పద్ధతులు అవలంబించటంతో పాటు జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తున్నందుకే ఈ అవార్డు దక్కిందని చౌహాన్ తెలిపారు.

ఈపీసీ కాంట్రాక్టరు ఎంపిక కోసం టెండర్లు:కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ ఈపీసీ కాంట్రాక్టరు ఎంపిక కోసం టెండర్లు జారీ చేయనున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం రాజ్యసభలో తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి గోయల్ సమాధానమిచ్చారు. కారిడార్ నిర్మాణ పనుల కోసం ఈపీసీ కాంట్రాక్టరును ఎంపిక చేసిన నాటి నుంచి 36-48 నెలల్లో కారిడార్ పూర్తవుతుందని చెప్పారు.



షోరూమ్‌ని ప్రారంభిస్తున్న నటి శ్రీలీల

రామచంద్రాపురంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్

» ప్రారంభించిన నటి శ్రీలీల

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురంలోని బీహెచ్ఈఎల్ సాయినగర్ కాలనీలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారి 37వ షోరూమ్‌ను నటి శ్రీలీల ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్ సురేష్ శీర్ణ మాట్లాడుతూ రామచంద్రాపురం వాసులు కోరుకునే నాణ్యతకు, నవ్యత్వానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. సంస్థ డైరెక్టర్ అభిమాన్యు మాట్లాడుతూ పండుగలకు, భారతీయ సంప్రదాయ కలెక్షన్లకు తమ షోరూమ్ కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు రాకేశ్, కేశవ్ కూడా మాట్లాడారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణి

అనూహ్యంగా నియామకం.. శుక్రవారం సర్కారు ఉత్తర్వులు.. గతంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా సేవలు

» న్యాయ సలహా తీసుకున్నాకే చక్రపాణి నియామకం?

» జేఎన్టీయూ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా బాలకిష్టారెడ్డి నియామకం



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణి నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. జేఎన్టీయూ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇటీవలే వీసీలను నియమించిన విషయం తెలిసిందే. అయితే, వివిధ కారణాలతో అంబేడ్కర్, జేఎన్టీయూ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయు) వీసీల నియామకాలు నిలిచిపోయాయి. తాజాగా అంబేడ్కర్ వర్సిటీకి వీసీని నియమించారు. కాగా, గతంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్‌గా పనిచేసిన ఘంటా చక్రపాణిని అంబేడ్కర్ వర్సిటీ వీసీగా నియమించే విషయంలో ప్రభుత్వం న్యాయసలహా తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా అయితే.. వీసీ పదవి చేపట్టాలంటే ప్రొఫెసర్‌గా కనీసం 10 ఏళ్ల అనుభవం ఉండాలి. కానీ, చక్రపాణికి 8 ఏళ్ల అనుభవం మాత్రమే ఉంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా పనిచేసి రిటైర్ అయిన వాళ్లని ప్రభుత్వ పోస్టుల్లో నియమించరాదన్న నిబంధనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన నియామకం ఆలస్యమైందని, న్యాయ సలహా తీసుకున్న తర్వాతే చక్రపాణి నియామకం ఫైల్‌ను గవర్నర్ ఆమోదానికి పంపించారని తెలిసింది. అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా మొదట్లో చక్రపాణి పేరు ప్రభుత్వం దృష్టిలో లేదని, సామాజిక సమీకరణలు, రాజకీయ కోణాల్లో ఆయన పేరు తెరపైకి వచ్చిందని సమాచారం. మరోవైపు, జేఎన్టీయూ వర్సిటీకి వీసీల ఎంపిక కోసం సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన ముగ్గురిని కాదని ప్రభుత్వం బాలకిష్టారెడ్డిని నియమించడం గమనార్హం. జేఎన్టీయూ వర్సిటీ వీసీ నియామకానికి త్వరలో మరో సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ఆటుపోట్లున్నా.. అభివృద్ధి దిశగా!

ప్రగతి బాటలో రేవంత్ సర్కారు ఏడాది పాలన .. తొలి ఏడాదే రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు



(హైదరాబాద్, ఆంధ్రజ్యోతి)

ఏడాదికి ముందు.. అతలాకుతలంగా, అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ. రాష్ట్ర రాబడులు నిర్దేశిత వ్యయాలకే సరిపోయే పరిస్థితి. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కనిపించని దుస్థితి. నిరాశాజనకంగా రెవెన్యూ, విద్య, వైద్యం, సాగునీరు తదితర రంగాలు. ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలందక తీవ్ర నిరాశా నిస్పృహలు. దళితుల దరి చేరని దళిత బంధు. అతీగతీ లేని గిరిజన బంధు, బీసీ బంధు. ఇలా.. బీఆర్ఎస్ హయాంలో పలు వర్గాల్లో ఆందోళన. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కుటుంబ పెత్తనం పెరిగిపోయాయన్న ఆరోపణలు. ఇలాంటి సందిగ్ధావస్థ, సవాళ్ల నడుమ సరిగ్గా 2023 డిసెంబరు 7న అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ డిసెంబరు 7తో ఏడాది కాలం పూర్తవుతోంది. ఈ ఏడాది కాలంలో రేవంత్‌రెడ్డి సర్కారు అనేక ఆటుపోట్లు, ఆటంకాలు, సవాళ్లను ఎదుర్కొంది. అయినా.. వాటి మధ్యే అభివృద్ధి దిశగా పయనించింది. కొన్ని లోపాలు చోటుచేసుకున్నా.. మొత్తంగా ఏడాది పాలన పర్వాలేదనిపించింది. అయితే.. ఈ ఏడాదిలో ఎదురైన సమస్యలు, అనుభవాలతో రాబోయే కాలంలో మెరుగైన పాలన అందించాలన్న అభిప్రాయాలున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సమర్థులు, సీనియర్లను తన మంత్రివర్గ సహచరులుగా ఎంపిక చేసుకుని, రాష్ట్రంలో పాలనను మొదలు పెట్టారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ, పార్టీ ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ, సంక్షేమ పాలనను అందిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలాన్ని పూర్తి చేసుకుంది.

సొంత ముద్ర.. సరికొత్త ప్రాజెక్టులు

గత ముఖ్యమంత్రుల మాదిరిగానే తన మార్కు అభివృద్ధి కూడా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. గతంలో చంద్రబాబునాయుడు హైటెక్ సిటీని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రింగు రోడ్డును నిర్మించినట్లుగానే.. అభివృద్ధిలో సొంత ముద్ర ఉండాలని రేవంత్ యోచించారు. అందులో భాగంగానే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ఫోర్త్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు వంటి మూడు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టారు. మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవం లక్ష్యంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు.. మొత్తం హైదరాబాద్ నగరానికి కొత్త కళను తీసుకొస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టుతో పర్యావరణ పరంగానే కాకుండా.. ఆర్థిక, ఉపాధి, ఉద్యోగాల పరంగా కొత్త అవకాశాలు తీసుకొచ్చేలా చేయాలన్న సంకల్పంతో ఉంది. త్వరలో ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించనుంది. ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు.. ఫోర్త్ సిటీ. 40 వేల ఎకరాల పరిధిలో అద్భుతమైన సరికొత్త నగరాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారు. ఇప్పటికే ఇక్కడ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని, జీనోమ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. స్కిల్ యూనివర్సిటీని రూ.200 కోట్లతో నిర్మించడానికి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(మెయిల్) సంస్థ ముందుకు రావడమే కాకుండా.. ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేసింది. ఇవి కాకుండా రీజినల్ రింగ్ రోడ్డును కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. వీటితోపాటు హైదరాబాద్‌లో మెట్రోను మరో దశ చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. సుమారు 72 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించనున్నారు.

సమీకృత గురుకులాలు..

ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వేర్వేరుగా ఉన్న గురుకుల పాఠశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. వీటన్నింటినీ ఒకే ప్రాంగణంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పేరిట ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మించనుంది. మరోవైపు సాగునీటి రంగంలో ఏడాది కాలంలోనే రూ.10 వేల కోట్ల వరకు వ్యయం చేసింది. ఇక ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో కొన్నింటిని ప్రభుత్వం అమలు చేసి చూపించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, బియ్యం సబ్సిడీ, ఉపకార వేతనాలు, డైట్ చార్జీల పెంపు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలన్నింటికీ రూ.61,194 కోట్లను వ్యయం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి నవంబరు నాటికే దాదాపు రూ.9,888 కోట్లను ఖర్చు చేయడం గమనార్హం. రుణమాఫీ పథకాన్ని కూడా తొలి ఏడాదే భుజానికెత్తుకుంది. నిధుల సర్దుబాటు సమస్య అత్యంత తీవ్రంగా ఉన్నా.. ఒక్క రుణమాఫీ పథకం కిందే రూ.20,616 కోట్లను వెచ్చించింది. సంక్రాంతి పండుగ నుంచి రైతు భరోసాను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

ఏడాదిలో 55,143 ఉద్యోగాల భర్తీ

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్‌లైన్‌తో కొనసాగిన తెలంగాణ ఉద్యమాన్ని మరోసారి మననం చేసుకుంటూ ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏడాది కాలంలో ఏకంగా 55,143 ఉద్యోగాలను భర్తీ చేసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 12,324 పోస్టులు, మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా 7,378 పోస్టులు, తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీజీపీఆర్‌బీ) ద్వారా 16,067 పోస్టులు, తెలంగాణ రెసిడెన్షియల్ అండ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ద్వారా 8,304 పోస్టులు, పాఠశాల విద్యా శాఖ ద్వారా 10,006 పోస్టులు, ఇతర సంస్థల ద్వారా 441 పోస్టులను భర్తీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెలువడిన కొన్ని నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలతోపాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన నోటిఫికేషన్లతో మరికొన్ని ఉద్యోగాలను భర్తీ చేసింది. 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు, 22 వేల మంది ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలను చేపట్టి, భేష్ అనిపించుకుంది.

దూకుడుతో సమస్య!

ప్రభుత్వ పాలన ఏడాదికాలం సాఫీగా సాగినా.. దూకుడు వ్యవహారమే కాస్త ఇబ్బందులు సృష్టిస్తోందనే అభిప్రాయం ఉంది. పథకాలు, కార్యక్రమాలను అమలు చేయడంలో బాగంగా కొన్ని ఆటంకాలు ఎదురవడం సహజం. కానీ, వాటిని ముందస్తు ప్రణాళిక ప్రకారం అమలు చేయాలి. చేసే పని మంచిదే అయినా.. దానికి ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా కూడగట్టడం అత్యంత ప్రధానం. ఉదాహరణకు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు విషయంలోనే ప్రభుత్వం తొలుత కాస్త బోల్తా పడింది. నదీ గర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని, ఏళ్ల తరబడి ఉంటున్న నిర్వాసితులను ముందుగా ఒప్పించకుండా, వారికి భరోసా కల్పించకుండా ముందుకెళ్లింది. దీంతో నిర్వాసితులు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆ తర్వాత విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లింది. నల్లగొండ జిల్లాలో రైతులతో భారీఎత్తున పాదయాత్ర నిర్వహించింది. పర్యావరణవేత్తలు కూడా మూసీకి మద్దతు పలికారు. మరోవైపు హైడ్రా విషయంలోనూ ఇలాంటి అపవాదునే ఎదుర్కొంది. ఆ తర్వాత ఈ వ్యవహారాన్ని కూడా సరిదిద్దుకుంది. ఇక లగచర్లలో ఫార్మా విలేజ్ కోసం ఇటీవల భూసేకరణ చేపడితే కలెక్టర్, ఇతర అధికారులపై స్థానికులు దాడికి దిగడం సంచలనం రేపింది. దాంతో సీఎం రేవంత్‌రెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అక్కడ ఫార్మా విలేజ్ కాదని, ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు స్థానికులు కాస్త చల్లబడ్డారు. ఇలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టే బదులు.. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏ వర్గానికీ ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పథకాలు చేపట్టాలన్న అభిప్రాయాలున్నాయి.

మాంద్యంతోపాటు హైడ్రా దెబ్బ

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కాస్త మందగించింది. అయితే ఇది హైదరాబాద్ ఒక్క నగరంలోనే జరిగింది కాదు. ఆర్థిక మాంద్యం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉందని ప్రభుత్వం పేర్కొంటోంది. ఇది కొంతవరకు వాస్తవమే కూడా. కానీ, దీనికి హైడ్రా కూడా తోడైందన్న భావన నెలకొంది. భవన నిర్మాణ అనుమతులు ఆలస్యం అయ్యాయన్న ప్రచారం కూడా జరిగింది. అయితే వీటిపైనా ప్రభుత్వం కొన్ని సానుకూల చర్యలు చేపట్టింది. బిల్డ్ నౌ పేరుతో సరికొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అనుమతులను వేగవంతం చేస్తామని తెలిపింది. ఏదేమైనా రాష్ట్ర ఆదాయానికి హైదరాబాద్ సంపదే ప్రధాన వనరు. ఇక్కడి నుంచే అధిక రాబడి సమకూరుతుంది. అందులోనూ రియల్ ఎస్టేట్ రంగం లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఈ రంగం మళ్లీ పుంజుకునేలా చేస్తేనే రాష్ట్ర ఆదాయమూ పెరుగుతుందనేది నిపుణుల అంచనా.

రెండో ఏడాది అత్యంత కీలకం

మొదటి ఏడాదిలో తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులు, ఇతరత్రా కొన్ని అసంతృప్తులున్నా.. సంక్షేమం వైపు సాగిన ప్రభుత్వానికి రెండో ఏడాది అత్యంత కీలకంగా మారనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కీలక ప్రాజెక్టులను పట్టాలెక్కించాల్సి ఉంది. మూసీ నది ప్రక్షాళన, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు, ఫోర్త్‌సిటీ నిర్మాణం, మెట్రో విస్తరణ తదితరాలన్నీ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచడంతోపాటు రాష్ట్ర ప్రగతిని కూడా నిర్దేశించేవే. హైదరాబాద్‌కు పర్యావరణపరంగా, ఆర్థికపరంగా మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు ఉపకరిస్తుంది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుతో మొత్తం తెలంగాణలోనే దాదాపు సగం మంది జనాభా దీని పరిధిలోకి వచ్చేస్తారు. అంటే రాష్ట్రంలో సుమారు సగం ప్రాంతం ఈ రీజనల్ రింగ్‌రోడ్డుతో ప్రభావితమవుతుంది. ఫోర్త్‌సిటీ నిర్మాణం హైదరాబాద్ సిగలో మరో మణిహారం అయ్యే అవకాశాలుంటాయి. 72కిలోమీటర్ల మేర అదనంగా మెట్రో నిర్మాణం, హైదరాబాద్ అభివృద్ధి నగరాన్ని మరో స్థాయికి తీసుకెళ్తాయి. తొలి ఏడాది ఈ నాలుగు ప్రాజెక్టులు ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ భవిష్యత్తునే మార్చగల సత్తా ఉన్నవని అంచనా. రెండో ఏడాది వీటిని పట్టాలెక్కించాల్సి ఉంది. ఆ తర్వాతి సంవత్సరాల్లో అంతా సవ్యంగా సాగి ఎన్నికల నాటికి చేసిన వాటిని చూపించుకోగలిగితే సాధికారికంగా ఓట్లు అడిగే పరిస్థితి వస్తుంది.

నవ్య | చిత్రజ్యోతి

విజయవాడలో వేడుక


ఎన్టీయార్ నటించిన మొదటి చిత్రం 'మన దేశం' విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డిసెంబరు 14న విజయవాడలో వేడుక నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్ల గురించి చర్చించేందుకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి హైదరాబాద్



టీడీ జనార్దన్, నందమూరి రామకృష్ణ, భరత్ భూషణ్, ప్రసన్నకుమార్

కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇందులో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్, తెలుగు సినీ దర్శకుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటోతో రూమర్స్‌కు చెక్



అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ విడిపోతున్నారంటూ ఇటీవలి కాలంలో జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో వీరిద్దరూ కలసి దిగిన కొన్ని ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ పార్టీకి అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య కలసి హాజరయ్యారు. ఆ సందర్భంగా నటి ఆయేషా జుల్కా, వ్యాపారవేత్త అనురంజన్ వీరిద్దరితో కలసి తీసుకున్న సెల్ఫీలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ పిక్స్ కింద ఓ నెటిజన్.. 'ఒక్క ఫొటోతో రూమర్స్‌కు చెక్' అని కామెంట్ చేశారు. ఈ పార్టీలో క్రికెటర్ సచిన్ టెండూల్కర్, నటుడు తుషార్ కపూర్ కూడా తళుక్కుమన్నారు. కాగా, ఇటీవలే జరిగిన వారి కూతురు ఆద్యా పుట్టినరోజు వేడుకలో కూడా వీరిద్దరూ కలసి కనిపించిన సంగతి తెలిసిందే.



మల్లన్న సన్నిధిలో...

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను అక్కినేని నాగార్జున, నాగచైతన్య దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. నాగార్జున తన కుమారుడు నాగచైతన్య, కోడలు శోభితతో కలిసి ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా.. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు జరిపారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నాగార్జున, నాగచైతన్య దంపతులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీశైలం (ఆంధ్రజ్యోతి)

ఇంట్రడక్షన్ అదిరింది



గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్లపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'జాట్'. సన్నీడియోల్, రణదీప్ హుడా ప్రధాన తారాగణం. ఇప్పటికే ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌తో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. రెండు పాత్రల మధ్య సాగే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. వారిలో ఒకరు పోలీస్ ఆఫీసర్. విలన్ల చేతులు, కాళ్లను గొలుసులతో కట్టి ఉంచిన సన్నీ డియోల్ క్యారెక్టర్ ఇంటెన్స్ ఇంట్రడక్షన్‌ని ప్రజెంట్ చేస్తోంది. రణదీప్ హుడాను మెయిన్ విలన్‌గా పరిచయం చేశారు. దర్శకుడు గోపీచంద్ మలినేని మాస్-అప్పీలింగ్ యాక్షన్‌ని తీయడంలో అద్భుతమైన నైపుణ్యాలు ప్రదర్శించారు. ఈ చిత్రంలో వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

వింటేజ్ లుక్‌లో రామ్



హీరో రామ్ పోతినేని, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'రాపో 22' వర్కింగ్ టైటిల్. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమాలో రామ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ.. 'మీకు సుపరిచితుడు.. మీలో ఒకడు.. మీ సాగర్' అని దర్శకుడు మహేశ్‌బాబు పేర్కొన్నారు. ఇందులో రామ్ వింటేజ్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు.

క్రిటిక్స్ ఛాయిస్ అవార్డు..



సమంత, వరుణ్ ధావన్ నటించిన 'హనీ బన్నీ' వెబ్ సిరీస్ ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సంగతి తెలిసిందే. రస్సో బ్రదర్స్ దర్శకులుగా రూపొందిన 'సిటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. రాజ్ అండ్ డీకే దర్శకద్వయం తెరకెక్కించిన ఈ వెబ్ సిరీస్‌కు ఓ అరుదైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్ 30వ ఎడిషన్‌లో.. ఉత్తమ విదేశీ భాషా సిరీస్‌లలో ఒకటిగా 'హనీ బన్నీ' నామినేట్ అయ్యింది. వచ్చే ఏడాది జనవరి 12న ఈ అవార్డుల వేడుక యూఎస్‌లోని శాంట మోనికాలో జరగనుంది.

పీరియాడిక్ యాక్షన్ డ్రామా



హీరో సాయిదుర్గా తేజ్, నూతన దర్శకుడు రోహిత్. కేపీ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎస్‌డీటీ 18' వర్కింగ్ టైటిల్. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 12 సినిమా టైటిల్‌ను.. గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఇటీవలే సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించి 'ఇంట్రూడ్ ఇన్‌టూ ద వరల్డ్ ఆఫ్ ఆర్కాడీ' అనే వీడియోను విడుదల చేయగా.. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ఆయన పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మీ కథానాయిక. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియాగా ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నారు.

గౌరవంగా భావిస్తున్నా



కన్నడ నటుడు రిషబ్ శెట్టి, బాలీవుడ్ దర్శకుడు సందీప్ సింగ్ దర్శకత్వంలో 'ద ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహరాజ్' చిత్రంలో నటించనున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ హిస్టారికల్ డ్రామా టైటిల్‌ను.. ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 2027 జనవరి 21న సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు రిషబ్. "ఛత్రపతి జీవితం నన్నెప్పుడూ ఆశ్చర్యానికి గురిచేస్తుంటుంది. ఆయనో చారిత్రక యోధుడు.. నేషనల్ హీరో. ఆయన జీవిత కథలో భాగమవ్వటాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. ఈ తరహా బయోపిక్‌లలో నటించే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ సినిమా గురించి దర్శకుడు చెప్పగానే క్షణం కూడా ఆలోచించకుండా అంగీకరించా. ఎంతో వైవిధ్యంతో.. ఉన్నతమైన స్థాయిలో ఈ సినిమాను దర్శకుడు సందీప్ తెరకెక్కిస్తున్నారు" అని చెప్పారు.

గ్రూప్-1 రద్దు కుదరదు

పిటిషనర్లు ఎవరూ మెయిన్స్‌కు అర్హతే సాధించలేదు

30 వేల మందికి సంబంధించిన అంశమిది: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇది సుమారు 30 వేల మంది అభ్యర్థులకు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. గ్రూప్-1 రద్దు, మెయిన్స్ వాయిదా కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. సుప్రీం తీర్పుతో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు (టీజీపీఎస్సీ) భారీ ఊరట లభించినట్టయింది. గత ప్రభుత్వం 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చిన ప్పటికీ.. పరీక్ష పేపర్ల లీకేజీతో ఒకసారి, నిర్వహణ లోపంతో మరోసారి పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత నోటిఫికేషన్‌ను పక్కన పెట్టి కొత్త నోటిఫికేషన్ ఇవ్వగా.. అది చట్టవిరుద్ధమని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ గంగుల దామోదర్ రెడ్డి అనే వ్యక్తి సహా ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వారికి నిరాశ ఎదురైంది. దీంతో హైకోర్టు తీర్పును వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాది గురుకృష్ణకుమార్ వాదనలు వినిపించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొత్తప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టిందని తెలిపారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రిలిమ్స్‌లో 14 ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పరీక్ష తేదీలోనూ మార్పు చేశారని తెలిపారు. ప్రశ్నల్లో తప్పులపై టీజీపీఎస్సీ నియమించిన నిపుణుల కమిటీ రిపోర్టు సైతం సరిగా లేదని ఆరోపించారు. అందుకే, ప్రిలిమ్స్‌పై స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ రిపోర్టు వచ్చే దాకా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. హైకోర్టు మెరిట్స్‌లోకి వెళ్లకుండానే తమ పిటిషన్‌ను కొట్టివేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 29పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందని గుర్తు చేసింది. హైకోర్టు తీర్పు ప్రకారం గ్రూప్-1 ఉద్యోగాల నియామక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం.. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. కేవలం ఏడుగురు అభ్యర్థుల కోసం.. అది కూడా మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించని వారికోసం ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేయడం కుదరదని చెబుతూ, పిటిషన్‌ను కొట్టేసింది. కాగా.. గ్రూప్-1 వాయిదాకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమంటూ సుప్రీంకోర్టు ఈ ఏడాది అక్టోబరు 21న కూడా తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లో ఉండగా స్టే ఎలా ఇస్తామని నాడు ధర్మాసనం ప్రశ్నించింది. ఇప్పుడు ఈ తీర్పుతో.. గ్రూప్-1 ఫలితాల వెల్లడికి అడ్డంకులు పూర్తిగా తొలగినట్టయింది. ఈనేపథ్యంలో.. వీలైతే జనవరి నెలాఖరులోగా ఫలితాలను ప్రకటించి, ఫిబ్రవరిలోగా నియామకాలను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఆరు కాదు.. 160!

గ్యారంటీలను మించి ప్రజోపయోగ పనులు.. నిత్యం సీఎం రేవంత్ సమీక్షలు, సమావేశాలు

- సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- పదేళ్ల విధ్వంస ఆనవాళ్లను చెరిపివేశాం
- ఏడాదిలోనే మార్పు.. సీఎంవో వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక తొలి ఏడాదిలోనే మార్పు మొదలైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రమే కాకుండా 160 అంశాల్లో ప్రజోపయోగ పనులు చేపట్టినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని, సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపిందని పేర్కొంది. అధికారం చేపట్టినప్పటి తొలిరోజు నుంచే సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో తెలంగాణ సమ్మిళిత అభివృద్ధికి నిరంతరం సమీక్షలు.. సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొంది. ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు గత ఏడాది డిసెంబరు నుంచి ప్రభుత్వం చేపట్టిన 160 ప్రజోపయోగ పనుల్లో ముఖ్యమైన వాటిని సీఎంవో వెల్లడించింది. పదేళ్ల విధ్వంసపు ఆనవాళ్లను చెరిపేసి తెలంగాణ పునర్ వైభవాన్ని కొనసాగిస్తూనే.. సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించింది. తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా, హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు సీఎం రేవంత్ చేసిన ప్రయత్నాలు..తొలి ఏడాదిలోనే సత్ఫలితాలు ఇచ్చినట్లు వివరించింది. "తొలి ఏడాదే 55,143 ఉద్యోగాల భర్తీతో లక్షలాది మంది నిరుద్యోగుల ఆకాంక్షలను ప్రజాప్రభుత్వం నెరవేర్చింది. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ఫలితంగా తెలంగాణలో నిరుద్యోగ శాతం తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది వానాకాలం సీజన్ ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 67లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 153 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేశాం. ఐదేళ్లలో 30లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తెచ్చేలా పనులు ప్రారంభించాం" అని పేర్కొంది.

పేదల సంక్షేమం కోసం

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో రోజుకు సగటున 30లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారికి రూ.1500 కోట్ల ఆదా చేయగలిగామని సీఎంవో వెల్లడించింది. మహిళలకు వడ్డీలేని రుణాల పునరుద్ధరణ. రుణ బీమాతోపాటు సంఘం సభ్యురాలికి రూ.10లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంతో 40లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొంది. "గృహజ్యోతి పథకం కింద అరకోటి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇళ్ల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్‌ను ప్రారంభించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం. కొత్త ఆర్వోఆర్ ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణను ఇప్పటికే పూర్తి చేశాం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించి... కొత్త చట్టం తీసుకొస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేశాం. మహిళాశక్తి సంఘాల ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాం. గతంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లలో అవకతవకలపై విచారణకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేశాం. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతోపాటు ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ఈహెచ్‌ఎస్ పథకంలో మార్పులు చేశాం. ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతోపాటు 557కారుణ్య నియామకాలు చేపట్టాం" అని వెల్లడించింది.

విద్య, వైద్య రంగాల్లో..

రాష్ట్రంలో కొత్తగా 8 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 17నర్సింగ్, 28 పారా మెడికల్ కళాశాలల ఏర్పాటు చేసినట్లు సీఎంవో తెలిపింది. "రూ.2వేల కోట్లతో గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి శంకుస్థాపన చేశాం. ఆరోగ్య శాఖలో 7 వేలకు పైగా పోస్టులను ఇప్పటికే భర్తీ చేయగా.. కొత్తగా 9300 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.667.25కోట్లు కేటాయించగా, అమ్మ ఆదర్శ కమిటీల సారథ్యంలో పనులు కొనసాగుతున్నాయి. హాస్టళ్లలోని 7.65 లక్షల మంది విద్యార్థులకు డైట్ చార్జీలను 40 శాతం పెంచాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుపై దృష్టి పెట్టాం" అని వివరించింది.

వివిధ రంగాల్లో అభివృద్ధి పనులు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10కోట్ల దాకా ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించినట్లు సీఎంవో తెలిపింది. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి రూ.3,046 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పింది. "హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటు చేశాం. గోదావరి జలాలతో మూసీ పునరుజ్జీవం దిశగా అడుగులు వేస్తున్నాం. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. రూ.24,237 కోట్లతో 76.4కిలోమీటర్ల మేర మెట్రో రైలు విస్తరణ చేపట్టాలని నిర్ణయించాం. హైకోర్టు నూతన భవనానికి బుద్వేల్‌లో 100ఎకరాల స్థలం కేటాయించాం. రీజనల్ రింగ్ రోడ్డునుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. హైదరాబాద్ శివారులోని కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణాన్ని ఇటీవలే ప్రారంభించాం. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా రాష్ట్రంలో రూ.40,232కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు అంగీకరించాయి. తద్వారా 30వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికా, దక్షిణకొరియాలో పర్యటించగా.. దాదాపు రూ.31502 కోట్ల మేర పెట్టుబడులు పెడతామంటూ పలు సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి" అని సీఎంవో పేర్కొంది.

బీఆర్‌ఎస్ నేతల గృహ నిర్బంధం

- ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నాం: హరీశ్‌రావు
- 8న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ

హైదరాబాద్/నార్సింగ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నేతల అరెస్టులను నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయమే బీఆర్‌ఎస్ నేతల ఇళ్ల వద్దకు చేరుకుని వారిని హౌస్ అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత ఇళ్ల వద్ద మోహరించి వారిని నిర్బంధంలో ఉంచారు. మాజీ మంత్రి తలసాని, పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కృష్ణారావు, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సంజయ్, పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులను హౌస్ అరెస్టు చేశారు. దీనిపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నామన్నారు. కాగా, ఈనెల 9 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సభకు హాజరవుతారా? లేదా అన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో 8న ఎర్రవెల్లిలో కేసీఆర్ సమావేశమవుతున్నారు. సభలో సర్కారును ఇరుకున పెట్టేందుకు ఏం చేయాలన్న దానిపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. ఈ భేటీ తర్వాతే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? రారా? అనేది వెల్లడయ్యే అవకాశమున్నట్లు సమాచారం.

మంత్రి సీతక్కపై అసభ్య పోస్టులు.. ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కను అవమానపరిచేలా, అసభ్యకరమైన పోస్టులు పెట్టి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన ఇద్దరు నిందితలును సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారాసిగూడకు చెందిన తొడుపునూరి విజయ్ భానుప్రసాద్, హన్మకొండకు చెందిన గాదె ప్రకాశ్‌లు మంత్రి సీతక్క ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టులు పెడుతూ ట్రోల్స్ చేస్తున్నారంటూ ఆమె వ్యక్తిగత సిబ్బంది ఫిర్యాదు చేయడంతో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన డీసీపీ కవిత నేతృత్వంలోనిబృందం... సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నా భర్త మృతదేహంపై తూటా గాయాల్లేవు

- చిత్రహింసలు పెట్టి చంపేశారు: మల్లయ్య భార్య మీనా

ఏటూరునాగారం రూరల్, పాలకుర్తి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేత ఏగోలాపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహంపై ఒక్క తూటా గాయం కూడా లేదని ఆయన భార్య మీనా వెల్లడించారు. శుక్రవారం మల్లయ్య మృతదేహాన్ని ఆయన భార్య, బంధువులు పరిశీలించి స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. మావోయిస్టులను పోలీసులు విష ప్రయోగం ద్వారా బంధీలుగా చేసి, తల పగులకొట్టి చిత్రహింసలు పెట్టి అతి కిరాతకంగా చంపారని ఆరోపించారు. ఈనెల 1న ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మల్లయ్య సహా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. 2వ తేదీన ఫోరెన్సిక్స్ బృందం సమక్షంలో ఆ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆరు మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. అయితే తన భర్తను పోలీసులు హింసించి చంపారని మీనా ఈనెల 2న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాంతో మల్లయ్య మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరచాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలతో శుక్రవారం మల్లయ్య మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పెద్దపల్లి జిల్లాలోని రాణాపురంలో మల్లయ్య అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు.

నాలుగు జిల్లాల్లోనే 2,000 ఎకరాలు మింగేశారు!

హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ పరిధిలో భారీగా ప్రభుత్వ భూముల్ని కాజేసిన గత పాలకులు

- రాయదుర్గంలో రూ.వందల కోట్ల విలువైన 8.29 ఎకరాలు కొట్టేశారు
- సిద్దిపేట జిల్లాలో 380 ఎకరాల స్వాహా
- ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధరణి ముసుగులో గత పాలకులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎకరా రూ.వంద కోట్ల విలువ చేసే భూములను బొక్కేశారని.. కొత్త రెవెన్యూ చట్టం ఆమోదం పొందిన తర్వాత వారి ఖాతాలో వేసుకున్న భూముల వివరాలను సర్వే నంబర్ల వారీగా ప్రజల ముందు పెడతామని తెలిపారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పొంగులేటి పలు విషయాలను వెల్లడించారు. జీవో 59 ముసుగులో బీఆర్‌ఎస్ పాలకులు రూ.వందల కోట్ల విలువైన భూములను విఎంగేశారని ఆరోపించారు. ఒక్క రాయదుర్గంలోనే 8.29 ఎకరాలను తమ తొత్తుల పేరుతో మార్చుకున్నారని, అలాగే హైదరాబాద్‌లో మరోచోట (ఇక్కడ ఎకరం రూ.80-100కోట్లు ఉంటుంది) 19 ఎకరాలను స్వాహా చేశారని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే సుమారు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములను తమ బినామీల పేరుతో మార్చుకున్నారని, ఆ వివరాలన్నీ సేకరించామని పొంగులేటి చెప్పారు. ఈ భూములన్నింటినీ ఇటీవల మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టామన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు సమీపంలో పేదలకు ఇచ్చిన భూములను కూడా వదల్లేదని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో ఓ నాయకుడు 380 ఎకరాల ప్రభుత్వ భూమిని తన బినామీల పేరుతో బదలాయించుకుని, దాన్ని పలు సంస్థలకు విక్రయించారని తెలిపారు. భూ ఆక్రమణలు, రైతుల సమస్యల మీద ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు మళ్లీ ట్రైబ్యునల్ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని మంత్రి చెప్పారు. అలాగే ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు కొత్త ఆర్వోఆర్ చట్టంలో కొన్ని మార్పులు చేశామన్నారు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించేందుకు వెసులబాటు కల్పిస్తున్నామన్నారు. ధరణి పార్ట్-బిలో ఉన్న 15 లక్షల ఎకరాలకు పరిష్కారం చూపబోతున్నామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ భూములన్నీ స్వాహా అయ్యేవన్నారు. గతంలో తొలగించిన వారి నుంచి గ్రామ రెవెన్యూ సిబ్బందిని ఎంపిక చేస్తామని, దీనిపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందని, 987 మంది అవసరమైతే 238 మందే పని చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ వ్యవస్థను కూడా ప్రక్షాళన చేసి, గతంలో తొలగించిన వీఆర్‌వోల నుంచే సర్వేకు అవసరమైన వారిని తీసుకుంటామని తెలిపారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థలో పని చేసేందుకు కొత్త నియామకాలు చేపట్టేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ధరణిలో గత 45 రోజుల్లో వచ్చిన 65 వేల దరఖాస్తులే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాంకేతిక సమస్యలను అధిగమించే వరకు పాత ఏజెన్సీ సహకారం తీసుకుంటామని చెప్పారు.

హౌసింగ్ బోర్డు బకాయిలు వసూలు చేస్తాం

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు రూపొందించిన యాప్‌లో ఆరు ప్రశ్నలే ఉంటాయని, అవి కూడా అర్హులను తేల్చడం కోసం అడిగేవేనని పొంగులేటి చెప్పారు. ఎవరైనా ఒంటరి పురుషులు ఉంటే వారికి కూడా ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. పథకం మంజూరుపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అర్హులందరికీ కచ్చితంగా పథకం అందుతుందని చెప్పారు. హౌసింగ్ బోర్డు బకాయిల వసూళ్లలో కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు సంస్థలకు నోటీసులివ్వడంతో పాటు స్థలాలను కూడా అధీనంలోకి తీసుకున్నామన్నారు. నిజాయితీగా పని చేసే అధికారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని పొంగులేటి చెప్పారు. ప్రభుత్వ అధికారులపై కొన్ని రాజకీయ పార్టీలు హత్యాయత్నం చేయిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కూడా తప్పు చేయకపోతే ఎవరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. బాంబులు అంటే అరెస్టులు చేయడం, లాఠీ దెబ్బలు కొట్టడం కాదని.. వారి తప్పులను ప్రజలకు చూపించడమేనని చెప్పారు.

ఎల్లలు దాటుతున్న 'పేదల బియ్యం'!

తెలంగాణ నుంచి కాకినాడకు అక్రమ రవాణా.. దళారుల నుంచి కొనుగోలు చేస్తున్న రైస్‌మిల్లర్లు

సిద్దిపేటలోని రైస్ మిల్లు యజమానిపై ఏపీలో కేసు.. విచారణలో మరో ఇద్దరి పేర్లూ వెలుగులోకి..

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల బియ్యం ఎల్లలు దాటిపోతోంది. రైస్‌మిల్లర్లు, దళారులు కలిసి ప్రజాపంపిణీ పథకం బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గోదాముల నిర్వాహకులతో కుమ్మక్కై దందా చేసిన మిల్లర్లు... ఇప్పుడు దళారుల నుంచి నేరుగా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. అనుమానం రాకుండా ఆ బియ్యాన్ని మళ్లీ పాలీష్ చేసి.. కొత్తబస్తాల్లో నింపి అక్రమంగా ఎగుమతి చేస్తున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో తెలంగాణ పీడీఎస్ బియ్యం పట్టుబడటంతో ఈ దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలోని ఓ రైస్ మిల్లుపై ఏపీ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో కరీంనగర్, బోధన్‌కు చెందిన వ్యాపారుల పేర్లూ బయటకు వచ్చినట్లు తెలిసింది.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత కార్డులు కలిగిన వినియోగదారులకు 1.80 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందజేస్తున్నారు. ఇందులో 50 శాతానికి పైగా బియ్యం నల్ల బజారుకు తరలివెళ్తోందన్న అంచనాలున్నాయి. ఆయా శాఖల అధికారులను దళారులు మచ్చిక చేసుకొని.. యథేచ్ఛగా బియ్యం దందా సాగిస్తున్నారు. గ్రామాలు, పట్టణ వీధుల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కిలోకు రూ.15-16 చొప్పున వినియోగదారులు లేదా డీలర్లకు చెల్లిస్తున్నారు. కమీషన్ రూపేణా రూ.6 -7 దాకా ఆటోవాలాలు, కొరియర్లు తీసుకుంటుండగా.. ఇతరత్రా ఖర్చులు కలిపి రైస్ మిల్లులకు చేరేసరికి కిలో రూ.25 అవుతోంది. ఆ బియ్యానికి మళ్లీ పాలీష్ చేసి.. కొత్త బస్తాల్లో నింపి ఎగుమతి చేస్తున్నారు. మొత్తంగా ఈ బియ్యం కాకినాడ ఓడరేవుకు చేరే సరికి క్వింటాలుకు రూ.3వేల ఖర్చు వస్తుండగా.. అక్కడ రూ.3,500 వరకూ పలుకుతోంది. ఈ లెక్కన ఒక ఏసీకే (290 క్వింటాళ్ల కంటెయినర్) బియ్యం కాకినాడ ఓడరేవులో విక్రయిస్తే.. రూ.1.50లక్షల దాకా గిట్టుబాటు అవుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుండటంతో...మిల్లర్లు ఈ దందాకు మొగ్గు చూపుతున్నారు.

కాకినాడలో పట్టుబడ్డ తెలంగాణ బియ్యం

ఏపీ పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్‌కు అందిన సమాచారం మేరకు కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు వద్ద నవంబరు 26న తనిఖీలు నిర్వహించగా.. ఒక లారీలో తెలంగాణకు చెందిన 35 టన్నుల (700 బస్తాలు) పీడీఎస్ బియ్యం దొరికాయి. విచారణలో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం భూంపల్లి శివారులో ఉన్న మణికంఠ రైస్‌మిల్లు నుంచి పీడీఎస్ బియ్యం వెళ్లినట్లు తేలింది. ఈ మేరకు ఆ రైస్‌మిల్లు యజమానిపై ఈనెల 1వ తేదీన కాకినాడ జిల్లాలోని కరప పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, తాళ్లరేవు స్టేషన్ పరిధిలో గత జూలై 17న కరీంనగర్ జిల్లా నుంచి తరలుతున్న 30టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శ్రీనివాస గౌడ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కాగా, సిద్దిపేటతో పాటు కరీంనగర్, బోధన్, నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఈ దందాకు పాల్పడుతున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలకు సమాచారం అందినట్లు తెలిసింది. తాజాగా కాకినాడలో తెలంగాణ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో దళారులు, వ్యాపారుల దందాపై అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది.

చపాట మిర్చికి జీఐ ట్యాగ్

» తక్కువ కారం, ఎర్రటి రంగు ఈ రకం ప్రత్యేకత

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాత్రమే పండిస్తున్న చపాట మిర్చి అరుదైన ఖ్యాతిని సాధించింది. ఎర్రటి రంగుతోపాటు తక్కువ మోతాదులో కారం ఉండే ఈ రకం మిరప.. తాజాగా జీఐ (జియోగ్రాఫిక్ ఇండికేషన్) ట్యాగ్‌ను సాధించింది. చపాట మిరపకు జీఐ ట్యాగ్ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రెండేళ్ల క్రితం దరఖాస్తు చేయగా.. ఇండియన్ పేటెంట్ ఆఫీస్(ఐపీవో) తాజాగా ఆమోదించింది. 'జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ జర్నల్‌'లోనూ చపాట రకం మిర్చికి సంబంధించిన వివరాలు ప్రచురితమయ్యాయి. చపాట రకం మిరపకాయలు టమోటా మాదిరిగా ఉంటాయి. అందుకే దీన్ని టమోటా మిరప అని కూడా పిలుస్తారు. రెండేళ్ల క్రితం చపాట మిర్చికి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.లక్ష వరకు ధర పలికింది. తాజాగా జీఐ ట్యాగ్‌తో ఈ రకం మిర్చి ప్రత్యేక గుర్తింపు సాధించినట్లయింది.

గిల్లి పంచాయతీకి బీఆర్ఎస్ యత్నం: అడ్లూరి

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు ప్రజలను పట్టించుకోకుండా మోసం చేసిన బీఆర్ఎస్ నేతలు అధికారానికి దూరం కావడంతో గిల్లి పంచాయతీ పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణ తల్లి.. తెలంగాణ ప్రజల సెంటిమెంట్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై కేటీఆర్ విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ వర్ధంతి రోజు బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునివ్వడం శోచనీయమన్నారు. అంబేడ్కర్ పేరు మీద ఉన్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రద్దు చేసిన బీఆర్ఎస్ దళితబంధు పేరుతో దగా చేసిందని ధ్వజమెత్తారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం చేసింది

» ప్రజా క్షేత్రంలో ఎండగడతాం

» ఏడాది గడిచినా హామీల అమలేది?: ఎంపీ కె.లక్ష్మణ్

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలు, అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. మీడియాతో కె.లక్ష్మణ్ శుక్రవారం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీజేపీ అధ్వర్యంలో నిర్వహించే సభకు పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తారని తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కుర్చీ దగ్గర డబ్బులు దొరికాయని, చైర్మన్ చెప్పినా కూడా ఆ పార్టీ రాజకీయం చేస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుంటే చూసి ఓర్వ లేని విదేశీ దుష్టశక్తులు తప్పుడు వార్తలు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని పట్టుకుని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సమావేశాలు జరగకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. భారత్‌లో తయారయిన కోవాక్సిన్‌కు వ్యతిరేకంగా "ఆర్గనైజ్డ్ క్రైం అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ)" తప్పుడు కథనాలు ఇస్తే, వాటిని ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేశారని అన్నారు. దేశానికి వ్యతిరేక వార్తలు వచ్చిన ప్రతిసారి రాహుల్ గాంధీ వాటిని అందుకుని నానా హంగామా చేస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికలకు పరిశీలకులు

» ప్రతి మూడు జిల్లాలకు ఓ పరిశీలకుడి నియామకం

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం పార్టీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ పరిశీలకులను నియమించారు. మూడు జిల్లాలకు ఒక పరిశీలకుడు ఈ ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. జిల్లాల వారీగా నియామకాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్(చింతల రాంచంద్రారెడ్డి), నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల (ఎం. ధర్మారావు), కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ (దుగ్యాల ప్రదీప్‌కుమార్), సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి (డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు), రంగారెడ్డి రూరల్, రంగారెడ్డి అర్బన్, నాగర్‌కర్నూల్ (జి. ప్రేమేందర్‌రెడ్డి), ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ (బంగారు శృతి), వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్ (ఎన్.రాంచందర్‌రావు), మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం (పి.గంగారెడ్డి), నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం (పేరాల శేఖర్‌రావు), వనపర్తి, గద్వాల, సూర్యాపేట (ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్), మేడ్చల్ రూరల్, మేడ్చల్ అర్బన్, సికింద్రాబాద్ (కట్టా సుధాకర్ రెడ్డి), సిరిసిల్ల, హన్మకొండ, జనగాం (టి. ఆచారి), హైదరాబాద్ సెంట్రల్, గోల్కొండ-గోషామహల్, భాగ్యనగర్-మలక్‌పేట (జి. మనోహర్‌రెడ్డి).

అదానీ అంశాన్ని లేవనెత్తకుండా కరెన్సీ డ్రామా

» కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి పార్లమెంట్‌లో కేటాయించిన సీటు వద్ద కరెన్సీ నోట్ల కట్ట లభించిందన్న దంపై కాంగ్రెస్ నేత, ఎంపీ మల్లు రవి స్పందించారు. అదానీ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకే అధికార పక్షం కరెన్సీ డ్రామాకు తెరలేపిందని ఆరోపించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో పేరున్న న్యాయవాదుల్లో ఒకరైన అభిషేక్ మను సింఘ్వీ నిజాయితీ దేశానికి తెలుసున్నారు. డబ్బుల కట్టను సీటు దగ్గర వదిలి వెళ్లాల్సిన అవసరం ఆయనకు ఏముంటుందన్నారు.

హరీశ్, కౌశిక్ అరెస్టులు అందుకే

ప్రభుత్వ పాలన, ప్రజా సంక్షేమానికి అడ్డువస్తే ఎవరినైనా అరెస్టు చేస్తామని, ఇందులో భాగంగానే ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కౌశిక్ రెడ్డి అరెస్టులు జరిగాయని ఎంపీ మల్లు రవి తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో తనను ఎన్నోసార్లు గృహ నిర్బంధం చేశారని గుర్తు చేశారు. ఇందిరా పార్కు దగ్గర ఎవరైనా సమావేశాలు, ధర్నాలు చేసుకోవచ్చన్నారు.

ఆటోల బంద్ విరమణ.. వెనక్కి తగ్గిన జేఏసీ

హైదరాబాద్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఆటో కార్మికులు శనివారం నిర్వహించతలపెట్టిన ఆటోల బంద్‌ను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జేఏసీ ప్రకటించింది. ప్రజాపాలన విజయోత్సవాలు ముగిసిన వెంటనే ఆటో డ్రైవర్ సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలు పరిష్కారిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ కన్వీనర్ వెంకటేశం తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయడం కోసం ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశమైన ఆటో సంఘాల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం రాత్రి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. ఈ నెల 10,11 తేదీల్లో కార్మికులతో చర్చలు జరుపుతామని, బంద్‌ను వాయిదా వేసుకోవాలని కోరారని చెప్పారు.

వెలమలపై నోరుపారేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే

» భగ్గుమన్న ఆ కుల సంఘాలు.. పోలీసులకు ఫిర్యాదు

» శంకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: ఎమ్మెల్సీ కవిత

షాద్‌నగర్, ఖమ్మం క్రైమ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెలమలను అసభ్యపదజాలంతో దూషించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవ్వగా వెలమ కుల సంఘాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే శంకర్ 24 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత వెలమ సంఘం డిమాండ్ చేసింది. అలాగే, పద్మనాయక వెలమసంఘం సభ్యులు ఎమ్మెల్యే శంకర్‌పై ఖమ్మం టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాగా, ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. శంకర్ వ్యాఖ్యలు వెలమల పట్ల కాంగ్రెస్ అధికారిక వైఖరా? అని సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఆమె ప్రశ్నించారు. కాగా, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. వెలమలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని శంకర్‌ను ఆదేశించారు.

సాగులో తెలంగాణ

రోల్ మోడల్ కావాలి!

ఐఏఎస్, ఐపీఎస్, ఉద్యోగులు, అధికారుల్లా అన్నదాతలకూ పంటల సాగుతో రాబడి అందాలి

» రైతులకూ నికర ఆదాయం రావాలి

» ఆ దిశగా మా ప్రభుత్వం చేసింది

» వచ్చే ఏడాది పంటల బీమా, రైతు భరోసా

» రైతుకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం

» 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు!

» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఖమ్మం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, రైతు బిడ్డగా తనకు ఎంతో సంతృప్తిగా ఉందని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రైతులకు ఇంకా చేయాల్సింది చాలా ఉందని, ఆ దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. దేశంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లాగానే రైతులు కూడా పంటల సాగు ద్వారా ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా నికర ఆదాయాన్ని పొందాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం ఆ దిశగా పనిచేసిందని చెప్పారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ఒక్క ఏడాదిలోనే అమలు చేశామన్నారు. దేశంలో ఏ ప్రభుత్వానికీ చేయని విధంగా తెలంగాణ సర్కారు పనిచేసిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రిగా తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని, రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తుమ్మల వివరించారు.

● **రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి చేపట్టిన చర్యలేంటి?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాం. ఏడాదిలోనే రైతులకు రుణ మాఫీ చేశాం. 25.5 లక్షల మందికి రూ.20,617 కోట్లు మాఫీ చేశాం. 41 లక్షల మంది రైతులకు వర్తించే బీమా పథకానికి రూ.1,433 కోట్లు ప్రీమియం చెల్లించాం. గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రద్దుచేసింది. దాన్ని అమలు చేసేందుకు మేం చర్యలు చేపట్టాం.

● **రైతు భరోసా ఎప్పటినుంచి అమలు చేస్తారు?**

వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రైతుభరోసా పథకం అమలు చేస్తాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు. మా ప్రభుత్వం మాత్రం ప్రీమియం మొత్తం చెల్లించి, వచ్చే ఏడాది నుంచి పంటల బీమా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది అకాల వర్షాలకు పంటలు నష్టపోతే ఎకరానికి రూ.10వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేశాం.

● **రైతులకు ఇప్పటికి ఎంత బోనస్ చెల్లించారు?**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వరి పంట వేశారు. 24 గంటల ఉచిత విద్యుత్తు, నాణ్యమైన విత్తనాలు అందించడంతోనే ఇది సాధ్యమైంది. సన్న బియ్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. ఇప్పటిదాకా రైతుల ఖాతాల్లో రూ.874 కోట్లు జమచేశాం. మద్దతు ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. సీసీఐ ద్వారా 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొంటున్నాం.

● **వ్యవసాయాభివృద్ధికి మీ కార్యాచరణ?**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అన్ని రకాల పంటలు పండుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో రైతులకు ఎక్కువ లాభాలు వచ్చేలా చూస్తాం. అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించడం, ఇక్కడ పండించే ప్రతి పంటను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించడం, రైతులకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, లాభసాటి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయ మంత్రిగా నాకున్న ఆలోచనలతో ఇందుకు ప్రణాళికలు రూపొందించుకుంటా. వ్యవసాయంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్‌మోడల్‌గా ఉంచాలన్నది నా ఆకాంక్ష. అందుకే రాష్ట్రంలో రైతు అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.52 వేల కోట్లు కేటాయించాం.

● **ఎక్కువ మంది పామాయిల్ వేస్తే మార్కెట్ ఎలా?**

రాష్ట్రంలో రూ.350 కోట్లతో ఆయిల్‌పామ్ ప్రణాళిక రూపొందించి, ఎకరానికి రూ.51 వేలు సబ్సిడీ ఇచ్చి పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నాం. గతంలో పామాయిల్ టన్ను ధర రూ.13 వేలు కాగా.. ఇప్పుడు రూ.20,411కు చేరింది. రాష్ట్రంలో పంట విస్తీర్ణాన్ని 50 వేల నుంచి 2 లక్షల ఎకరాలకు పెంచాం. ఈ పంట సాగుకు 20 లక్షల ఎకరాలు అనుకూలంగా ఉన్నాయి. పామాయిల్ దిగుమతి కారణంగా రూ.లక్ష కోట్ల విదేశీ మారకద్రవ్యం చెల్లిస్తున్నారు. పామాయిల్ సాగు ఎంత పెరిగితే రైతుకు అంత మంచిది. అలాగే విదేశీ మారకద్రవ్యం కూడా ఆదా అవుతుంది.

● **రాష్ట్రంలో కొత్తగా సాగు చేసే పంటలకు ప్రోత్సాహం ఎలా?**

పామాయిల్‌లోనే అంతర పంటలుగా కోకో, వక్క, జాజి, మునగ వంటి పటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు పెద్దఎత్తున నెలకొల్పి, రైతులు పండించే పంటలను పలు ఉత్పత్తులుగా ఎగుమతులు చేసేందుకు ఫుడ్‌పార్కులు ఏర్పాటు చేస్తున్నాం.

● **మార్కెటింగ్ వ్యవస్థలో దళారీలను ఎలా అరికడతారు?**

దేశ, విదేశాల్లో ఏ పంటకు ఎంత రేటుందో క్షణాల్లో తెలుసుకునేలా జాతీయ అంతర్జాతీయ మార్కెట్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానం చేయబోతోంది. హైదరాబాద్ సమీపంలోని కోహెడాలో 300 ఎకరాల్లో అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ దేశీ, విదేశీ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగ్ ఎగుమతులను ప్రోత్సహించబోతున్నాం. ఈనామ్ పద్ధతిలో పంటల కొనుగోలుకు మార్కెట్లను ఆధునికీకరించబోతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో వ్యవసాయ మార్కెట్లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్తు వ్యాపారం కూడా చేయబోతున్నాం. రాష్ట్రంలో ఉన్న 2500 రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్సు సౌకర్యాలు కలిపించబోతున్నాం.

● **పసుపు బోర్డు, కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు ఎంతదాకా వచ్చింది?**

నిజామాబాద్‌లో పసుపు బోర్డు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రానికి పలుసార్లు విజ్ఞప్తి చేశాం. పసుపు బోర్డుపై ప్రధాని మోదీ కూడా హామీ ఇచ్చారు. కానీ, ఇంతవరకు అమలు కాలేదు. కొబ్బరి పరిశోధన కేంద్రం, పసుపుబోర్డు ఏర్పడితే రాష్ట్రంలో పసుపు, కొబ్బరి సాగు భారీగా పెరిగే అవకాశం ఉంటుంది.



సీఎం రేవంత్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న యూపీ ఉప ముఖ్యమంత్రి మౌర్య

కుంభమేళాకు రండి

» సీఎం రేవంత్‌ను ఆహ్వానించిన యూపీ ఉప ముఖ్యమంత్రి

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే కుంభమేళాకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య శుక్రవారం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసి కుంభమేళా ఆహ్వానాన్ని అందించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో గల ప్రయాగ వద్ద ఈ కుంభమేళా జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనుంది.



మహోన్నత దార్శనికుడు అంబేడ్కర్

» మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాబాసాహెబ్ అంబేడ్కర్ బాటలు వేశారని బీఆర్ఎస్ అధినేత, మాజీసీఎం కేసీఆర్ అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన ఆయన కీర్తి అజరామరమని పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని రూపొందించడంలో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. ఆయన ఘనకీర్తిని చాటేందుకే తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టుకున్నామని, 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



సరూర్‌నగర్‌లో బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఏం ఒరగబెట్టారని విజయోత్సవాలు?

» హామీలపై ప్రశ్నిస్తే రేవంత్ చిల్లర భాష

» కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ డ్రామా కంపెనీలు: ఈటల

» నేడు సరూర్‌నగర్‌లో బీజేపీ సభ

మన్సూరాబాద్, హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పొందిన ఏకైక పార్టీ రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ అని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఏం ఒరగబెట్టారని ప్రజా పాలన విజయోత్సవాలకు సిద్ధమయ్యారంటూ రేవంత్ సర్కారును ఆయన ప్రశ్నించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ఎండగడుతూ శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను పార్టీ పెద్దలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఈటల మాట్లాడారు. తొలి వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏడాది గడిచినా ఏ గ్యారెంటీని సరిగ్గా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ వర్గానికి చెందిన ప్రజలను కదిలించినా రేవంత్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని తాము ప్రశ్నిస్తే.. తానో ముఖ్యమంత్రిని అని మరిచిపోయి చిల్లర భాషతో సమస్యలను రేవంత్ తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇది సిగ్గుచేటు అని విమర్శించారు. మూసీ ప్రక్షాళన, ఫోర్త్ సిటీ ఏర్పాటు, హైడ్రా అంటూ రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని, వాటి పేర్లతో లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

మోసాలను ఎండగట్టేందుకే..

సరూర్‌నగర్ సభకు బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేసింది. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నడ్డా, బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఆయన నేరుగా సభాస్థలికి వెళతారు. బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం తిరిగి ఢిల్లీ వెళతారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో మోసాలు చేసిందని, వాటిని నడ్డా ఎండగడతారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఈ సభ ద్వారా ఒత్తిడి పెంచుతామని ప్రకటించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఈ దఫాలోనే పూర్తి

ఏకకాలంలో ఇరువైపులా టన్నెలింగ్ పనులు.. గ్రావిటీతో 3 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు

» రాజకీయ దురుద్దేశంతోనే గత ప్రభుత్వం బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌ను పక్కనపెట్టింది

» దానిని పూర్తి చేశాం: మంత్రి ఉత్తమ్

» నాకు తోటలు, ఫాంహౌస్‌లు లేవు.. పుట్టిన నేల కోసమే ప్రాజెక్టు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

» నేడు బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతలను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

(బ్రాహ్మణవెల్లెంల నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తమ ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యేలోపే (ప్రస్తుత టర్మ్‌లోనే) శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌ను పూర్తి చేస్తామని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రెండువైపులా టన్నెలింగ్ పనులు ఏకకాలంలో చేపడతామని, టన్నెల్ పూర్తిచేసి, గ్రావిటీతో 3 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటిని అందిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాజకీయ దురుద్దేశంతో పక్కనపెట్టిన, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ఈ టర్మ్‌లో పూర్తి చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. మంచిరోజులు వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఉదయసముద్రం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన బ్రాహ్మణవెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నల్లగొండ మెడికల్ కాలేజీ, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రెండో దశను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతోనే బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనపెట్టిందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని దశాబ్దకాలంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తులు చేసినప్పటికీ.. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం చూపిందన్నారు. ఉదయసముద్రం నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులో భాగంలో కట్టిన బ్రాహ్మణవెల్లెంల నుంచి 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. దీని కింద మరో 730 ఎకరాలు సేకరించాల్సి ఉందని, వారం రోజుల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన న్నారు.

భూమి ధర పెరిగింది

బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులో నీటిని నింపుతుండటంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి, ఎకరా రూ.10 లక్షలు పలికే భూమి రూ.77 లక్షలకు అమ్ముడుపోయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. గత పదేళ్లలో కాంగ్రెస్ పార్టీకి, తనకు ఎక్కడ పేరు వస్తుందో అనే కారణంతోనే ప్రాజెక్టు పనులు పక్కన పెట్టారన్నారు. బ్రాహ్మణవెల్లెంలలో తనకు 3 ఎకరాల భూమి మాత్రమే ఉందని.. తోటలు, ఫామ్‌హౌస్‌లు లేవన్నారు. గతంలో ఒక రైతు 26 బోర్లు 1500 ఫీట్ల లోపల వేసినా నీళ్లు పడలేదని, ఇది ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమని గుర్తు చేశారు. పుట్టిన ఊరు, మండలానికి మేలు చేయాలనే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు.

నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్

బ్రాహ్మణవెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. దీంతో రెండు దశాబ్దాల కల సాకారం కానుంది. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించడమే లక్ష్యంగా 2005 ఆగస్టులో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 2007లో రూ.699 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయి. 6.70 టీఎంసీల నీటిని ఎత్తిపోసి... నార్కట్‌పల్లి, నల్గొండ, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, కట్టంగూరు, నకిరేకల్, తుంగతుర్తిలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించడానికి వీలుగా నిర్మాణం చేశారు. 2015, 2021లో ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయాన్ని సవరించారు. ఇప్పటిదాకా రూ.469.95 కోట్లను వెచ్చించారు. మరో రూ.204.72 కోట్ల పనులు జరగాల్సి ఉంది. ఉదయ సముద్రం ప్రాజెక్టులో భాగంగానే 0.302 టీఎంసీల సామర్థ్యంతో బ్రాహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించారు. హెడ్‌వర్క్‌లతో పాటు అప్రోచ్ చానల్, ప్రెషర్ మెయిన్ పనులు పూర్తయ్యాయి. ఈ రిజర్వాయర్ కింద ఎడమ ప్రధాన కాలువ కింద 43 వేల ఎకరాలు, కుడి ప్రధాన కాలువ కింద 57 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తారు. తొలిదశలో మునుగోడు కింద 2,908 ఎకరాలు, నల్గొండ నియోజకవర్గంలో 22,750 ఎకరాలు, నకిరేకల్‌లో 23 వేల ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు.

హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారిబంగ్లా గెస్ట్‌హౌస్, సబ్ డివిజనల్ కార్యాలయాలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేసిందని, రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని వారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.

సోనియా వల్లే తెలంగాణ

» ఆమె లేనిదే ప్రత్యేక రాష్ట్రం లేదు

» 9న ఘనంగా సోనియా జన్మదినోత్సవాలు: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని, ఆమె లేనిదే ప్రత్యేక రాష్ట్రం లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. డిసెంబరు 9న సోనియా జన్మదినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సోనియా జన్మదినోత్సవాలకు మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ప్రజల పండుగని.. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. రాజీవ్ గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలు అర్పించిందని, కేటీఆర్ తెలంగాణ కోసం ఏం త్యాగం చేశారని ప్రశ్నించారు. అధికారం కోల్పోయినా కేటీఆర్‌లో ఏమాత్రం అహంకారం తగ్గలేదని, ఇప్పటి కైనా ఆయన పగటికలలు కనడం మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల దోపిడీ జరిగిందని, ఇక ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉందని కితాబు ఇచ్చారు. సీఎం రేవంత్ పాలనలో ఎలాంటి నిర్బంధం లేదని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా నిరసన తెలుపుకొనే అవకాశం ఉందని చెప్పారు. శాంతి భద్రతలకు భంగం కల్గించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాడిన భాష సభ్యసమాజం తల దించుకునే విధంగా ఉందని.. చట్టం ఎవరికీ చుట్టం కాదని పేర్కొన్నారు. ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా పక్కా

సంక్రాంతి తర్వాత అమలు చేసేలా నిధుల సమీకరణ

- త్వరలో పునరుత్పాదక విద్యుత్ విధానం
- 'విద్యుత్'పై బీఆర్ఎస్‌ది దుష్ప్రచారం: డిప్యూటీసీఎం భట్టి
- నేడు యాదాద్రి 800 మెగావాట్ల ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తర్వాత రైతు భరోసా పథకాన్ని పక్కాగా అమలు చేసి తీరుతామని, ఇందుకు కావాల్సిన నిధులు సమకూర్చుకుంటున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. త్వరలో సమగ్ర పునరుత్పాదక విద్యుత్ విధానాన్ని తీసుకొస్తామని, అసెంబ్లీ సమావేశాల్లో కొత్త విద్యుత్ విధానాన్ని ప్రవేశపెడతామని వెల్లడించారు. అలాగే, విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పనకు కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా అమలుకు అవసరమైన దాదాపు రూ.10 వేల కోట్లను సమకూరుస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని భట్టి ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 15వ తేదీ దాకా వేతనాలు చెల్లించే వారు కాదని గుర్తు చేశారు. కానీ, తాము అధికారం చేపట్టిన తర్వాత మార్చి నెల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతీ నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా వేతనాలు, పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని, 2023 డిసెంబరు నుంచి ఇప్పటిదాకా తాము రూ.52,118 కోట్ల అప్పులు తెచ్చామని భట్టి తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీ కింద తాము రూ.64,516 కోట్లు చెల్లించామని చెప్పారు. మూలధన వ్యయం కింద ఇప్పటివరకు రూ.24,036 కోట్లు, ప్రజా సంక్షేమ పథకాల కోసం మరో రూ.61,194 కోట్లను వెచ్చించామని చెప్పారు. ఇందులో రుణ మాఫీకి రూ.20,617 కోట్లు, రైతు భరోసాకు రూ.7,625 కోట్లు, చేయూతకు రూ.11,382 కోట్లు, ఆరోగ్యశ్రీకి రూ.890 కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.11,141 కోట్లు వెచ్చించామన్నారు. విద్యుత్ రంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన గత పాలకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డిమాండ్ ఎక్కువ ఉన్నా.. ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని భట్టి తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతిని తీసుకురాకుండా గత ప్రభుత్వం గాలికొదిలేస్తే తాము అనుమతులు తీసుకొచ్చామని వివరించారు. ఈ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఓ ప్లాంట్‌ను శనివారం గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద ఇప్పటిదాకా 3,64,57,380 జీరో బిల్లులు జారీ అయ్యాయని, ప్రజలకు రూ.1336 కోట్లు ఆదా అయ్యాయని భట్టి తెలిపారు.

నేటి నుంచి ప్రజా పాలన సంబురాలు

- ట్యాంక్‌బండ్ వద్ద సంగీత కళాకారులతో కార్యక్రమాలు
- తమన్, వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లీగంజ్ రాక!

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి జరుగుతున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సంబురాలు జరగనున్నాయి. శని, ఆది, సోమవారాల్లో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత, సాంస్కృతిక, వినోద కార్యక్ర మాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లీగంజ్, తమన్‌వంటి సంగీత కళాకారులు పాల్గొననున్నారు. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ దగ్గర ఫుడ్, హస్తకళల స్టాళ్లు, ఎన్టీఆర్ మార్గ్‌లో బాణాసంచా ప్రదర్శన, ట్యాంక్‌బండ్ దగ్గర డ్రోన్ షో, భారత వాయుసేన నేతృత్వంలో ఎయిర్ షోలను నిర్వహించనున్నా రు.

కార్యక్రమాల వివరాలు..

- 7వ తేదీ సాయంత్రం 5నుంచి 9 గంటల వరకు.. నెక్లెస్ రోడ్ దగ్గర సాంస్కృతిక కార్యక్రమాలు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో (ఐమాక్స్ దగ్గర) వందేమాతరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమం ఉంటుంది. ఫుడ్, హ్యాండీ క్రాఫ్ట్స్, కల్చరల్ స్టాల్స్ ఏర్పాటవుతాయి.
- 8న ట్యాంక్ బండ్ దగ్గర భారత వాయుసేన ఆధ్వర్యంలో ఎయిర్ షో, ఐమాక్స్ దగ్గర సాయంత్రం 7గంటల నుంచి 8.30వరకు రాహుల్ సిప్లీగంజ్‌తో సంగీత కచేరి, నెక్లెస్ రోడ్ దగ్గర సాయంత్రం 5 నుంచి రాత్రి 9వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫుడ్, హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లు, కల్చరల్ స్టాళ్లు ఉంటాయి. నగరంలో వీధి దీపాల అలంకరణ ఉంటుంది.
- 9న సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ. సాయంత్రం 5 నుంచి 5.45 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ. 5.45 నుంచి 6గంటల వరకు డ్రోన్ షో, 6.05 గంటల నుంచి 6.20 వరకు బాణసంచా ఉంటుంది. 6.10 గంటలకు సీఎం రేవంత్ సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద చేరుకుంటారు. ఐమాక్స్ దగ్గర హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 7గంటల నుంచి 8.30వరకు తమన్ ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఫుడ్, హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లు, కల్చరల్ స్టాళ్లు ఉంటాయి.

కమలాపూర్ బిల్ట్ పరిశ్రమ పునరుద్ధరణ

- ఆర్టీఏ సేవలన్నీ.. మీసేవ పరిధిలోకి
- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ సులభతరం
- విజయోత్సవాల ముగింపు వేడుకల్లో సీఎం ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలకు సంబంధించి ఆదివారం జరిగే ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేయనున్నారు. ఇందులో కమలాపూర్ బిల్ట్(బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) ఫ్యాక్టరీ పునరుద్ధరణ, మీ సేవ పరిధిలోకి ఆర్టీఏ సేవలు తీసుకురావడం ఇందులో ముఖ్యమైనవి. అలాగే, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన 14 పరిశ్రమలతో ముఖ్యమంత్రి సమక్షంలో ఆ రోజు ఒప్పందాలు కూడా జరగనున్నాయి. గతంలో వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన ములుగు జిల్లాలోని కమలాపూర్ బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం ఈ పరిశ్రమ పునరుద్ధరణపై ప్రకటనలు చేసినప్పటికీ పని పూర్తి చెయ్యలేకపోయింది. అయితే, మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ఐటీసీ గ్రూప్‌తో సంప్రదింపులు జరిపింది. బిల్ట్ ఫ్యాక్టరీని కాగితం తయారీ పరిశ్రమగా మారుస్తామని ఐటీసీ ప్రభుత్వానికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో పరిశ్రమ ప్రారంభానికి ఐటీసీ సిద్ధమవుతుండగా.. విజయోత్సవాల ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి దీనిపై ప్రకటన చేయనున్నారు. అలాగే, మీసేవ పరిధిలోకి కొత్తగా మరో 130 ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించనున్నారు. లెర్నింగ్, పర్మినెంట్ లైసెన్స్‌తోపాటు ఆర్టీఏ శాఖకు చెందిన దాదాపు 100 రకాల సేవలు, మైనార్టీ సర్టిఫికెట్, స్టడీ గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పు, క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన మార్కెట్ వ్యాల్యూ సర్టిఫైడ్ కాపీలు, వంటి సేవలు మీసేవల్లో అందుబాటులోకి తెస్తున్నారు. అలాగే, కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సర్టిఫికెట్లు పరిమితి ఏడాది మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఇకపై, పాత సర్టిఫికెట్ నెంబరు ఆధారంగా మరో ఏడాది కాలానికి సర్టిఫికెట్‌ను జారీ చేసే విధానాన్ని తీసుకువస్తున్నారు. ఈ సేవలను ముఖ్యమంత్రి ఆదివారం ప్రారంభిస్తారు. వీటితోపాటు విద్య, వైద్యం, వ్యవసాయం, ట్రాఫిక్ శాఖతోపాటు వివిధ ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగానికి సంబంధించి కొత్తగా ఏడు సేవలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు (కేవీ), 28 నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో 7 నవోదయ విద్యాలయాలు, ఏపీలో 8 కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కొత్త కేవీల ద్వారా దేశవ్యాప్తంగా 82 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందనుందన్నారు. రాష్ట్రంలోని జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయ విద్యాలయాలను కేంద్రం ఏర్పాటు చేయనుంది. 85 కొత్త కేవీల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న ఒక కేవీ విస్తరణకు 2025-26 నుంచి ఎనిమిదేళ్ల కాలానికి రూ.5,872.08 కోట్లు, 2024-25 నుంచి ఐదేళ్ల కాలానికి 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు రూ.2,359.82 కోట్ల నిధులు అవసరమవుతాయని క్యాబినెట్ అంచనా వేసింది.

నేడు నల్లగొండకు సీఎం రేవంత్‌రెడ్డి

బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల వైటీపీఎస్, మెడికల్ కాలేజీలకు ప్రారంభోత్సవం



నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు

- నల్లగొండలో భారీ బహిరంగసభ
- సభ ద్వారా అద్భుతమైన సందేశం ఇవ్వబోతున్నాం: ఉత్తమ్
- చరిత్ర సృష్టించనున్న సభ: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను శుక్రవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రుల బృందంతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా ఉదయం 11 గంటలకు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల చేరుకుంటారు. అక్కడ నిర్మించిన బ్రాహ్మణవెల్లెంల - ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను ముఖ్యమంత్రి, మంత్రులు పరిశీలించి అక్కడ పూజలు నిర్వహిస్తారు. అక్కడినుంచి దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్-2 నుంచి విద్యుదుత్పాదన చేపట్టే ప్రక్రియను లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రారంభిస్తారు. అక్కడే నూతనంగా నిర్మించతలపెట్టిన నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి, కనగల్, తిప్పర్తి జూనియర్ కాలేజీల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపనలు చేసిన అనంతరం మెడికల్ కాలేజీ సమీపంలో ఏర్పాటు చేసిన రాజీవ్ ప్రాంగణంలో భారీ బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, బ్రాహ్మణవెల్లెంలలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండలో శనివారం నిర్వహించే బహిరంగసభ ద్వారా రాష్ట్రానికి అద్భుతమైన సందేశాన్ని ఇవ్వబోతున్నామని ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండలో నిర్వహించే సభ చరిత్ర సృష్టించబోతోందన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాల విచారణకు.. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగుతోందని, ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా 4 కోట్ల ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చే బాధ్యత తమదని చెప్పారు. నాడు పోలీస్‌లు రాజకీయ ఒత్తిళ్ల, ఆదేశాల మేరకే పని చేశారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాది కాలంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా పైరవీలకు తావు లేకుండా సమర్థతను బట్టి వారికి తగు హోదా కల్పించామని చెప్పారు. పైరవీలకు ఆస్కారం లేకుండా పాలనను దృష్టిలో ఉంచుకుని నియామకాలు చేశామన్నారు. "నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఒకప్పుడు, హత్యలు, రేప్‌లు, ఆర్థిక నేరాలు ఉండేవి. ఇప్పుడు సైబర్, డ్రగ్స్ నేరగాళ్లు కనిపిస్తున్నారు. వీరిని కట్టడి చేసేందుకు కఠినంగా వ్యవహరించాలి. అలాగే, ఇప్పుడు బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీలు చేసిన వారు కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరుతున్నారు. ఆక్టోపస్, గ్రేహౌండ్స్ ఏసీబీ, సీఐడీ తరహాలో వీరిలో కొందరికి డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వండి" అని సూచించారు. సైబర్ నేరాల్లో గత ఏడాది రూ.12 కోట్లు రికవరీ చేస్తే ఈ ఏడాది రూ.100 కోట్లు చేశారని తెలిపారు. ప్రమాదకర సింథటిక్ డ్రగ్స్ తెలంగాణను పట్టిపీడిస్తున్నాయని, అందుకే టీజీ న్యాబ్ ఏర్పాటు చేశామని, వందలాది మంది సిబ్బందిని కేటాయించామని, దాంతో, మత్తు పదార్థాలు విక్రయించే వారు రాష్ట్రంలోకి రావాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఈ వ్యసనం కాలేజీల్లోనే కాకుండా స్కూళ్లకూ పాకిందని, పిల్లలు మత్తుకు బానిసలైతే అభివృద్ధికి భంగం కలుగుతుందని, దీనిపై విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

దాబు, దర్పం ప్రదర్శిస్తే లోపలెయ్యండి

పోలీస్ స్టేషన్లకు వచ్చి దాబు, దర్పం ప్రదర్శించే వారిని నిర్దాక్షిణ్యంగా లోపలెయ్యాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. "పోలీసులు బాధితుల పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే క్రిమినల్స్‌తో ఫ్రెండ్లీగా ఉండమని కాదు. బాధితులకు, అన్యాయం జరిగిన వారు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి న్యాయం చేసే విధంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి. కబ్జాకోరులు, హంతకులు, ఆర్థిక నేరగాళ్లతో ఫ్రెండ్లీగా ఉండమని కాదు" అని స్పష్టం చేశారు. కొందరు పోలీసుల తీరుతో అందరూ విమర్శలు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొందని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజా ప్రతినిధి కూడా మర్యాదగా వ్యవహరించాలని, వాళ్లు అమర్యాదగా వ్యవహరించినప్పుడు మీరు మర్యాదగా ఉంటే కొన్ని సందర్భాల్లో చేతగానితనంగా సమాజానికి సందేశం ఇచ్చినట్లు అవుతుందని చెప్పారు. నేరగాళ్లు ఎంతవారైనా.. రాజకీయ నాయకులైనా హోదాతో సంబంధం లేకుండా లోపలెయ్యాలని నిర్దేశించారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా తీసుకున్నామని, భవిష్యత్తులో వారికి మరిన్ని అవకాశాలు పెంచుతామని, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పలువురు ట్రాన్స్‌జెండర్లకు సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.



ట్రాన్స్‌జెండర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి

హోంగార్డులకు రోజుకు వెయ్యి

"పోలీసులతో సమానంగా అవసరమైతే అంతకంటే ఎక్కువగా హోం గార్డులు పనిచేస్తున్నారు. వారికి ప్రస్తుతం ఇస్తున్న రోజువారీ గౌరవ వేతనం రూ.921 నుంచి వెయ్యి రూపాయలకు పెంచుతున్నాం. వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.100 నుంచి రూ.200కు పెంచుతున్నాం. హోంగార్డులు ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. ప్రమాదంలో చనిపోయే హోంగార్డులకు ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం చెల్లించే విధానం లేదు. అందుకే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది" అని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డు ఇచ్చేందుకు విధివిధానాలు తెస్తున్నామని, హోం గార్డులకు కూడా హెల్త్ కార్డులు, ఆరోగ్యశ్రీ వంటి మెరుగైన వైద్య సహాయం అందిస్తామని ప్రకటించారు. వీటన్నిటినీ జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. హోం గార్డు నుంచి డీజీపీ వరకు వారి పిల్లలు చదువుకునేందుకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ని తలదన్నేలా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

తుపాకీ పట్టి..

హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ స్టాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఆయా విభాగాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద వారి పనితీరును సిబ్బంది సీఎంకు వివరించారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రదర్శించగా.. సీఎం వాటిని ఆసక్తిగా పరిశీలించారు. కొన్నిటిని చేతిలోకి తీసుకుని వాటిని ఎక్కుపెట్టారు. గ్రేహౌండ్స్ బలగాలు, పోలీస్ జాగిలాల విన్యాసాల్ని తిలకించారు.

ఎస్‌డీఆర్ఎఫ్ వాహనాలు, లోగో ప్రారంభం

ఎస్‌డీఆర్ఎఫ్ తరహాలో అగ్నిమాపక శాఖ డీజీ వైనాగిరెడ్డి నేతృత్వంలో 2 వేల మంది సిబ్బందితో ప్రత్యేకంగా ఎస్‌డీఆర్ఎఫ్ ఏర్పాటు చేశారు. దీనికి ప్రభుత్వం నూతనంగా వాహనాలు, ఇతర పరికరాలు కేటాయించింది. ఎన్టీఆర్ మార్గ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం (ఎస్‌డీఆర్ఎఫ్) నూతన వాహనాలను సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నూతనంగా రూపొందించిన ఎస్‌డీఆర్ఎఫ్ లోగోను ఆవిష్కరించారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల ప్రత్యేక విన్యాసాల్ని తిలకించారు.

శాంతి భద్రతల సమస్యలు తెచ్చేందుకు కుట్రలు: భట్టి

పోలీసుల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎలాంటి విపత్తులు వచ్చినా ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ వ్యవస్థను బలోపేతం చేశామని, విపత్తులు వస్తే కేంద్ర బలగాలపై ఆధారపడాల్సిన పరిస్థితిని అధిగమించామని తెలిపారు. సైబర్ నేరాలు సవాల్‌గా మారుతున్నాయని, వాటిని అదుపు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్‌లో గందరగోళ పరిస్థితులు సృష్టించి శాంతి భద్రతల సమస్యలు తెచ్చేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, వాటిని సాగనివ్వబోమని స్పష్టం చేశారు. డయల్-100కు వచ్చే ఫోన్‌ల విషయంలో వేగంగా స్పందిస్తున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. టెక్నాలజీ వాడకంలో తెలంగాణ పోలీస్‌లు దేశంలోనే ముందున్నారని చెప్పారు. హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, నిఘా విభాగం చీఫ్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అదనపు డీజీపీ మహేష్ భగవత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్



ఎస్‌డీఆర్ఎఫ్ వాహనాలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దుబాయ్, సింగపూర్ తరహా షాపింగ్‌మాల్స్

హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేలా చర్యలు

31లోపు కొత్త పర్యాటక విధానం: సీఎం

హైదరాబాద్‌లో.. దుబాయ్, సింగపూర్, చైనాలలో ఉన్నటువంటి భారీ షాపింగ్ మాల్స్ ఏర్పాటయ్యేలా చూడాలని.. ఈ మేరకు ఆయా దేశాల్లో పర్యటించి అధ్యయనం చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. చరిత్రాత్మక కట్టడమైన ఉస్మానియా ఆస్పత్రిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, చార్మినార్‌కు పర్యాటకులు మరింత పెరిగేలా వసతులు కల్పించాలని నిర్దేశించారు. హైదరాబాద్ వాతావరణం 365 రోజులూ బాగుంటుంది కాబట్టి దానికి అనుగుణంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ నెల 31లోపు కొత్త పర్యాటక విధానాన్ని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖపై సీఎం రేవంత్ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న పర్యాటక విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం మాట్లాడుతూ.. ప్రకృతి, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అనుసంధానించాలని.. టైగర్ రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాలను, అభయారణ్యాలను, దేవాలయాలను పర్యాటకులు సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి పులులు తెలంగాణ అటవీ ప్రాంతాల్లోకి వచ్చేలా సానుకూల పరిస్థితులను నెలకొల్పాలన్నారు. సాధారణ టూరిజం కాకుండా కాన్సెప్ట్ టూరిజంపై దృష్టి సారించాలని, ప్రస్తుతం ట్రెండింగ్‌గా ఉన్న డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు అనువైన ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య పెరిగిందని సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపైన అధ్యయనం చేయాలని, ఎయిర్‌పోర్ట్ నుంచి 20 నిమిషాల్లో మెగా కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకునేలా సదుపాయాలు ఉండాలన్నారు. పర్యాటక శాఖ స్థలాల లీజులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. లీజు ముగిసినా ఖాళీ చేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి స్టేలు ఎత్తివేసేలా చూడాలని ఆదేశించారు. మంచి గుర్తింపు ఉన్న కంపెనీలకు పర్యాటక స్థలాలు లీజ్‌కు ఇవ్వాలని సూచించారు. పర్యాటక స్థలాల లీజు అంశంపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీఎం పేర్కొన్నారు.

ప్రజావాణి వల్ల టెంట్‌హౌస్ కల సాకారం

ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారికి ధన్యవాదాలు

బేగంపేట, పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణితో జనగామ జిల్లాకు చెందిన బాణాల రమేష్‌కు స్వయం ఉపాధి కింద టెంట్ హౌస్ మంజూరైంది. దీంతో మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన రమేష్ ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లను కలిసి ధన్యవాదాలు తెలియజేసి వారికి మిఠాయిలు అందజేశారు. జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన బాణాల రమేష్‌కు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీతో రుణం మంజూరుకు అనుమతి ఇచ్చింది. అయితే ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ మంజూరు చేసినా సిబిల్ స్కోర్ లేదని బ్యాంకు అధికారులు రుణం ఇచ్చేందుకు నిరాకరించారు. రమేష్ అప్పటికే బ్యాంకుకు కొంత అప్పు ఉన్నారు. దీంతో రుణం ఇచ్చేందుకు నిరాకరించారు. గత అక్టోబరులో ఈ విషయంపై ఆయన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ప్రజావాణి అధికారులు బ్యాంకు అధికారులతో సంప్రదింపులు జరిపి రమేష్‌కు రుణం ఇప్పించారు. దీంతో ఆయన శుక్రవారం ప్రజావాణికి వచ్చి టెంట్ హౌస్ దుకాణం ఏర్పాటు చేసుకుంటున్నానని, సబ్సిడీ దక్కేలా బ్యాంక్ రుణం మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిన్నారెడ్డి, దివ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్.. వండర్‌ఫుల్!

- అభివృద్ధి లో నియోజకర్గం ముందుకు
- ఉమ్మడి పాలమూరుకు మహర్దశ: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర
- విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి: ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- సాగునీటి ప్రాజెక్టులకు సీఎం రేవంత్ పెద్దపీట: జూపల్లి
- దేశంలోనే పెద్ద అల్పాహార కేంద్రం కొడంగల్‌లో ఏర్పాటు
- 8మండలాల్లోని 312 బడుల్లో 28వేల విద్యార్థులకు అల్పాహారం



కొడంగల్‌లో అల్పాహార కిచెన్ షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రులు

కొడంగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల అభివృద్ధి పనులతో త్వరలో కొడంగల్ రూపురేఖలు మారనున్నట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర అన్నారు. వెనకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాకు మహర్దశ పట్టిందన్నారు. తోటి మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డితో కలిసి శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో రూ.76 కోట్లతో అభివృద్ధి పనులకు దామోదర శంకుస్థాపనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మరో రూ.24.11 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం హరే రామ హరే కృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలోనే అతిపెద్ద అల్పాహార కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన హరే రామ హరే కృష్ణ ట్రస్టు ప్రతినిధులను దామోదర అభినందించారు. ట్రస్టు ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 28వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించడం సంతోషకరమన్నారు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో పలు బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్న హరే రామ హరే కృష్ణ ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. కొడంగల్ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సాగు, తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పక్కా ప్రణాళికతో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. హరే రామ హరే కృష్ణ ట్రస్టు సేవలు రాష్ట్ర నలుమూలలా విస్తరించాలని ఆకాంక్షించారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో అల్పాహారం ఏర్పాటుకు నిధులు కావాలని కోరగా తనపై ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. గత పదేళ్లలో జరగని మార్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. హరేరామ హరేకృష్ణ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద అల్పాహార కేంద్రాన్ని కొడంగల్‌లో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



బహిరంగసభ
మధ్యాహ్నం 3 గంటలకు
జీవీ గూడెం, నల్గొండ.
ఛలో నల్గొండ
గత దశాబ్ది పాలన విధ్వంసాన్ని సరిదిద్దిన.. ఏడాది ప్రజాపాలన
విజయోత్సవ సభ
7 డిసెంబర్ 2024
నీళ్లు, నిధులు, నియామకాలు జరగాలంటే తెలంగాణ ఏర్పాటు కావాలని బలిదానాలు చేసుకున్న తెలంగాణ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ..కాంగ్రెస్ పార్టీ ఒక ప్రాంతమంతా తుడుచుకుపెట్టుకుపోతుందని తెలిసినా.. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన..తల్లి సోనియాగాంధీ ఆత్మీయతను గుర్తుచేసుకుంటూ..
2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, గత పదేండ్లపాటు.. కోతల రాయుళ్లు కోటి కోతలు, లక్ష అబద్ధాలతో రాష్ట్రాన్ని భ్రమల్లో ముంచి.. 7 లక్షల కోట్ల అప్పులు చేయడమే కాకుండా.. కేంద్రంతో పేచీలు పెట్టుకొని ప్రజల్ని అభివృద్ధికి దూరం చేసి.. రాష్ట్రప్రగతిని అటకెక్కించి.. అవినీతి, అక్రమాలతో లక్షల కోట్లు మెక్కిన.. కల్వకుంట్ల కుటుంబం చెరలో బంధీ అయిన తెలంగాణను రక్షించి..
నల్లగొండ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న మూసీని శుద్ధీకరణ చేస్తూ..
బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ప్రారంభోత్సవం మరియు అడగ్గానే తిప్పర్తి, కనగల్ మండలాలకు జూనియర్ కాలేజీలను మంజూరీ చేసి నా ఆహ్వానం మేరకు బ్రాహ్మణవెల్లంలకు విచ్చేస్తున్న..
TELANGANA RISING
మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
స్వాగతం - సుస్వాగతం
బ్రాహ్మణవెల్లంల
కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు